


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తుతా

పెన్ను, గన్నుతో ఉద్యమించిన ధీశాలి సుద్దాల

లోపలి పేజీల్లో..

సంపుటి 07, సంచిక: 226 | బుధవారం | 17-07-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00



## మానవీయ కోణంలో నిర్ణయాలు

### ప్రజలకు ప్రయోజనం చేరేలా తీసుకోవాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదే
- ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ధ్యేయం
- జిల్లా కలెక్టర్లందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే
- నకిలీ విత్తనాలు తయారు చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకుని పనిచేయాలని, పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని జిల్లా కలెక్టర్లకు సిఎం దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు ప్రయోజనం తరువాయి 2లో

> “క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలి. కేవలం ఎసి గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదు. తాము చేపట్టే ప్రతి పని ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలి. జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ‘గతంలో పది పెద్ద జిల్లాలుండేవి. అప్పుడు పది మంది కలెక్టర్లే ఈ రాష్ట్రాన్ని అద్భుతంగా నడిపించారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. అప్పటితో పోలిస్తే కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. అప్పుడు పది మంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది కలెక్టర్లు కలిసికట్టుగా ఎందుకు చేయలేరు?
>
> – సిఎం రేవంత్‌రెడ్డి




## జస్టిస్ నరసింహారెడ్డి రాజీనామా

### విద్యుత్ ఒప్పందాలపై విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలన్న సుప్రీం ఆదేశం మేరకు నిర్ణయం

### సోమవారంలోగా కొత్త చైర్మన్‌ను నియమిస్తామని దేశ అత్యున్నత న్యాయస్థానానికి రాష్ట్ర సర్కార్ వెల్లడి

**న్యూఢిల్లీ :** తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై జరుగుతున్న విచారణ కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి తప్పుకున్నారు. విచారణ కమిషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, మాజీ సిఎం కెసిఆర్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరుగుతున్న సమయంలోనే ఆయన లేఖ రాశారు. భోజన విరామ సమయంలో న్యాయవాది ద్వారా, కోర్టుకు తన లేఖ పంపారు. లేఖను న్యాయవాదులు, సుప్రీంకోర్టుకు అందించారు. జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో మరొకరిని నియమించి ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కమిషన్ విచారణ కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. వచ్చే సోమవారంలోపు నూతన చైర్మన్‌ను నియమిస్తామని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. అంతకు ముందు కెసిఆర్ వేసిన పిటిషన్‌పై సుదీర్ఘవాదనలు జరిగాయి. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణితోనే జ్యుడీషియల్ విచారణ జరుపుతున్నారని కెసిఆర్ తరపు లాయర్ వాదనలు మొదలుపెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో పక్క రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని సిజెఐ ధర్మాసనానికి చెప్పారు. ఎన్నికలకు ముందే ప్రస్తుత సిఎం ఆర్‌టిఐ ద్వారా అనేక సమాచారాలు సేకరించి పెట్టుకున్నారని తెలిపారు. వాటి ఆధారంగా ముందస్తు ఆలోచనతోనే కక్షసాధింపు ధోరణితో ఇప్పుడు కమిషన్ వేశారన్నారు. విచారణ తరువాయి 2లో



### ఇక విచారణ కమిషన్‌లో కొనసాగలేను

న్యాయ వ్యవస్థ ప్రతిష్టను నిలబెట్టేందుకు ఒక సంకేతంగా తాను విచారణ కమిషన్‌లో కొనసాగాలని భావించడం లేదని విద్యుత్ కొనుగోలు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపైన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. విచారణ కమిషన్ చైర్మన్ పదవికి ఆయన మంగళవారం రాజీనామా చేశారు. విచారణ కమిషన్‌కు సంబంధించిన ఊహాజనితమైన వార్తలను నివారించేందుకే తాను మీడియా బ్రీఫింగ్ నిర్వహించానని స్పష్టం చేశారు. విచారణ కమిషన్ పురోగతిపై తాను రోజు తప్పించి రోజు మీడియా బ్రీఫింగ్ తరువాయి 2లో

## పాస్ బుక్ ఆధారంగానే...

### కుటుంబానికి రూ.2లక్షల పంట రుణమాఫీ

### రేపు లక్ష రూపాయల వరకు రైతు ఖాతాల్లో జమ

భూమి పాసుబుక్ పై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి రుణమాఫీపై పలు సూచనలు చేశారు. కేవలం కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డును ఉపయోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉండగా, రుణాలు ఉన్న రైతు ఖాతాల సంఖ్య 70 లక్షలేనన్నారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికి రుణాలు ఉన్నాయని, వారికి రుణమాఫీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రేషన్ కార్డులు తరువాయి 2లో



## అందరికీ ఆరోగ్యశ్రీ

### తెల్ల రేషన్ కార్డుతో లింక్ పెట్టొద్దు

### ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి

తెలంగాణ రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దని అధికారులకు సిఎం స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని సిఎం ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తరువాయి 2లో





## అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

### టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష

### రెండు రోజుల్లో జీవో జారీచేస్తాం : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. ఇకపై పదవీ విరమణ చేసే సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తామని తెలిపారు. రెండు మూడు రోజులలో దీనికి సంబంధించి జీవో జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ లోని రహమత్ నగర్‌లో జరిగిన తరువాయి 2లో

## జులై 21న అఖిలపక్ష భేటీ

### టిఎంసి గైర్హాజరయ్యే అవకాశం!



**న్యూఢిల్లీ :** వచ్చే సోమవారం నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జులై 21 (ఆదివారం)న అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు నేతృత్వంలో ఆదివారం ఉదయం 11 గంటలకు సమావేశం జరగనున్నట్లు మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అన్ని పార్టీలకు చెందిన ఫ్లోర్ లీడర్లు ఈ భేటీకి హాజరైనట్లయితే.. ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ హాజరుకావడం ఇదే తొలిసారి కానుంది. అయితే, ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ గైర్హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. జులై 21న ఆ పార్టీ అమరవీరుల దినోత్సవంగా తరువాయి 8లో

## వలస కార్మికులకు రేషన్ కార్డులివ్వండి

### రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ : రేషన్ కార్డుల కోసం ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్న రాష్ట్రాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ–శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. అయితే, తరువాయి 2లో

## బలం తగ్గినా... వేగంగా కార్పొరేట్ ఎజెండా

### విద్వేష రాజకీయాలు, మతతత్వం, నయా ఉదారవాద విధానాలు అమలుచేస్తున్న బిజెపి

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా విమర్శ

**న్యూఢిల్లీ :** బిజెపి కేంద్రంలో ఏక పార్టీగా పరిపాలించే అవకాశం కోల్పోయినప్పటికీ, ఆ పార్టీ విద్వేష రాజకీయాలు, మతతత్వం, నయా ఉదారవాద విధానాలు, కార్పొరేట్ ఎజెండాను మరింత వేగంగా అమలు చేస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య నిర్మాణాన్ని పరిరక్షించేందుకు లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష శక్తుల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడమనే ప్రాథమిక కర్తవ్యాలను శక్తివంతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లక్ష్యం కోసం ఇండియా కూటమికి పార్లమెంటు లోపల, వెలుపల మద్దతను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయంఅజయ్ భవన్‌లో జూలై 13 నుండి 15 వరకు మూడు రోజుల పాటు పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి బంత్ సింగ్ బ్రార్ అధ్యక్షతన సిపిఐ జాతీయ సమితి సమావేశాలు జరిగాయి. సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, డాక్టర్ బి.కె.కాంగోలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమితి సమావేశ నిర్ణయాలను రాజా వెల్లడించారు. సమావేశంలో పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై లోతుగా చర్చించినట్లు ఆయన తెలిపారు.




**రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనను ప్రజలు ఓడించారు**

బిజెపికి మెజారిటీ స్థానాలు ఇవ్వకుండా రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచనలను ఓడించిన, ఇండియా కూటమిని ప్రధాన ప్రతిపక్షంగా నిలబెట్టిన భారతదేశ ప్రజలకు సిపిఐ జాతీయ సమితి అభినందనలు తెలియజేసిందని రాజా తెలిపారు. భాగస్వామ్య పక్షాల మధ్య సరైన పద్ధతిలో సీట్ల పంపిణీ, పరస్పర సర్దుబాటు కలిగి ఉంటే ఇండియా కూటమి మరింత మెరుగైన స్థితిలో ఉండేదని వ్యాఖ్యానించారు. వీటన్నిటినీ అధిగమించి ఇండియా తరువాయి 8లో



# రిపబ్లికన్‌పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థిగా డేవిడ్ వాన్స్ భార్య ఉషకు తెలుగు మూలాలు



తెలుగు అమ్మాయి ఉషా చిలుకూరి భర్త జేమ్స్ డేవిడ్ వాన్స్ (40) రిపబ్లికన్‌పార్టీ తరపున అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపిక కావడంతో భారతీయులకు ముఖ్యంగా తెలుగు వారికి కూడా అమెరికాలో ప్రాధాన్యం పెరిగింది. డోనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ తరపున అధ్యక్ష పదవికి పోటీ పడుతుండగా ఉషా చిలుకూరి భర్త జె డి వాన్స్‌ను ఉపాధ్యక్ష పదవికి ట్రంప్ ఎంపిక చేసుకున్నారు. జెడి వాన్స్ ప్రస్తుతం ఓహియో రాష్ట్రంలో సెనేటర్‌గా ఉన్నా రు. ఆయన పుస్తక రచయిత కూడా. ఆయన రాసిన "హిల్‌బిల్లీ ఎలెజీ" స్వీయా నుభవ చరిత్ర పుస్తకం 2016లో ప్రచురితమైంది. ఈ పుస్తకం బెస్ట్ సెల్లింగ్ బుక్‌గా మారింది. దీంతో వాన్స్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. 2020లో ఈ పుస్తకాన్ని దర్శకుడు రోన్‌హోవార్డ్ సినిమాగా తీశారు. వాన్స్ అమెరికాలో వర్కర్లు, రైతులు తరపున పనిచేస్తారని ట్రంప్ చాలా గట్టిగా విశ్వసిస్తున్నారు. పెన్‌సిల్వేనియా, మిచిగన్, విస్కాన్‌సిన్, ఓహియో, మిన్నెసోటాలలో రైతులకోసం, కార్మికుకోసం బాగా పనిచేస్తారని ట్రంప్ నమ్ముతున్నారు. రిపబ్లికన్‌పార్టీ జాతీయ సదస్సుకు హాజరైన ట్రంప్, డేవిడ్ వాన్స్ పక్కనే కూర్చున్నారు. ఈ సందర్భంగా వాన్స్ మాట్లాడుతూ, ట్రంప్‌పై జరిగిన హత్యా ప్రయత్నం ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

# రిపబ్లికన్ సదస్సులో ట్రంప్‌కు ఘన స్వాగతం



**మిల్వావుకీ :** పెన్‌సిల్వేనియా ర్యాలీలో హత్యా ప్రయత్నం నుండి బయటపడిన డోనాల్డ్ ట్రంప్ మిల్వావుకీలో జరిగిన రిపబ్లికన్‌పార్టీ నేషనల్ కన్వెన్షన్‌లో మంగళవారంనాడు మొదటిసారి పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆయనకు వేలాది మంది పార్టీ ప్రతినిధులు కన్నీళ్ళతో, కేరింతలతో ఆనంద బాష్పాలతో ఘన స్వాగతం పలికారు. వేలాదిమంది అనేకగంటలపాటు ఆయనకోసం ఎదురుచూశారు. కుడి చెవి మీదుగా తూటాలు దూసుకుపోవడంతో ఆయనకు రక్తస్రావం జరిగింది. కుడి చెవికి కట్టుకట్టుకుని చిరునవ్వులు చిందిస్తూ ట్రంప్ ఈ సదస్సులోకి నడిచి రాగానే హర్షధ్వానాలు, కేరింతలతో ఆయనకు ఘన స్వాగతం లభించింది. అనేకమంది వక్తలు గంటసేపు ప్రసంగించారు. ట్రంప్ మాట్లాడకపోయినప్పటికీ శిరస్సు వంచి వందనం చేస్తూ ఆందరికీ కృతజ్ఞత లు తెలియజేస్తూ చిరునవ్వులు చిందిస్తూ ట్రంప్ అందరినీ అలరించారు.

# రువాండా అధ్యక్షుడిగా మరోసారి పాల్ కగమే విజయం



**కిగాలీ:** తూర్పు ఆఫ్రికాదేశం రువాండా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత దేశాధ్యక్షుడు పాల్ కగమే (66) భారీ ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించినట్లు ప్రాథమికంగా వెల్లడైన ఫలితాల్లో తేలింది. అధ్యక్ష పదవికి, పార్లమెంటుకు సోమవారం నాడు పోలింగ్, మంగళవారంనాడు కౌంటింగ్ జరిగింది. 79 శాతం ఓట్ల కౌంటింగ్ పూర్తయ్యేనాటికి అందులో 99 శాతం ఓట్లు కగమేకు లభించాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. కగమే రువాండా పేట్రియాటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా కగమే ఎన్నికల్లో పోటీ చేశారు. 90 లక్షలమంది అర్హులైన ఓటర్లు రువాండాలో ఉన్నారు. మొట్టమొదటిసారి రువాండా పార్లమెంటుకు కూడా ఎన్నికలు జరిగాయి. 80 స్థానాలకుగాను 500 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ పడ్డారు. కగమే 1994 నుండి వివిధ హోదాల్లో అధికారంలో కొనసాగుతున్నారు. 2017 ఎన్నికల తరహాలోనే కగమే భారీస్థాయిలో ఏకపక్ష ఘన విజయం సాధించారు. 2000 సంవత్సరంలో కగమే మొదటిసారి దేశాధ్యక్ష పదవిలో కూర్చున్నారు. అప్పటినుండీ తిరుగులేకుండా అధికారం తన గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రతిపక్షాలను తీవ్రంగా అణచివేశారు.

డెమోక్రటిక్ గ్రీన్ పార్టీ ఆఫ్ రువాండా తరపున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వాతావరణ ఉద్యమవేత్త ఫ్రాంక్ హబినెజా (47) 53 శాతం ఓట్లు సంపాదించి రెండోస్థానంలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ జర్నలిస్టు, ప్రొఫెసర్, రచయిత ఫిలిప్ పయిమన (54) కూడా అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు న్యాయస్థానం, ఎన్నికల సంఘం అనుమతించాయి.

# వీసా లేకుండా థాయ్‌లాండ్ పర్యటన

## 93 దేశాల పర్యాటకులకు అనుమతి



**థాయ్ :** వీసాలేకుండా తమదేశంలో పర్యటించడానికి మరో 36 దేశాల పర్యాటకులకు కూడా థాయ్‌లాండ్ ప్రభుత్వం కొత్తగా అనుమతి ఇచ్చింది. దీంతో ఇప్పటివరకూ 93 దేశాలకు వీసా లేకుండానే థాయ్‌లాండ్‌లో పర్యటించడానికి అనుమతులు ఇచ్చినట్లయింది. శ్రీలంక, థాయ్‌లాండ్ తరహాలో పలుదేశాలు ఇదేవిధంగా పర్యాటకుల సంఖ్య పెంచుకోవడానికి భారీ ఆఫర్లు ఇస్తున్నాయి. థాయ్‌లాండ్ దేశం పూర్తిగా పర్యాటకుల ఆదాయంపైనే ఆధారపడి బతుకుతున్నది. కరోనా మహమ్మారి తర్వాత థాయ్‌లాండ్ ఆర్థిక పరిస్థితి దిగజారింది. దీంతో మొదటివిడతగా 57 దేశాలకు వీసా లేకుండానే పర్యటనలు చేసేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో కొంత సానుకూల ఫలితాలు రావడంతో మంగళవారంనాడు మరో 36 దేశాలకు వీసా లేకుండా పర్యటించే అవకాశాన్ని విస్తరించింది. ఈ కొత్త పథకం కింద ఆగ్నేయ ఆసియా దేశాలలోని పర్యాటకులు 60 రోజులపాటు థాయ్‌లాండ్‌లో వీసా లేకుండా ఎంజాయ్ చెయ్యవచ్చు. ఈ విధానం వల్ల ఈ ఏడాది మొదటి ఆరునెలల్లో కోటీ 75 లక్షలమంది పర్యాటకులు థాయ్‌లాండ్‌కు వచ్చారు.

చైనా, మలేసియా, భారత్‌కు చెందిన పర్యాటకులే థాయ్‌లాండ్‌కు ఎక్కువగా వస్తారు. థాయ్‌లాండ్ స్వర్ణాలయం, వైట్ శాండ్ బీచ్‌లు, సుందరమైన పర్వతాలు, ఉల్లాసభరితమైన రాత్రి వినోదాలకు థాయ్‌లాండ్ పేరుగాంచింది. ఈ కొత్త వీసా ఫ్రీ పథకం కింద దూరప్రాంతాల నుండి వచ్చి పనిచేసే కార్మికులు ఏడాదిలో 180 రోజులపాటు వీసా లేకుండా పనిచేసేవిధంగా ఐదేళ్ళపాటు అనుమతిస్తారు. గ్రాడ్యుయేషన్ తర్వాత ఏడాది పాటు విద్యార్థులు థాయ్‌లాండ్‌లో ఉండేందుకు, ఉద్యోగాలు చేసేందుకు కూడా అనుమతి ఇచ్చింది.

# మస్కట్‌లో కాల్పులు : నలుగురు పాకిస్థానీయులు సహా ఆరుగురు మృతి



**మస్కట్ :** ఒమ దేశం మస్కట్‌లో ఎన్నడూ జరగరాని ఘటన జరిగింది. మస్కట్ నగరం నడిబొడ్డున మసీదు సమీపంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పులలో నలుగురు పాకిస్థానీయులు సహా ఆరుగురు మరణించారు. మరో 30 మంది పాకిస్థానీయులు గాయపడ్డారు. వారికి ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు. ఈ విధమైన ఘటనలు ఒమన్‌దేశంలో చాలా చాలా అరుదు. అల్ వాడే అల్ కబీర్ ప్రాంతంలో జరిపిన ఈ కాల్పులలో ఇద్దరు ఉగ్రవాదులను కూడా కాల్చి చంపారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. సాక్ష్యాధారాలు సేకరించారు. ఐతే ఈ ఘటనకు సంబంధించి తదుపరి సమాచారాన్ని అధికార వర్గాలు తెలియజేయలేదు.

## అందరికీ ఆరోగ్యశ్రీ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు పారితోషికం పెంచాలని సిఎం తెలిపారు. సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల సమావేశంలో ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలను జారీ చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఆర్‌ఎంపి, పిఎంపిల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సిఎం సూచించారు. వీరికి ట్రైనింగ్ ఇచ్చి, సర్టిఫికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని, ఇందుకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేసి, కొత్తగా ఉత్తర్వులు (జిఓ) ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సిఎం చెప్పారు. ఆసుపత్రుల నిర్వహణ కోసం ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి బెడ్‌కు ఒక సీరియల్ నెంబర్ కేటాయించాలని ముఖ్యమంత్రి వైద్యశాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రుల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సిఎం చెప్పారు. స్థానికంగా స్వచ్ఛంద సంస్థల సహకారం, పరిశ్రమల నుంచి సిఎస్‌ఆర్ నిధులు తీసుకోవాలని, వ్యాపార వాణిజ్యవేత్తల భాగస్వామ్యం తీసుకుని వాటి నిర్వహణ మెరుగుపరిచే విధానాన్ని అవలంబించాలని ముఖ్యమంత్రి సూచించారు. అనుభవజ్ఞులైన స్పెషాలిటీ డాక్టర్లను ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి వైద్య సేవలకు వినియోగించుకోవాలని, మిగతా డాక్టర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సిఎం సూచించారు.

## కమిషన్‌లో కొనసాగలేను

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించానని, ఈ సందర్భంగా తన అభిప్రాయాలను తెలియజేశానని వివరించారు. తాను మీడియా బ్రీఫింగ్ నిర్వహించని రోజున తమ కమిషన్‌కు సంబంధించి ఊహాజనిత వార్తలు వచ్చేవని, తమ విచారణ కార్యాలయానికి విలేకరులు చాలా ఎక్కువ సంఖ్యలో వచ్చేవారని అన్నారు. బహిరంగ విచారణ జరగాలనే ఉద్దేశంతోనే తాను నోటిఫికేషన్లను జారీ చేసినట్టు నరసింహా రెడ్డి తెలిపారు.

## అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్

(మొదటి పేజీ తరువాయి)

'అమ్మ మాట అంగన్వాడీ బాట' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఈ ప్రకటన చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద పదవీ విరమణ పొందే టీచర్ కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం అందజేయనుంది. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి చెప్పారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, రెండు మూడు రోజుల్లో ఈమేరకు జీవో విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

## రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

జరుపుతున్న కమిషన్ చైర్మన్ ప్రెస్‌మీట్ పెట్టారని, కెసిఆర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చారు. ప్రెస్‌మీట్‌పై సిజెఐ ధర్మాసనం అభ్యంతరం వ్యక్తంచేసింది. కమిషన్ చైర్మన్ ప్రెస్‌మీట్‌లో, అభిప్రాయాలు వ్యక్తపర్చడం సరికాదని పేర్కొంది. విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలని ఆదేశించింది. కమిషన్ చైర్మన్‌ను మార్చేందుకు, తెలంగాణ సర్కార్ అంగీకరించింది. మధ్యాహ్నం మరో పేరును వెల్లడిస్తామని, తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈలోపే జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, కమిషన్ చైర్మన్‌గా తప్పుకుంటూ లేఖ రాశారు. కొత్త చైర్మన్‌ను నియమించి విచారణ కొనసాగించుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. సోమవారం లోపు నూతన చైర్మన్‌ను నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. తర్వాత కెసిఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు సిజెఐ ప్రకటించారు.

## రేషన్ కార్డులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే వారికి రేషన్ కార్డుల జారీ కోసం 100 శాతం వెరిఫికేషన్ పూర్తి చేశాయి. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ విషయాన్ని సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేగాక, కార్డులు జారీ అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలు కార్మికులకు రేషన్ అందజేయడం లేదని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు రేషన్ రావట్లేదని ఆయా రాష్ట్రాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఇది చాలా దురదృష్టకరమైన విషయం. నాలుగు నెలలైనా వెరిఫికేషన్ ప్రక్రియను ఎందుకు పూర్తిచేయలేదు. ఇప్పుడు మరో రెండు నెలలు గడువు కావాలని అడుగుతున్నారు. దీన్ని మేం ఆమోదించలేం. నాలుగు వారాల్లోగా అన్ని రాష్ట్రాలు వలస కార్మికుల వెరిఫికేషన్‌ను పూర్తి చేయాలి. ఒకవేళ రాష్ట్రాలు విఫలమైతే.. ఆయా కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తాం'' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

# ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వండి

## కమిషనర్లు, ఎస్‌పిలకు డిజిపి ఆదేశం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర డిజిపి జితేందర్ పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొనేందుకు పోలీసు అధికారులు హైదరాబాద్‌కు వచ్చారు.

డిజిపి కార్యాలయంలో మంగళవారం నాడు వారిని ఉద్దేశించి డిజిపి మాట్లాడారు. ఆయా జిల్లాలు, కమిషనరేట్లకు పంపిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని డిజిపి జితేందర్ అధికారులను ఆదేశించారు, ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం వల్ల ప్రజలు సంతృప్తి చెందుతారని చెప్పారు.

పోలీస్ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డిజిపి అధికారులను ఆదేశించారు. పోలీసు కమిషనర్లు, ఎస్పీలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీల చేయాలని ఆదేశించారు. తాను కూడా త్వరలోనే జిల్లాల వారీగా తనిఖీల చేపడుతానని వెల్లడించారు. తనతోపాటు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కూడా వివిధ జిల్లాల్లో తనిఖీలు చేపడతారని తెలియజేశారు. హిస్టరీ షీట్ల సమీక్షించాలని, ఆయుధాల లైసెన్సు జారీపై జాగ్రత్త వహించాలని, శాంతి భద్రతలు మెరుగైన నిర్వాహణ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డిజిపి జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును పర్యవేక్షించడంతోపాటు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ఆయన వివరించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరును అంచనా వేసేందుకు నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని డిజిపి సూచించారు.

గౌరవనీయులైన ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా, రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన డిజిపి, అవసరమైతే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు.

ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డిజిపి మహేశ్ ఎం భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి, అదనపు డిజిపిలు శిఖా గోయెల్, అభిలాష బిష్త్, వీవీ శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ కమిషనర్లు అవినాష్ మహంతి (సైబరాబాద్), జి. సుధీర్ బాబు (రాచకొండ), ఐజిపిలు ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (మల్టీ జోన్1), వి. సత్యనారాయణ (మల్టీ జోన్ II), ఎం రమేష్, కె. రమేష్ నాయుడు, నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా, ఇతర పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు సహా కీలక అధికారులు పాల్గొన్నారు.

# టి సాట్ ప్రసారాలకు ఇబ్బంది లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టి సాట్ నెట్వర్క్ ఛానల్స్ ప్రసారాలకు ఎటువంటి ఇబ్బంది లేదని టిసాట్ సిఇఒ బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. జి సాట్ 8 సిగ్నల్‌లో టి సాట్ విద్య, నిపుణ ఛానల్స్ ప్రసారాలు యాథవిధిగానే కొనసాగుతున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జి సాట్ 16 టెస్ట్ సిగ్నల్ మాత్రమేనని, టి సాట్ ప్రేక్షకులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు త్వరలో కొత్త జీ శాట్ 16 ఒప్పందం చేసుకోబోతున్నామని వేణు గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## పాస్‌బుక్ ఆధారంగానే...

(మొదటి పేజీ తరువాయి)

లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రుణమాఫీకి ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీ కోసమే ఉపయోగించాలని, వ్యక్తిగత, ఇతర రుణా ల మాఫీకి వినియోగించవద్దని సిఎం బ్యాంకర్లకు సూచించాలన్నారు. గతంలో కొందరు బ్యాంకర్లు అలానే చేస్తే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇప్పుడు అలాగే చేస్తామని సిఎం హెచ్చరించారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ జరిగే రైతులను రైతు వేదికల వద్దకు తీసుకురావాలని, ఆయా జిల్లాల మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఇతర ప్రజా ప్రతినిధులు రైతులతో ఆ సంతోషాన్ని పంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతు రుణమాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు ఉమ్మడి జిల్లాలకు చొప్పున ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామని, కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# మానవీయ కోణంలో నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)



చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని, కేవలం ఎసి గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదని అన్నారు. తాము చేపట్టే ప్రతి పని ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సి.దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, సిఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, పోలీసు కమిషనర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ప్రజాపాలన, ధరణి సమస్యలు, ఖరీఫ్ వ్యవసాయం, ప్రజారోగ్యం సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళాశక్తి, ఎడ్యుకేషన్, శాంతిభద్రతలు, డ్రగ్స్ నిర్మూలనపై సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులతో చర్చిం చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు తయారు చేసే కంపెనీలపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85 వేలు ఖర్చు పెడుతుందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సిఎం కలెక్టర్లకు సూచించారు. 'గతంలో పది పెద్ద జిల్లాలుండేవి. అప్పుడు పది మంది కలెక్టర్లే ఈ రాష్ట్రాన్ని అద్భుతంగా నడిపించారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. అప్పటితో పోలిస్తే కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. అప్పుడు పదిమంది చేసిన పనిని ఇప్పుడు 33 మంది కలెక్టర్లు కలిసికట్టుగా ఎందుకు చేయలేరు? ఎవరికి వారుగా మీ ఆలోచనలు, మీ పనితీరును సమర్థతను చాటుకోవాలి. ఇది ప్రజా ప్రభుత్వం. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ప్రజలకు విశ్వాసం కల్పించే బాధ్యత మీదే' అని సిఎం కలెక్టర్లకు మార్గదర్శకం చేశారు. కలెక్టరేట్లలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిఎం కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్‌లో ప్రజాభవన్‌కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందని, అదే మీ పనితీరుకు అద్దం పడుతుందని సిఎం అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందన్నారు.

**ఆగస్టు 15లోగా పెండింగ్ ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలి**

పెండింగ్ లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సిఎం ఆదేశించారు. 'ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి మార్చి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించిందని, కొత్తగా 1,15,308 దరఖాస్తు చేసుకున్నారు' అని అధికారులు వివరించారు. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అధికారులు తిరస్కరణకు కారణాన్నికూడా తప్పకుండా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. ఆగస్టు 15లోగా పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు.

**జిల్లాకో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం**

వివిధ జిల్లాలలో ఉన్న వనరులు, ప్రాంత పరిస్థితుల ఆధారంగా ప్రతి కలెక్టర్ ఒక్కో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వివిధ కార్యక్రమాలపై కలెక్టర్ల ముద్ర స్పష్టంగా ఉండాలన్నారు. జాతీయ రహదారులకు భూ సేకరణలో జాప్యం జరుగుతుండడంతో వ్యయం పెరుగుతోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధి పైనా దృష్టి సారించాలన్నారు. అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటడం వల్ల ఓ వైపు గిరిజనులకు ఆదాయం, మరో వైపు పచ్చదనం పెంపొందుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గిరిజనులకు ఆదాయం లేకనే పోడు వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, వారికి పట్టాలు ఇచ్చిన భూముల్లో మామిడి, సీతాఫలం, జామ వంటి పండ్ల మొక్కలు నాటిస్తే సీజన్ల వారీగా పండ్ల ద్వారా ఆ కుటుంబాలకు ఆదాయం వస్తుందన్నారు. మూడు నుంచి నాలుగేళ్లలో పంట వచ్చే హైబ్రిడ్ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం సూచించారు. ఆదాయం ఉన్నప్పుడు ఆ చెట్లను వారే రక్షిస్తారని, మరో వైపు పచ్చదనం ఉంటుందని సిఎం తెలిపారు. పలు అటవీ ప్రాంతాల్లో ఎకరాల కొద్ది ఖాళీ ఉందని, డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేయించాలని సిఎం సూచించారు. వికారాబాద్ హవా.. టీబీకా దవా అనే (వికారాబాద్ గాలి.. టీబీకి మందు) నానుడి ఉందని, కానీ ఇప్పుడు వికారాబాద్ అటవీ ప్రాంతం చాలా వరకు ఖాళీగా ఉందన్నారు. అక్కడ గతంలోలా ఔషధ మొక్కలు నాటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ ప్రాంతం ఉన్నా పులులు సంచారం లేదని, వాటికి అవసరమైన ఆవాసం, నీటి సౌకర్యం కల్పిస్తే అటవీ పర్యాటకం పెంపొందించవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దు**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడొద్దని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులతోనే కానీ నేరస్థులతో కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పబ్బులు విషయంలో టైమింగ్ పెట్టొచ్చని, ఆంక్షల పేరుతో రాత్రి వేళల్లో స్ట్రీట్ ఫుడ్ పెట్టుకునే వారిని ఇబ్బంది పెట్టవద్దని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఐటి రంగంలో వారు రాత్రి వేళల్లో పని చేయాల్సి ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

పోలీసులు రహదారులపై కనిపించాలని, పీరియాడికల్ క్రైమ్ రివ్యూ చేయాలని, కమిషనర్లు, ఎస్‌పిలు మొదలు ఎస్‌హెచ్‌ఓల వరకు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. డ్రగ్స్ విషయంలో పోలీసు, ఎక్సైజ్, టీజీ న్యాబ్ అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్ కేసుల్లో విదేశీయులు పట్టుపడుతున్నారని, వారు ఏ పని మీద రాష్ట్రానికి వస్తున్నారు, ఏం చేస్తున్నారనే దానిపై దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ నగర శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మానవ అక్రమ రవాణానియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

ఒకే చోట ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వసతిగృహాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వసతిగృహాలు ఒకే చోట ఉండేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో వాటికి స్థలాల ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎవరు ముందుగా స్థలాలు ఎంపిక చేస్తే వారికి వెంటనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. విద్యారంగానికి తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇప్పటికే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు మెరుగుపర్చామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు పాఠశాలలను తనిఖీ చేయాలని, డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసేలా చూడాలని ఆదేశించారు.

కల్తీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులు, యూరియా సిద్ధంగా ఉన్నాయని, సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే కలెక్టర్లు జాగ్రత్త వహించాలని మంత్రి అన్నారు. కొన్నిసార్లు కృత్రిమ కొరత సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ప్రయత్నం చేస్తారని, అటువంటివి జరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

# సిపిఐ జాతీయ కార్యదర్శులుగా అన్నీ రాజా, గిరీశ్ చంద్రశర్మ

## జాతీయ కార్యవర్గ ఆహ్వానితులుగా పశ్య పద్మ, జాతీయ సమితి ఆహ్వానితులుగా బాలమల్లేశ్



న్యూఢిల్లీ : సిపిఐ జాతీయ నాయకత్వంలో జాతీయ సమితి సమావేశం పలుమార్పులు చేర్పులను చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శులుగా అన్నీ రాజా, డాక్టర్ గిరీశ్ చంద్రశర్మలను ఎన్నుకుంది. అతుల్‌కుమార్ అంజాన్, కానం రాజేంద్రన్ మరణంతో కార్యదర్శివర్గంలో గతంలో ఖాళీలు ఏర్పడ్డాయి. అలాగే తెలంగాణకు చెందిన పశ్య పద్మను జాతీయ కార్యవర్గ ఆహ్వానితులుగా, ఎన్.బాలమల్లేశ్‌ను జాతీయ సమితి ఆహ్వానితులుగా తీసుకున్నారు. వీరితో పాటు జాతీయ కార్యవర్గంలోకి కె.పి.రాజేంద్రన్, అరవింద్ రాజ్ స్వరూప్, జాతీయ సమితిలోకి కె.డి.సింగ్, శ్రీకుమార్ ముఖర్జీ , ఆహ్వానితులుగా బిప్లబ్ భట్టా(పశ్చిమబెంగాల్)ను తీసుకున్నారు. ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్‌ను పూర్తి స్థాయి జాతీయ సమితి సభ్యునిగా, అధ్యక్షుడు విరాజ్‌దేవాంగ్ క్యాండిడేట్ సభ్యునిగా ఉండనున్నారు.

# పెన్నూ, గన్నుతో ఉద్యమించిన ధీశాలి సుద్దాల

### పుస్తకావిష్కరణ సభలో సురవరం, రాఘవులు, కూనంనేని



ప్రజాపక్షం/ హైదరాబాద్ : సబ్బండ వర్గాల బాధల విముక్తి కోసం సాగిన మహత్తరమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తెలంగాణలోని ప్రతి అంగుళం కమ్యూనిస్టుల రక్తంతోనో, వారి కుటుంబ సభ్యుల కన్నీళ్లతోనో తడిపి, నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడారని సిపిఐ జాతీయ మాజీ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆ పోరాటంలో సుద్దాల హనుమంతు తన కలంతో లక్షలాది మంది మెదళ్లలో చైతన్యం నింపడమే కాకుండా, గన్ను చేతబట్టి మహత్తరమైన ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ధీశాలి అని సురవరం కొనియాడారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం 'సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం–జీవితం' పుస్తకాన్ని సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు ఆవిష్కరించారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎస్‌వికె, ప్రజా నాట్యమండలి, తెలంగాణ ప్రజా నాట్యమండలి, టిపిఎస్‌కె, అరసం , తెలంగాణ సాహితీ, సుద్దాల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సభకు నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె.ఆనందచారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,విమలక్క, సుద్దాల అశోక్ తేజ, ఉత్తేజ్, రాపోలు సుదర్శన్, పల్లె నర్సింహా, కోయి కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటస్ఫూర్తితో నేడు కేంద్రంలో కొనసాగుతున్న మతోన్మాద, ఫాసిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షవాదులు, ప్రగతిశీల శక్తులు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ సమాజం మార్పు కృషిలో సాహిత్యవేత్తలదే కీలక పాత్ర అని, సమాజాన్ని విశ్లేషించడంలో అగ్రగణ్యులన్నారు.
కూనంనేని మాట్లాడుతూ మనిషి కేంద్రంగా ఉద్భవించిన సిద్ధాంతం కమ్యూనిజమని, ఇది కమ్యూనిజం అజరామరమని అన్నారు. ఇప్పుడు ఆధునిక ప్రపంచం ఎంత ముందుకు వెళుతున్నా అంతే శరవేగంగా దోపిడీ కూడా కొనసాగుతుందన్నారు.

# బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు : కోదండ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: అధికారం పోయిందని బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా పదే పదే చెప్పారని.. కెటిఆర్,హరీష్ రావులు కావాలనే ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. రుణమాఫీ విధి విధానాలు అందరికి తెలిసే విధంగా జీవో 567ని ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు భారతదేశంలో ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఏ పార్టీల ప్రభుత్వాలు కూడా చేయలేదని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు మాకు పాఠాలు చెప్తున్నారు, వాళ్ళ హాయంలో రైతు బంధు, రుణమాఫీ విషయంలో అన్ని అవకతవకలే అని అన్నారు. వాళ్ళు అధికారంలో ఉన్నప్పుడు రుణమాఫీ ప్రకటించి ఎంతమందికి ఇచ్చారో రైతులకు తెలుసన్నారు. రైతులు ఎవ్వరూ కంగారు పడొద్దు అందరికి రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు.

# షరతులు లేకుండా రుణమాఫీ చేయండి: హరీశ్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్: రేషన్ కార్డులు ఉన్నవారికే రుణమాఫీ చేస్తామనడం సరికాదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలోని మీడియా హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులను జారీ చేయకపోవడం ప్రభుత్వ తప్పు కాదా అని ప్రశ్నించారు. రుణమాఫీకి రేషన్ కార్డును కాకుండా పాస్‌బుక్‌ను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి షరతులను విధించకుండానే రుణాలు మాఫీ చేశామన్నారు. పిఎం కిసాన్ రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా అందలేదన్నారు. రైతు భరోసా విడుదల చేయాలన్నారు. శాసనసభ సమావేశాల్లో రుణమాఫీ అంశాన్ని ప్రస్తావిస్తామన్నారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా రైతుల ఆత్మహత్యలకు కారణం అవుతోందని ఆరోపించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే, బిఆర్ఎస్ తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తుందని హరీశ్ రావు హెచ్చరించారు.

### సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను స్వాగతించిన హరీశ్ రావు

రేషన్‌కార్డుకు ఆరోగ్యశ్రీకి లింకు పెట్టవద్దని సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు స్వాగతించారు. ఈమేరకు తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదే సూత్రాన్ని రైతు రుణమాఫీకి వర్తింపజేయాలని, రేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# అంగన్‌వాడీలతో ప్రభుత్వం ద్వైపాక్షిక చర్చలు జరపాలి

### తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ద్వైపాక్షిక చర్చలు జరపాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్,హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సాయీశ్వరీ, ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, ఉప ప్రధాన కార్యదర్శి సి.హెచ్.సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన జిఒను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే ద్వైపాక్షిక చర్చలకు అన్ని యూనియన్ల నాయకులను, వర్కర్లను ఆహ్వానించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు,హెల్పర్లకు ఇచ్చే పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

# సాయుధపోరాట యోధుడు కోట కృష్ణారెడ్డి మృతి



హైదరాబాద్ : తెలంగాణ సాయుధపోరాట యోధులు కోట కృష్ణారెడ్డి (98) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు ఒక కుమారు డు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొని అనేక నెలలు, సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారు. నల్లగొండ, వరంగల్‌లోని జైళ్లతో పాటు నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న మహారాష్ట్ర ప్రాంతం జాల్నా జైలులో కూడా శిక్ష అనుభవించారు. ఆయన స్వాతంత్ర్య సమరయోధులు గుంటగండ్ల పిచ్చిరెడ్డికి సహచరుడు కూడా. కృష్ణారెడ్డి స్వగ్రామం సూర్యాపేట జిల్లా మోతె మండలం బుర్కచర్ల కాగా, జైలు జీవితం అనంతరం వరంగల్ జిల్లా నర్సంపేట తాలూకా పసిర గ్రామంలో స్థిరపడ్డారు. ప్రస్తుతం కృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంట్లో ఉంటూ మంగళవారం తుదిశ్వాస విడిచారు.

# ఆర్‌టిసి కార్మికుల సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తుతా

### సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ఆర్‌టిసిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని అసెంబ్లీలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఐ శాసన సభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు ఆర్‌టిసి కార్మికులకు హామీ ఇచ్చారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం కార్మికుల సమస్యలపై మంగళవారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావును కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సాంబశివరావు వారిలో చర్చిస్తూ.. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ఆర్‌టిసి సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఆర్‌టిసిలో అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోవడం లేదని యూనియన్ నేతలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై దఫ దఫాలుగా ఉద్యమాలు చేసినా యాజమాన్యం నుండి గానీ, ప్రభుత్వం నుండి గాని ఎటువంటి స్పందనా రావడం లేదని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, అసెంబ్లీ లో ఈ విషయం లేవనెత్తాలని కోరారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల గురించి గతంలో అసెంబ్లీ లో తమ పక్షాన వాగ్ధాటితో మాట్లాడటం కార్మిక వర్గం అంతా చూసిందని గుర్తు చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఇపాయింటెడ్ డేట్ ప్రకటించాలి, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలి,2013 వేతన సవరణకు సంబంధించిన బాండ్ల బకాయిలు అందరికీ చెల్లించాలి,2017 వేతన సవరణకు సంబంధించిన ఎరియర్స్ తక్షణమే చెల్లిస్తూ అలవెన్సును అమలు చేయాలి, 2021 వేతన సవరణ ఏప్రిల్ మాసల నుండి అమలు జరగటం లేదని, ఇప్పటికి 4 సంవత్సరాలు గడుస్తూ ఉండటం వల్ల 25 శాతం ఇంటీరియమ్ రిలీఫ్ కార్మికులకు ఇవ్వాలని సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. డ్రైవర్ కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బ్రెడ్విన్నర్ స్కీమ్ నియామకాలను కన్సాలిడేటెడ్ విధానంలో కాకుండా రెగ్యులర్ విధానంలో చేపట్టాలని, 8 గంటల డ్యూటీలకు బదులు 12 నుండి 16 గంటలు చేయిస్తున్నారని. కాబట్టి పనిభారాలను తగ్గించాలని కోరారు.
యాజమాన్యం కార్మికులపై చేస్తున్న వేధింపులు ఆపాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా ప్రభుత్వ బడ్జెట్లో 5% బడ్జెట్ ప్రొవిజన్ ఆర్‌టిసికి కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇవ్వాల్సిన నెలకు రూ.350 కోట్లు ప్రతినెల పూర్తిగా ఆర్‌టిసికి ఇవ్వాలని, రూ.1200 కోట్ల సిపిఫ్ బకాయిలు, రూ.1100 కోట్ల సిసిఎస్ బకాయిలు వెంటనే చెల్లించాలని, రిటైరైన ఉద్యోగులకు మొత్తం సెటిల్మెంట్స్ వెంటనే ఇవ్వాలని ఇలాంటి అన్ని సమస్యలపై త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలు తమ పక్షాన వాదించాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ నేతలు వినతిపత్రంలో తెలిపిన సమస్యలపై అసెంబ్లీలో లేవనెత్తి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# పార్టీ ఫిరాయింపులపై చర్యలు తీసుకోండి

### స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల బృందం
### సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలి : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎంఎల్‌ఎలపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల ప్రతినిధుల బృందం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, తన్నీరు హరీశ్‌రావు,వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావుగౌడ్,వివేకానంద గౌడ్,మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్ తదితరుల బృందం నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనల ఘటనలపై చర్యలు తీసుకోవాలని, పార్టీ ఫిరాయింపుదారులపైన అనర్హత వేటు వేయాలని కోరారు.అనంతరం మీడియా పాయింట్‌లో కెటిఆర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలపైన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పార్టీ ఫిరాయింపులపైన మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని, ఇదే విషయాన్ని స్పీకర్‌కు గుర్తు చేశామని వివరించారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో 10 మంది ఎంఎల్‌ఎలు, ఆరుగురు ఎంఎల్‌సిలు, ఒక రాజ్యసభ సభ్యుడు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను కూడా స్పీకర్‌కు అందించామన్నారు. మణిపూర్‌లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన కాంగ్రెస్ ఎంఎల్‌ఎను అక్కడి స్పీకర్ ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేశారని గుర్తు చేశారు. మార్చి 18న దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుపైన పిటిషన్ ఇచ్చామని, తాజాగా మరో 9 మంది పిటిషన్లు స్పీకర్ చేతికి అందించామని కెటిఆర్ వివరించారు.

# రైతు రుణమాఫీ ప్రతి రైతుకు వర్తింపచేయాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంట రుణమాఫీ అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలు సవరించి వాటిలోని షరతులను ఎత్తివేసి కట్ ఆఫ్ తేదీల మధ్య ఉన్న పంట రుణాలన్నీ మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ప్రయత్నంగా కనబడుతుందని, వీటి వల్ల లక్షలాది మందికి రుణమాఫీ అందకుండా పోతుందని వారు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఆచరణలోకి వచ్చేసరికి అందరికీ రుణమాఫీ చెందకుండా షరతుల విధించడం సమంజసం కాదని వారు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం రుణమాఫీ కొందరికి చేసి, కొందరికి ఎగనామం పెట్టడంతో రైతుల ఆగ్రహానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ అందిస్తామని చెబుతూనే, కుటుంబాన్ని నిర్ధారించడానికి ఆహార భద్రత కార్డు ప్రామాణికంగా తీసుకుంటామని, రైతు రుణ ఖాతా ఆధార్, పాస్ బుక్ ఆధార్, రేషన్ కార్డ్ ఆధార్ లింకు ఆధారంగా రుణమాఫీ అమలు చేస్తామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ప్రధానమంత్రి కిసాన్ పథకం మినహాయింపులను పరిగణలోకి తీసుకోవాలని మార్గదర్శకాలలో పొందుపర్చడం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రుణమాఫీ ఎన్నికల వాగ్దానాన్ని తుంగలో తొక్కడమే అవుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబం నిర్ధారించుకోవడానికి రేషన్ కార్డు ప్రామాణికం అవసరం లేదని, భార్యాభర్తలు, మైనర్ పిల్లలు కుటుంబంగా పరిగణిస్తారని గత రుణమాఫీ సమయంలో ఇదే పద్ధతి అనుసరించార, ఇప్పుడు అదే పద్ధతి అనుసరించవచ్చని వారు తెలిపారు. అనేకమందికి రేషన్ కార్డులు లేవని, గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఉన్న కార్డులో కూడా చాలామందికి వివాహాలు అయి వారు వేరే కుటుంబంగా మారారని, దీని వల్ల అనేకమంది రుణమాఫీకి దూరమవుతారన్నారు. పిఎం కిసాన్ మినహాయింపులను పరిగణలోకి తీసుకోవడమంటే రాష్ట్ర ప్రభుత్వానికి రుణమాఫీ అమలు పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు 70 లక్షల మంది రైతులు ఉంటే కొద్దిమంది రైతు కుటుంబాలకు మాత్రమే పిఎం కిసాన్ అందుతున్నదని అన్నారు. ఒకవైపు ప్రతి రైతుకు రుణమాఫీ అందిస్తామని చెబుతూనే మరోవైపు ఇటువంటి షరతులు పెట్టి కోతలు పెడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదని, కరువు, వరదలు వచ్చినప్పుడు రుణాలు రీషెడ్యూల్ చేసుకున్నారని, గత ప్రభుత్వం కూడా రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు అన్యాయం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తుండడం విచారకరమన్నారు. రూ.2 లక్షలకు మించి ఉన్న మొత్తం కడితేనే మాఫీ వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అందరికీ రుణమాఫీ వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు నిలుపుదల చేసి ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, కాలయాపన చేయకుండా తక్షణం రుణమాఫీ అమలు చేయాలని, లేనట్లయితే ప్రజల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందని వారు హెచ్చరించారు.

# 'కరీంనగర్'కు తగిన బడ్జెట్

### కేటాయింపులు జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి బండికి మంత్రి పొన్నం బహిరంగ లేఖ



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం, ప్రత్యేకంగా కరీంనగర్ పార్లమెంటు సెగ్మెంట్ కోసం 2024–25 ఆర్థిక సంవత్సరానికి వచ్చే బడ్జెట్ సెషన్‌లో తగినంత బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచడంలో కేంద్ర ప్రభుత్వానికి తన మద్దతును అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర విభజన సమయంలో మన రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం నిబద్ధతగా వ్యవహరించాలని కోరారు. రాష్ట్రానికి కేంద్రం నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రిగా తమ పాత్ర కీలకమైనదని గుర్తు చేశారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైన బడ్జెట్ కోసం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల గురించి దృష్టికి తీసుకువస్తున్నానని పేర్కొన్నారు. అందులో 1) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, 2) మిడ్ మానేరు, గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసిత బాధిత కుటుంబాలకు సూక్ష్మ , చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన.3) శాతవాహన విశ్వవిద్యాలయానికి రూ.200 కోట్ల ఆర్థిక సహాయం. 4) కరీంనగర్‌తిరుపతి మధ్య నడిచే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి రోజు నడిచేలా చేయాలి. 5) కరీంనగర్, షిర్డీ మధ్య రైల్వే మార్గం డబ్లింగ్‌ను వేగవంతం చేయడం. 6) హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ మంజూరు. 7) కొత్తపల్లి నుంచి జనగాం జాతీయ రహదారి మంజూరు. 8) సిరిసిల్ల టెక్స్ టైల్ పార్కు అభివృద్ధికి నిధులు. 9)వేములవాడ, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి నిధులు. 10) ఎన్ఎల్ఎం, పిఎంఈజి, ఎన్‌హెచ్‌ఎం పథకాల కింద తగినంత బడ్జెట్ కేటాయింపు. రాబోయే బడ్జెట్ సమావేశాలలలో పైన పేర్కొన్న అభివృద్ధి పనులను కార్యరూపం దాల్చేందుకు కరీంనగర్ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఉపయోగించాలని కోరారు.

# మొహర్రంకు భారీ బందోబస్తు

### సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు చెక్‌పోస్టులు
### పలు ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్లింపు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాతబస్తీలో మొహర్రం ఉత్సవాలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. మంగళవారం సౌత్‌జోన్ డిసిపి స్నేహా మెర బందోబస్తును పర్యవేక్షించారు. పాతబస్తీలో పనిచేసి ఇతర జిల్లాలలో విధులు నిర్వహిస్తున్న ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లను కూడా బందోబస్తులో వినియోగిస్తున్నారు. పాతబస్తీలో పనిచేసి అనుభవం కలిగిన అధికారులను నియమించడం వల్ల శాంతి భద్రతలను మరింత కట్టుదిట్టంగా అరికట్టవచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. డబీర్‌పురా, పురానీహవేలీ, చార్మినార్, సెట్విన్, యాకుత్‌పురా, మదీనా, ఛాదర్‌ఘాట్, చీరాగల్లి, చెత్తాబజార్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, బార్కాస్ తదితర సమస్యాత్మక ప్రాంతాలలో గట్టి నిఘాతో పాటు పోలీసు పెట్రోలింగ్‌ను పెంచారు. ఇక ప్రత్యేకంగా అంబులెన్స్‌లతో పాటు ఫైరింజన్‌లను కూడా రంగంలోకి దింపారు. ఇప్పటికే పాతబస్తీలో శాంతికమిటీలతో పోలీసులు పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సహకారాలు కూడా తీసుకుంటున్నారు. మొహరం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ నియంత్రణ కోసం బారికేడ్లతో పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మొహరం ఉరేగింపులో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా ఉండేందుకు వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ, జిహెచ్‌ఎంసి, వైద్య అధికారులు పర్యవేక్షిస్తున్నారు. బీబీకా అలవా నుంచి ప్రారంభమయ్యే ఏనుగు ఊరేగింపు పంజేషా, చార్మినార్ మీరాలంమండి మీదుగా ఛాదర్‌ఘాట్‌కు చేరుకుంటుంది.

# యువ దంపతులు ఆత్మహత్య



ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : దంపతులపై దుష్ప్రచారం చేస్తున్నారని, చుట్టాలు బంధువులతో పిన్ని లేని పోనివి కల్పించి చెప్పడం తట్టుకోలేకపోతున్నామంటూ సెల్ఫీ వీడియో పోలీసులకు పంపి రైల్ కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నవీపేట్ మండలం ఫకీరాబాద్ మిట్టాపూర్ మధ్యలో జరిగింది. రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి నిజామాబాద్ జిల్లాలోని పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన అనిల్(28) శైలజ(24)కు యేడాదిన్న కిందట వివాహం జరిగిందని, బంధువుల వేధింపుల దుష్ప్రచారం తట్టుకోలేక తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు దంపతులిద్దరు సెల్‌ఫోన్ నుంచి సెల్ఫీ వీడియోను రికార్డు చేసి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నామని తమ బాధను వీడియో రూపంలో చిత్రీకరించి కోటగిరి ఎస్ఐ సందీప్‌కు పంపించారని, వెంటనే అప్రమత్తమైన పోలీసులు నవీపేట్ ఎస్ఐ యాదగిరిగౌడ్‌కు సమాచారం అందించగా నవీపేట్ పోలీసులు బాసర గోదావరి నది తీరాన గాలించగా వారి ఆచూకీ దొరకకపోవటంతో సెల్‌ఫోన్ ట్రేస్ చేసి చూడగా ఫకీరాబాద్ మిట్టాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్నట్లు గుర్తించామని ఆ దంపతులను కాపాడటానికి పోలీసులు చేసిన ప్రయత్నం ఫలించలేదని చివరికి పోలీసులు ఫకీరాబాద్‌మిట్టాపూర్ గ్రామ పరిసర ప్రాంతాలలో రైల్వే పట్టాలపై వారి మృతదేహాలను గుర్తించామని పోలీసులు ఎంతో కష్టపడి సెల్‌ఫోన్ ట్రేస్ చేసి ఆచూకీ పట్టుకున్న గానీ ఫలితం మాత్రం శూన్యం కావటంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

# సుప్రీం తీర్పుపై కెసిఆర్ భుజాలు తడుముకుంటుండు : మధుయాష్కి



ప్రజాపక్షం/హైదరాబాద్: సుప్రీం కోర్టు తీర్పుపై కెసిఆర్ భుజాలు తడుముకుంటుండని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు టెక్నికల్ పాయింట్స్ పైనే జడ్జిని మార్చి కొత్త జడ్జితో విచారణ చేయమన్నదన్న విషయం బిఆర్ఎస్ నేతలు గ్రహించాలన్నారు. పింకీ తమ్ముళ్లు సంబరపడకండి .. జడ్జిమెంట్‌ను తెలుసుకోండని అన్నారు. తప్పు చేయకుంటే విచారణ కమిషన్ ముందు హాజరుకావొచ్చుగా అని ప్రశ్నించారు. పది ఏండ్లలో కెసిఆర్ కుటుంబం 80 వేల కోట్ల అవినీతి చేశారని ఆరోపించారు. గతంలోనే విద్యుత్ కొనుగోలులో అవినీతి జరిగిందని గతంలోనే చెప్పానని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే విద్యుత్ ఒప్పందాల పేరిట 133 కోట్లు కమిషన్ కెటిఆర్, హరీష్ రావులు తీసుకున్నారని గోవాలో జరిగిన ఒక సమావేశంలో వ్యాపారవేత్తలు వాపోయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ విభాగము
జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, కొత్తగూడెం
E-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు
NIT No.15/2024-25 to 16/2024-25 dt. 15-07-2024
ఈ దిగువ సంతకందారుచే DMF(T)&MPLADS పథకముల క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని(02) పనుల కొరకుగాను అంచనా విలువ రూ.14.90 లక్షలు ఆన్‌లైన్‌లో రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి పిలవబడుతున్నది. ECV, EMD ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు ది.22.07.2024 నుండి లభించును. భవిష్యత్తులో ఏవైనా సవరణలు, నిబంధనలలో మార్పులు ఉన్నచో పై వెబ్‌సైట్ల నుండి మాత్రమే ప్రచురించబడును.
సం/–జిల్లా పిఆర్ ఇంజనీర్
పిఐయు కొత్తగూడెం
DIPR R.O.No.:309-DP/CL/ADVT/1/2024-25 dt.16.07.2024

ప్రజాపక్షం
బుధవారం, జులై 17

## రెండు ఘన కార్యాలకు శ్రీకారం

రైతులను, నిరుద్యోగులను ఆదుకునే రెండు ఘనమైన కార్యక్రమాలకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి శ్రీకారం చుట్టింది. మొదటిది, గత పదేళ్లలో ఎన్నడూ జరగని విధంగా అనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, గత ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లు రూ.2 లక్షల వరకు రైతులకు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను ఈనెల 18వ తేదీన రూ.1లక్షతో మొదలుపెట్టి ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నాటికి పూర్తిగా రద్దు చేయనుంది. ఇది తెలంగాణ కొత్త రాష్ట్రంలో దాదాపుగా గత పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ స్థాయిలో ఎన్నడూ అమలు జరపని సాహసోపేతమైన చర్య. కెసిఆర్ ప్రభుత్వం రైతు రుణమాఫీ వాగ్దానాలు చేయకపోలేదు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి తొలి ప్రభుత్వ పదవీకాలంలో 35 లక్షల రైతులకు ఐదు సంవత్సరాల్లో నిక్కి నీల్గి రూ.16,144 కోట్లు రుణం రద్దు చేయటానికి ఐదేళ్లు పట్టింది. అది ఐదు సంవత్సరాల్లో నాలుగు కిస్తీల్లో బ్యాంకులకు చెల్లించింది. అసలుకు 40.68లక్షల రైతులకు అది రూ.25,916 కోట్లు రుణం రద్దు చేయాల్సి ఉంది. రద్దును కుటుంబంలో ఒక సభ్యునికి పరిమితం చేయటం ద్వారా లబ్దిదారుల సంఖ్య తగ్గింది. 36.68 లక్షల రైతులకు రుణ మాఫీకి రూ.20,141 కోట్లు అవసరమని బ్యాంకులు లెక్కకట్టాయి. కెసిఆర్ ప్రభుత్వం 6 లక్షలమంది రైతులకు రూ.30వేల రుణం వరకు బ్యాంకులకు చెల్లించింది. రైతుల నిరసనతో చంద్రశేఖరరావు మిగిలిన 17 లక్షలమంది రైతులకు రూ.7,753 కోట్లు విడుదల చేస్తామని ఎన్నికలకు ముందు 2023 ఆగస్టులో ప్రకటించారు. ఆ విధంగా అది అధికారం కోల్పోయే నాటికి 23 లక్షల రైతులకు రుణమాఫీ చేసింది; 13 లక్షలమందిని గాలిలో వదిలేసింది. ఈ 13 లక్షల మంది రైతులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆదుకుంటున్నది.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫామ్‌హౌస్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, కొండలు, గుట్టలకు సైతం రుణమాఫీ ప్రకటించటంతో ప్రజాధనం దుర్వినియోగమైంది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం దుబారాను అరికడుతూ వాస్తవ సాగుదార్లకే, రేషన్ కార్డు ఆధారంగా రూ.2లక్షల వరకు రైతు రుణం మాఫీ చేయాలని నిర్ణయించటంతో బిఆర్ఎస్ తప్పుడు ఆరోపణలతో రాజకీయ లబ్ది కోసం గుస్సా అవుతున్నది. అలాగే వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం ప్రభుత్వం ఇచ్చే 'రైతు భరోసా'ను కూడా 10 ఎకరాలలోపు చిన్న, సన్న కారు రైతులకే చెల్లించాలని జిల్లాల్లో రైతుల సమావేశాల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించి అనర్హులను ఏరివేయనుంది. రేషన్‌కార్డులు, పిడిఎస్ సరుకులు, ఆసరా పెన్షన్‌లు లాంటి బృహత్ కార్యక్రమాల అమలులో కూడా దుర్వినియోగాన్ని అరికడితే, అలా ఆదా అయ్యే సొమ్ము మరికొందరు ఇతర అర్హులకు లబ్ది చేకూర్చేందుకు ప్రయోజనకారి అవుతుంది. ఏమైనా, రుణమాఫీ పథకం ఎంత కట్టుదిట్టంగా, పకడ్బందీగా అమలు జరిపినా దొంగల చేతివాటం ఉండకపోదు. ఈ లీకేజీలను అరికట్టగలిగితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

ఇక ప్రభుత్వ రెండో ఘనకార్యం, దాదాపు 11వేల ప్రభుత్వ టీచర్ పోస్టుల భర్తీకి దశాబ్దం తర్వాత ఈనెల 18 నుండి 30 వరకు డిఎస్‌సి నిర్వహించటం. అలాగే పదేళ్లుగా ప్రశ్నాపత్రం లీకేజీలతో రద్దయిన గ్రూపు–1, గ్రూపు–2, గ్రూపు–3 పరీక్షలను కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం పట్టుదలతో ఉంది. 563 పోస్టుల భర్తీకి అక్టోబర్ 22 నుండి గ్రూపు–1 783 పోస్టుల భర్తీకి ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూపు–2 పరీక్ష, 1300లు పైన పోస్టుల భర్తీకి నవంబర్‌లో గ్రూపు–3 పరీక్షలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే, డిఎస్‌సి పరీక్షల ప్రిపరేషన్‌కు టైం చాలదంటూ పరీక్షలు వాయిదా వేయాలని, గ్రూపు 1 పరీక్షల్లో రిక్రూట్‌మెంట్‌ను 1:100 పెంపుచేయాలని కొద్దిరోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఈ సున్నితమైన సమస్యను పోలీసు బలగంతోగాక చర్చలతో పరిష్కరించుకోవాలి.

# బిజెపికి ఓటేయని హిందువులను ఏం చేస్తారు?

## తమకు ఓటేయని ముస్లింలు, యాదవులను పట్టించుకోరట! ప్రమాణాన్ని ఉల్లంఘించిన కేంద్రమంత్రి!



ఎం. కోటేశ్వరరావు

"ముస్లింలు నాకు ఓటు వేయలేదు. కాబట్టి ఇప్పుడు నేను కూడా వారికోసం పనిచేయటం లేదు. నా ప్రాంతంలోని ఒక మౌల్వీ ఒక ఇల్లు, ఉజ్వల గ్యాస్, ఐదులక్షల రూపాయల ఆయుష్మాన్, మరుగుదొడ్డి, రేషన్ కార్డు కూడా పొందాడు. నాకు ఓటువేసి ఉంటే ప్రమాణం చేసి చెప్పాలని నేను అడిగాను, అతనా పనిచేయలేదు. నా హృదయం ముక్కలైంది. ఇది సనాతన ధర్మాన్ని బలహీన పరిచేందుకు, భారత్‌పై ముస్లిం యుద్ధం (ఘజ్వా ఏ హింద్ ) చేసేందుకు పక్కాగా రూపొందించిన ఒక వ్యూహం".తెల్లారగానే సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ సుప్రభాతంతో జనాన్ని నిద్రలేపే కారణజన్ముడైన దేవుని బిడ్డ నరేంద్రమోడీ గురించి తెలిసిందే. అలాంటి దైవాంశసంభూతుడి మంత్రివర్గ సభ్యుడైన జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మూడోసారి అధికారానికి వచ్చిన తరువాత తాజాగా ఎక్స్ ఖాతాలో వెల్లడించిన అభిప్రాయమిది. రాజ్యాంగం ప్రకారం కేంద్ర మంత్రిగా "నా బాధ్యతలను నమ్మకంగా మరియు మనస్సాక్షిగా నిర్వర్తిస్తాను. రాజ్యాంగం మరియు చట్ట ప్రకారం అన్ని రకాల ప్రజలకు భయం లేదా అభిమానం, ఆప్యాయత లేదా దురుద్దేశ్యం లేకుండా న్యాయం చేస్తాను" అని ప్రమాణ స్వీకారం చేసిన కేంద్రమంత్రి దాన్ని ఉల్లంఘించారు. ఇందుకు గాను అతగాడిని మంత్రి వర్గం నుంచి ప్రధాని తొలగించాలి, లేదా రాజ్యాంగాన్ని కాపాడాల్సిన రాష్ట్రపతి తన బాధ్యతను నిర్వర్తించాలి. ఏదీ జరిగే సూచనలు లేవు.

ఘజ్వా ఏ హింద్ అనే పదాన్ని ఇటీవల అనేక మంది ముఖ్యంగా హిందూముస్లిం మతోన్మాదులు, ఉగ్రవాదులు, కొన్ని మీడియా సంస్థల జర్నలిస్టులు రెండు మతాలవారినీ రెచ్చగొట్టేందుకు వినియోగిస్తున్నారు. కొంతమంది ఇస్లామిక్ పండితులు దాని అసలు అర్ధాన్ని వక్రీకరిస్తున్నారని వివరణ ఇచ్చారు. దాని సారం ఏమిటంటే మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలకు తప్పుడు భాష్యం చెబుతున్నారు. దానితో విబేధించే పండితులు కూడా ఉన్నారు. క్రైస్తవం మీద తిరుగుబాటులో భాగంగా ఇస్లాం ఉద్భవించింది. క్రీస్తుశకం 530వ సంవత్సరంలో జన్మించిన మహమ్మద్ ప్రవక్త 632జూన్ ఎనిమిదిన మరణించాడు. ఎవరి భాష్యం ఎలా ఉన్నప్పటికీ నాడు చెప్పిన అంశాలు నేడు వర్తించవన్నది తెలిసిందే. ఈ అంశాలలో హిందూముస్లిం మతశక్తులు బొమ్మా బొరుసు వంటివి. సమాజాన్ని వెనక్కు తీసుకుపోవాలని రెండూ చెబుతున్నాయి. అరబ్బీ లో ఘజ్వా అంటే యుద్ధం. భారత ఉపఖండం మీద దాడిచేసి ఇస్లాం భావజాలాన్ని వ్యాపింప చేయాలని ప్రవక్త చెప్పాడని, దాన్ని కొనసాగించాలని ముస్లిం తిరోగమన వాదులు నిత్యం రెచ్చగొడుతుంటారు. ముస్లింలు ఇప్పటికీ ఘజ్వాను వదల్లేదని అందువలన వారి దాడినుంచి హిందూ లేదా సనాతన ధర్మాన్ని కాపాడాలంటూ హిందూ తిరోగమన వాదులు పదేపదే దాన్ని ఆయుధంగా చేసుకుంటున్నారు. నిజానికి సనాతనం అంత గొప్పదైతే మరి అంటరానితనం, వివక్షలనే కాన్సర్లు మన సమాజంలో ఎలా విస్తరించాయి? మహానుభావుడు అంబేద్కర్‌కు సనాతనం గురించి తెలియదా? పక్కాగా తెలుసు, నాటి సనాతనుల ఆచరణను చూసే దాన్ని వ్యతిరేకించి బౌద్ధంలోకి మారిన సంగతి తెలిసిందే. అంటరాని తనంతో సహా అనేక వివక్షలను రుద్దిన మనుస్మృతిని అమలు జరపాలని అంటే దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు బిజెపికి దూరం అవుతారనే భయంతో దాని బదులు సనాతన ధర్మం అనే పల్లవిని అందుకున్నారు. ఇది కూడా ఎంతో కాలం నడవదన్నది వేరే సంగతి.

దానిలో భాగంగానే హిందూ దేవాలయాలు, యాత్రా ప్రాంతాలలో ఉన్న ముస్లింల దుకాణాల ను మూసివేయాలి. ముస్లిం పేర్లతోనే ముస్లింలు ధాబాలను ఎందుకు తెరవరు? కన్వర్ యాత్రీకులను మోసం చేసేందుకు ముస్లిం ధాబాల యజమానులు హిందూ పేర్లు పెడుతున్నారు, పేర్లు ఎందు కు మార్చాలి, ధాబాలను ఎందుకు తెరవాలి అంటూ విశ్వహిందూ పరిషత్ ప్రశ్నిస్తోంది. సంఘపరివార్ ఏర్పాటు చేసిన సంస్థలకు చెందిన వారు, దాని మతోన్మాద వైరస్ బారిన పడినవారు ఇలాంటి విద్వేషాన్ని వెళ్లగక్కటం తెలిసిందే. అఫ్‌కోర్సు అలాంటి వాటిని అలఓకగా వెల్లడించే వారి లో పేరుమోసిన వ్యక్తి గిరిరాజ్ సింగ్ అన్నది తెలిసిందే. ఇలా మాట్లాడటం తగదని తన సహచరుల కు నరేంద్రమోడీ అంతర్గతంగానైనా చెప్పి ఉంటే గిరిరాజ్ సింగ్ లాంటి వారు, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థలు పదేపదే రెచ్చిపోతాయా? దైవాంశ సంభూతుడిని తిరస్కరిస్తాయా? మీరంతా నిమిత్త మాత్రులు, మీతో చెప్పించేది, చేయించేదీ అన్నీ నేనే అనే భగవద్గీత సారం తెలిసిందే. చెప్పేవి శ్రీరంగ నీతులు దూరేవి ...గుడిసెలు అనే సామెత తెలిసిందే కనుక టీకా తాత్పర్యాలు అవసరం లేదు.

మన దేశంలో ఇలాంటి పరిస్థితి ఉంది గనుకనే నరేంద్రమోడీ మూడవసారి అధికారానికి వచ్చిన తరువాత అమెరికా మత స్వేచ్ఛ నివేదికలో మైనారిటీలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులు, విద్వేష ప్రచారం గురించి పేర్కొన్నారు. ప్రతి ఏటా అమెరికా నివేదికల్లో ఈ అంశాలను ప్రస్తావిస్తూనే ఉన్నారు. వాటిని ఒకవైపు మోడీ సర్కార్ ఖండిస్తున్నదీ, తిరస్కరిస్తున్నది. నిజం ఏమిటో మన జనానికి తెలియదా ?

ఆరునెల్లు గడిస్తే వారు వీరవుతారు అన్నట్లు గా బిజెపితో చేతులు కలిపిన ఇతర పార్టీలు కూడా దాని భావజాలాన్ని, విద్వేషాన్ని తలకెక్కించుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేయ ని యాదవులు, ముస్లింల కోసం తాను ఎలాంటి పనులు చేయనని బీహార్‌లోని నితీష్ కుమార్ పార్టీ జెడియు సీతామరి ఎంపీ దేవేష్ చంద్ర ఠాకూర్ ఇటీవల ప్రకటించారు. యాదవులు, ముస్లింలు తన వద్దకు వస్తే స్వీట్లు పెట్టి, టీ ఇచ్చి పంపుతాను తప్ప వారికి ఎలాంటి పనులూ చేయనని అన్నారు. హృదయంలో చెలరేగిన భావాలతోనే ఠాకూర్ అలా మాట్లాడినట్లు అదే రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ అతగాడిని సమర్ధించారు. కేంద్రం, రాష్ట్రం అమలు జరిపిన పథకాలతో లబ్ది పొందిన ముస్లింలు తనకూ ఓట్లు వేయలేదన్నారు. దీనికంతటికీ మంగళసూత్రాలు లాక్కుంటారంటూ ప్రతిపక్షాల మీద ప్రధాని నరేంద్రమోడీ చేసిన తప్పుడు ప్రచారమే కారణమని ఆర్‌జెడి విమర్శించింది.

ఎంపిలు, ఎంఎల్ఏలు నియోజకవర్గాల్లో ఉన్న అందరికీ చెందిన వారు తప్ప ఒక కులం, మతాని కో ప్రాతినిధ్యం వహించే వారు కాదని, రాజ్యాంగం మేరకు దేశం నడుస్తున్నది తప్ప కొంత మంది బుర్రల్లో పుట్టినదాని ప్రకారం కాదని పేర్కొన్నది.

గిరిరాజ్ సింగ్ ఏం మాట్లాడినా బిజెపి పెద్దలు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నాటి పార్టీ అధ్యక్షుడు అమిత్ షా సమక్షంలోనే బీహార్ బెగుసరాయ్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బహుశా ఈ పెద్ద మనిషి డిఎన్ఏలోనే ముస్లిం ద్వేషం ఉన్నట్లు అతగాడి వదరుబోతుతనం వెల్లడిస్తున్నది. దేశ విభజన సందర్భంగా ముస్లింలందరినీ పాకిస్తాన్ పంపకపోవటం మన పూర్వీకులు చేసిన పెద్ద తప్పిదం అన్నారు.

2014లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నరేంద్రమోడీకి ఓటువేయని వారిని పాకిస్తాన్ పంపాలని సెలవిచ్చినందుకు బహుమతిగా నాడు సహాయ కేంద్రమంత్రి పదవి, తరువాత మరింత గా రెచ్చిపోయినందుకు 2019లో కాబినెట్ మంత్రిగా, మరోసారి ఇప్పుడు కొనసాగించారు మోడీ. బీహార్‌లో మిత్ర పక్షాలుగా ఉన్న ఎల్‌జెపి, జెడియు నేతలు ఈ పెద్దమనిషి వ్యాఖ్యలను విమర్శించటం తప్ప గట్టిగా వ్యతిరేకించిన దాఖలాలు లేవు. ప్రపంచ జనాభా దినం సందర్భంగా 2019 జూలై 11న మంత్రి హోదాలో ఒక ట్వీట్ (ప్రస్తుతం ఎక్స్)చేశారు. "ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ఓటింగ్ హక్కు రద్దు చేయాలన్నది నా వైఖరి " అని పేర్కొన్నారు. ఇది ముస్లింలను ఉద్దేశించే చేసినప్పటికీ ఇతర మతాలలో ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి కూడా వర్తిస్తుంది కనుక వారు కూడా ఇలాంటి వ్యక్తులు, వారి పార్టీ గురించి ఆలోచించుకోవాలి.

బిజెపి నేతలు హిందూ ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా తమకు ముస్లింల ఓట్లు అవసరం లేదని బహిరంగంగానే ప్రకటిస్తారు. తనకు మియా(అసోంలోని ముస్లింలకు మరోపేరు)ల ఓట్లు అవసరం లేదని సాక్షాత్తూ ఆ రాష్ట్ర సిఎం హిమంత బిశ్వశర్మ ప్రకటించారు. తాను వారి ప్రాంతాలలో అసలు ప్రచారానికే వెళ్లనని కూడా చెప్పారు.

దేశంలో బాల్యవివాహాల సామాజిక రుగ్మత ఉంది. దాన్ని రూపుమాపాలంటే జనాల ఆర్థిక, విద్యా స్థాయిని మెరుగుపరచాలి. అసలు వాస్తవం ఏమంటే దేశంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 84శాతం హిందువుల్లోనే ఉన్నట్లు ఇండియా స్పెండ్ అనే మీడియా సంస్థ జనాభా లెక్కలను విశ్లేషించి చెప్పింది. ముస్లింలలో పదకొండుశాతం, ఇతరులు మిగతా మతాల్లో ఉన్నారు. అదే హిమంత బిశ్వశర్మ బాల్య వివాహాలు చేసే హిందువుల ఓట్లు, అంటరానితనం పాటించేవారి ఓట్లు తమకు అవసరం లేదని చెప్పగలరా?

ఆవు చేలో మేస్తుంటే దూడగట్టున ఉంటుందా? అధినేత నరేంద్రమోడీ స్వయంగా ఇటీవలి ఎన్నికల్లో ముస్లిం విద్వేషాన్ని ఎలా రెచ్చగొట్టారో తెలిసిందే. మోడీ ముందు హిమంత బిశ్వశర్మలూ, గిరిరాజ్ సింగ్‌లూ మరుగుజ్జులే. తన ఉపన్యాసాలు, వ్యాఖ్యలు అంతర్జాతీయ మీడియాలో చర్చనీయాంశం అవుతాయని, భారత ప్రతిష్ట మురికి గంగలో కలుస్తుందని తెలిసి కూడా మోడీ వెనక్కు తగ్గలేదు.ఏది ఎటుపోతేనేం! కావాల్సింది ఓట్లు, అధికారం! తెలిసిందే. దేశాన్ని ఆక్రమించుకొనేందుకు ముస్లింలకు కాంగ్రెస్ సహాయం చేస్తోందని కూడా ఆరోపించారు. మోడీ దిగజారి మాట్లాడినట్లు, అది కూడా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని మాట్లాడటం అవాంఛనీయమని బిజెపి నేత అలోక్ వత్స తమతో వ్యాఖ్యానించినట్లు వాయిస్ ఆఫ్ అమెరికా పేర్కొన్నది.

# వర్ణవివక్ష వ్యతిరేక పోరాటయోధుడు నెల్సన్ మండేలా



నెల్సన్ మండేలా జీవితం నిత్య పోరాటాలమయం, మనందరికీ ఆదర్శప్రాయం. వర్ణ, జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, తన జీవితాన్ని సమాజోన్నతికి దారపోసిన మండే అగ్ని కణం నెల్సన్ మండేలా. నెల్సన్ మండేలా జీవితాన్ని నేటి ప్రపంచ యువతకు పరిచయం చేయడానికి, తాను నమ్మిన విలువల నుంచి ప్రేరణ పొందడానికి ప్రతి ఏట నెల్సన్ మండేలా జన్మదినమైన 18 జూలై రోజున 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' పాటిస్తున్నాం. ఐరాస జనవరల్ అసెంబ్లీ తీర్మానంతో 18 జూలై 2010 నుంచి ఈ దినోత్సవం పాటించుట ప్రారంభమైంది. మానవాళి ఎదుర్కొంటు న్న అనేక సమస్యలకు పరిష్కారాలు వెతకడానికి, సకారాత్మక మార్పు కు బీజం వేయాలని, సమసమాజ స్థాపనకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ వేదికలను నిర్వహిస్తున్నాం. 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' వేదికగా ప్రజాహిత జీవన విలువలు, నిస్వార్థ స్వచ్ఛంధ సేవ, సంక్షోభ నివారణ, జాతివర్ణ వివక్ష, మానవ హక్కుల పరిరక్షణ, పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, బాలల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, దాతృత్వం, సాంస్కృతిక పునరుజ్జీవనం, హెచ్‌ఐవిఏయిడ్స్ అవగాహన, ప్రపంచ శాంతి లాంటి అంశాల పట్ల అవగాహన కల్పించుట జరుగుతుంది.

**వ్యక్తిగత జీవితం:** 18 జూలై 1918న దక్షిణ ఆఫ్రికా రాయల్ తెంపూ కుటుంబంలో జన్మించిన మండేలా సౌత్ ఆఫ్రికా విశ్వవిద్యాలయంలో బిఏ పట్టాను, పోర్ట్ హేరి విశ్వవిద్యాలయంలో యల్‌యల్‌బి (న్యాయ శాస్త్రం) పట్టా పొంది, జొహెనెస్బర్గ్‌లో న్యాయవాదిగా పని చేశారు. జాతి వివక్ష వ్యతిరేక పోరాటానికి ఆకర్షితుడై, 1943లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరి యువజన విభాగాన్ని నెలకొల్పారు. 1944లో ఎవెలిన్ మాస్‌ను వివాహమాడిన మండేలా 1958లో విడాకులు తీసుకున్నారు. 1958లో విన్నీ మడికిజెలాను వివాహమాడి 1996లో విడాకులు తీసుకున్నారు. 1998లో గ్రేక మాచెల్‌ను 3వ భార్యగా వివాహమాడిన మండేలాకు మొత్తంగా ఏడుగురు సంతానం కలిగారు.

**ప్రజా జీవితం:** జాగతి వివక్ష పోరులో పలు మార్లు జైలు పాలైన మండేలా, 1962లో జీవిత ఖైదీగా శిక్ష విధించారు. 1964 82 వరకు రాబెన్ దీవిలో, 1988 వరకు పోల్స్‌మూర్ కారాగారంలో ఖైదీగా జైలు జీవితం అనుభవించారు. దాదాపు 27 ఏండ్లు కారాగార జీవితం అనుభవించిన మండేలా నాటి అధ్యక్షుడు డీ క్లార్క్ ఆదేశంతో 1990లో జైలు నుంచి విడుదల అయ్యారు. దక్షిణ ఆఫ్రికా తొలి అధ్యక్షుడిగా (1994 99) సేవలు అందించిన మండేలా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్ అధ్యక్షుడిగా (1991–97), అలీన ఉద్యమ సెక్రటరీ జనరల్‌గా (1998–99) విశిష్ట సేవ లు అందించి అంతర్జాతీయ గుర్తింపు పొందా రు. నెల్సన్ మండేలా అసమాన్య సేవల కు గుర్తుగా నోబెల్ శాంతి బహుమతి (1993), భారతరత్న(1990), నిషాన్ ఇ పాకిస్థాన్ (1992), లెనిన్ శాంతి బహుమతి (1990), సఖరోవ్ బహుమతి (1988) లాంటి పలు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. 05 డిసెంబరు 2013న తన 93వ ఏట జొహనెస్‌బర్గ్ లో తుదిశ్వాస విడిచారు.

**ప్రపంచ మానవాళికే ఆదర్శం:** నెల్సన్ మండేలా జీవిత చరిత్రను 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్' పుస్తక రూపం లో వెలువరించారు. బాల్యంలో 'రోహిలాలా మండేలా' పేరుతో పిలువబడ్డ నెల్సన్ మండేలా 50కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డిగ్రీలు పొందారు. శాంతి మంత్రాన్ని శ్వాసిస్తూ, క్షమాగుణాన్ని ప్రదర్శించిన మండేలా సానుకూల దృక్పథంతో ముందు చూపు కలిగిన మేధావిగా రుజువు చేసుకున్నారు. మానవ సేవలో తన జీవితాన్నే అర్పించిన నెల్సన్ మండేలా మానవ హక్కుల లాయర్‌గా, చరసాలనే సమాజ మార్పుకు వాడుకున్న విలక్షణ వ్యక్తిగా, అంతర్జాతీయ శాంతి స్థాపన యోధుడిగా, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఎన్నికైన తొలి అధ్యక్షుడిగా ప్రపంచ మానవాళికే శాంతి సంక్షేమ దారి దీపస్తంభంగా నిలిచారు. విధ్వంసం చేయడం అత్యంత సులభమేగాని, హీరోలా నిలబడి చరిత్ర నెలకొల్పడం చాలా కష్టమని నమ్మిన నెల్సన్ మండేలా దాదాపు ఏడు దశాబ్దాలు ప్రజాసేవలో జీవితాన్ని త్యాగం చేశారు. ఒకవ్యక్తి మహాశక్తిగా రూపాంతరం చెంది దక్షిణ ఆఫ్రికాతో పాటు ప్రపంచ మానవాళిని అత్యంత ప్రభావితం చేసిన నెల్సన్ మండేలా జీవితం అన్ని తరాల ప్రజలకు ప్రేరణాత్మకం, ప్రశంసనీయం, అనుసరణీయం.

**(18 జూలై 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' సందర్భంగా)**

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రిటైరైన ఆర్‌టిసి ఉద్యోగులకూ వేతన సవరణ అమలు చేయాలి



ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్ఆర్‌టి.సి
ఎంప్లాయిస్ యూనియన్

తెలంగాణ ఆర్టీసి ఉద్యోగులకు 2017, ఏప్రిల్ 1వ తేదీన రావలసిన వేతన సవరణ 2024, జూన్ 1వ తేదీన కొత్త జీతాలతో అమలైంది. సర్వీసులో ఉన్న ఉద్యోగుల కళ్ళలో ఆనందం. ఏప్రిల్ 2017 నుండి జూన్ 2024 వరకు రిటైరైన ఉద్యోగుల కళ్ళలో కన్నీరు. వేతనసవరణపై ఇచ్చిన సర్క్యులర్15–03–2024న విడుదలైంది. ఆ తేదీ నుండి 3 మాసాలలో రిటైరైన ఉద్యోగులు వేతన సవరణ ఆప్షన్ ఇవ్వాలని మేనేజ్‌మెంట్ తెలిపింది. సర్క్యులర్ విడుదలై నాలుగు మాసాలు అవుతున్నా, ఇంతవరకు రిటైరైన ఉద్యోగులకు మేనేజిమెంట్ ఆప్షన్స్ ఇవ్వనే లేదు. రాష్ట్రవ్యాప్తం గా సుమారు 13 వేల పైచిలుకు ఉద్యోగులు 2017 నుండి 2024 వరకు రిటైరై ఉన్నారు. వీరే కాకుండా రాజీనామా చేసినవారు, రిమూవల్ అయినవారు కూడా ఉన్నారు. వీరిలో ఎవరికీ ఆదాయం లేదు. సరైన పెన్షన్ లేదు. నెల గడవక నాలుగు వేళ్ళు నోట్లోకి పోక, అన్నమో రామచంద్రా అంటూ కాలే కడుపులతో, ఎండిన డొక్కలతో వేతన సవరణ కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. వారి ఆకలి కేకలు ఎవరువింటారు? వారి గోడు ఎవరికి పడుతుంది? వారి బాధల గాథలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన చెందుతున్నారు.

ఆర్టీసీలో రిటైర్ అయిపోతున్న ఉద్యోగులకు యాజమాన్యం బొకేలు ఇచ్చి బై బై పలుకుతోంది. ఆర్థిక అవరోధాల పేరుతో సెటిల్మెంట్లకు మంగళం పాడుతోంది. వాటి గురించి అడిగితే ఆ ఒక్కటీ అడక్కు అంటోంది. 34ఏళ్ళ సర్వీసుచేసి వారి యవ్వనమంతా కార్పొరేషన్‌కు దారపోసి రిటైర్మెంట్ సమయంలో చిల్లిగవ్వ చేతి కందక, నెల జీతం లేక, పెన్షన్ రాక బికారిలా కన్నీళ్ళు పెట్టుకుని రిటైరైన కార్మికుడు బయటికొస్తున్నాడు. 2013 వేతన సవరణ బాండ్ల బకాయిలు కూడా రిటైరైన ఉద్యోగులకు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. 2017 వేతన సవరణ బకాయిలు ఇంతవరకు అతీ గతీ లేదు. రిటైరైన ఉద్యోగులు వారికి రావాల్సిన ఎన్‌క్యాష్‌మెంట్ అందని ద్రాక్షపండులా మారింది. ఈ ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కొక్కరికి సుమారు రూ.5లక్షల వరకు రావలసి ఉంటుంది. ఒక్కొక్కరి గ్రాట్యుటీ సుమారు రూ.10నుండి రూ.15లక్షలు యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుంది. వీరడుగుతున్న ఈ డబ్బు వారి జీవితకాలంలో సంపాదించుకున్నదే. వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వక మేనేజిమెంట్ పెట్టిన మెలికలకు రిటైరైన ఉద్యోగులు బెంబేలెత్తి పోతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసి కార్మికులను గుండెల్లో పెట్టుకు చూసుకుంటామంది. కాని వారి కోసం ఏం చేసింది ఈ ప్రభుత్వం? ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చిందా? వృద్ధాప్య పెన్షన్లు ఇచ్చిందా? డబుల్ బెడ్రూమ్ ఇచ్చిందా? కనీసం ఆ రిటైరైన ఉద్యోగులకు రావలసిన బాండ్ల బకాయిలు విడుదల చేయలేకపోతున్నారు.

రిటైరైన ఉద్యోగులతో పాటు వారి భార్యలకు కూడా నెలకు సుమారు 6 వేల రూపాయలు మందుల ఖర్చు అవుతోంది. జీతాలు లేక, వారికి రావలసిన సెటిల్మెంట్స్ అందక వారెలా బతకాలి? ఆర్టీసిలో రిటైరైన ఉద్యోగుల కు జీవితకాలం ట్రీట్మెంట్ కోసం యాజమాన్యం ఇచ్చే రూ.4లక్షలు ఏ మేరకు సరిపోతాయి? రిటైరైన అనేకమంది ఉద్యోగులు హార్ట్ ఎటాక్‌లతో బాధపడుతున్నా రు. కిడ్నీలు పనిచేయక డయాలసిస్ చేయించుకుంటున్నారు. మరికొందరు పక్షవాతంతో బాధపడుతున్నారు. పెన్షన్ లేక, నెలవారీ ఆదాయం లేక, పిల్లల ఆదరణ కరువై ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మెడికల్ ట్రీట్మెంట్ కోసం యాజమాన్యం ఇచ్చే 4లక్షల రూపాయలను 20 లక్షల రూపాయల వరకు పెంచాలని ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేస్తోంది.

తెలంగాణరాష్ట్రం సాకారం కాకముందు ఉమ్మడిరాష్ట్రంలో ఉన్నప్పుడు,ఉద్యోగులు రిటైరైన రోజే వారి అన్ని సెటిల్మెంట్ చెక్కులు కవర్లో పెట్టి మేనేజిమెంట్ అందించేది. ఆ తరువాత కాలంలో ఆన్లైన్ ద్వారాసెటిల్మెంట్ అమౌంట్ అకౌంట్లో జమ అయ్యేది. కాని దురదృష్టం ఏమిటంటే మన రాష్ట్రం మనకొచ్చిన తరువాత రిటైరైన ఉద్యోగులకు సెటిల్మెంట్ కావడం లేదు. దీర్ఘకాలంగా సెటిల్మెంట్స్ అందనివారు అనేకమంది ఉన్నారు. 2020సంవత్సరం మే తరువాత హయ్యర్ ఆప్షన్ ఇచ్చి రిటైర్ అయిన అనేకమంది ఉద్యోగులకు 4 సంవత్సరా లు గడిచిపోతున్నా ఇంతవరకు పెన్షన్ అందలేదు. బర్కత్‌పురలో ఉన్న ఆర్పీఎఫ్ కమిషనర్‌ను అడిగితే ఆర్టీసి మేనేజిమెంట్‌ను అడగాలంటారు. ఆర్టీసి మేనేజిమెంట్‌కు వీరి గోడు చెప్పుకుంటే మేనేజిమెంట్‌లో ఉలుకు లేదు పలుకు లేదు. ఈ హయ్యర్ ఆప్షన్ ఇచ్చిన బ్యాచ్‌లలో డ్రైవర్ కండక్టర్లతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది కూడా ఉన్నారు.

ఆర్పీఎఫ్ కమిషనర్‌కు ఆర్టీసి మేనేజిమెంట్ పి.ఎఫ్ బకాయిలు చెల్లించలేదు. అందువలన ఈ సమస్య అపరిష్కృతంగా ఉంది. మేనేజిమెంట్ చొరవ తీసుకుని ఈ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ కోరుతోంది. ముదిమి వయసులో ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ తరుణంలో వారికి డబ్బు అవసరం ఎంతైనా ఉంటుంది. కనుక 2017 వేతన సవరణకు సంబంధించిన ఆప్షన్ ఫారాలు రిటైరైన ఉద్యోగులకు విడుదల చేసి ఫిక్సేషన్లు జరిపి వారికి రావలసిన ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలి. లేదంటే ఎంప్లాయిస్ యూనియన్ వారి తరపున పోరాటం చేస్తుంది.

# దళితులకు మూడు ఎకరాల.. భూమి ఎప్పుడు?



గుర్రం రాంమోహన్ రెడ్డి
7981018644

దళితుల జీవన స్థితి గతుల్లో మార్పు తేచ్చేందుకు మెరుగైన జీవనం సాగించేందుకు టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మూడు ఎకరాల భూ పంపిణి పథకం ఏమైయిందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఉపాధి లేక బ్రతుకు బండిలాగుతున్న దళిత వర్గాలకు ఉతమిచ్చేందుకు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం మూన్నాళ ముచ్చటగా మారింది. "భూమిని జాతీయం చేసినప్పుడే నవసమాజం ఆవిష్కారం అవుతుంది. అభివృద్ధి సాధిస్తారని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. అర్. అంబేద్కర్ ఏనాడో భాసించినా పాలకులు గమనంలోకి తీసుకున్న దాఖలాలు లేవు. మూడు ఎకరాల భూమి ఇచ్చి విద్యుత్, బోరు బావులు ఏర్పాటు చేసి నిమ్న వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచుతామని ప్రకటించిన పథకం ఆటకెక్కింది. మూడు ఎకరాల భూ పంపణిపై ప్రస్తుతం అధికారంలో వున్న ప్రభుత్వం వైఖరిని ప్రకటించలేదు. తెలంగాణ 10 జిల్లాలు ప్రస్తుతం 33 జిల్లాల్లో మొత్తం దళితుల జనాభా 80 లక్షల పైమాటే. ఎస్.సి. జాబితాల్లో 59 కులాలు వుండగా ఇటీవల బుద్దిస్టులను కూడ జాబితాలో చేర్చడంతో 60కి జాబిత పెరిగింది. మొత్తం రాష్ట్ర జనాభాలో దళితుల జనాభా శాతం 23 శాతం. 60 కులాలకు 15 శాతం రిజర్వేషన్లు అమలు అవుతోంది. మాల, మాల బైండ్ల, నేతకాని అయ్యావార్లు, దాసరి, నీరటి కాళ్ళు, కాటి కాపరులు, బంబాల, గుర్రం వాళ్ళు, మాదిగ, మాదిగ బైండ్ల, మాదిగ మాస్టిక, దొమ్మారి, డక్కలి, సింధు మాదిగ, వాముల వంటి దళిత వర్గాలు ఆర్థిక ప్రగతిలో ఇంకా వెనుకబడి ఉన్నారు. గత ప్రభుత్వం సదుద్దేశంతో మూడు ఎకరాల భూ పంపిణికి అంకుర్పాణ చేసినప్పటికి పథకం అమలులో సంకల్పం లోపించిందన్న భావన దళిత వర్గాల్లో వ్యక్తం అవతుంది. 2014 ఎన్నికల్లో బి.ఆర్. ఎస్. ఎన్నికల ప్రణాళికలో పెట్టి, 2014 ఆగష్టు 15న నాటికి ముఖ్యమంత్రి మూడు ఎకరాలు భూమి పంపిణి చేస్తామని భరోసా ఇచ్చారు. మరో అడుగు ముందుకేసి 2015 మార్చి 17న అసెంబ్లిలో భూమి లేని దళితులకు మూడు ఎకరాలు భూమి పంపిణి చేస్తామని గులాబీ దళిపతి ప్రకటించారు. గత 9 సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల 242 కుటుంబాలకు 15 వేల 571 ఎకరాల భూమిని మాత్రమే పంపిని చేసినట్లు గణాంకాల బట్టి తెలుస్తోంది. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల్లో సాగుకు యోగ్యమైన భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని ఉన్నప్పటికి అందుకు భిన్నంగా సగానికి పైగా సాగుకు అనుకూలంగా లేని రప్పలు, రాళ్ళు, బీడు భూములు పంపిణి చేశారు. సాగుకు అనుకూలంగా లేకపోవడం, పంట వేసుకోవడానికి పెట్టుబడి లేకపోవడంతో దళితులకు కేటాయించిన భూమిని సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల భూస్వాములకు చెందిన భూమిని పంపిణి చేయడంతో వివాదస్పదంగా మారిన ఘటనలు కూడా లేకపోలేదు. శిఖం, రాళ్ళు, రప్పలు ఉన్న భూములు ఇవ్వడంతో సాగుచేయలేమని దళితులు దిగ్భ్రాంతితో మునిగిపోయారు. విభజనతో 10 జిల్లాలు కాస్త 33 జిల్లాలు ఏర్పాటు కావడంతో అమాంతం భూముల ధరలు అనూహ్యంగా పెరిగిన క్రమంలో దళితులకోసం భూములు కొనుగోలు చేయలేమని తెలంగాణ ఎస్.సి. కార్పోరేషన్ ప్రకటించింది. అట్టహాస్యంగా ప్రారంభించిన దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణి అర్ధంత్రంగా ఆగి పోయింది. ఆసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాగా, వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం లాకున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 1977 చట్టం ప్రకారం అసైన్డ్ భూములు భూములు అమ్మకం గాని, కొనుగోలు చేయడం గాని చెల్లదు. అయినప్పటికి అసైన్డ్ భూములకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చినట్లు దళిత వర్గాలు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం డిసెంబర్ 9, 2023న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అధికారం చేపట్టి 7 మాసాలు కావస్తుంది. దళితులకు 3 ఎకరాలు భూమి పంపిణిపై కాంగ్రెస్ ప్రభుత్వం విధాన ప్రకటన చేసి దళితులు ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని అభయ హస్తం ఇవ్వాల్సిన నైతిక బాధ్యత ఉంది.

## 'నీతి' ఆయోగ్ అంటే ఏమిటి?

దేశ ఆర్థిక పరిస్థితులపై చర్చలు జరిగినప్పుడు, పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలు జరిగినప్పుడు 'నీతి ఆయోగ్' పేరు ఎక్కువగా వినిపిస్తుంది. ఈ నీతి ఆయోగ్ అంటే ఏమిటి? దేశాన్ని ప్రగతి బాటలో నడిపించడానికి 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. అప్పట్లో పంచవర్ష ప్రణాళికలు అమలు చేసేవారు. ఐదేళ్లలో సాధించాల్సిన లక్ష్యాలను సిద్ధం చేసుకొని, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేవారు. చర్యలు చేపట్టేవారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం 2014 లో ఏర్పాటుకాగా, ఆ వెంటనే ప్రణాళికా సంఘం పేరు, రూపురేఖలను మార్చాలని తీర్మానించింది. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎన్ఐటిఐ/నీతి)ని 2015, జనవరి ఒకటో తేదీన ఏర్పాటు చేశారు. దీనిని భారత ప్రభుత్వ థింక్ ట్యాంక్‌గా అభివర్ణించవచ్చు. ప్రభుత్వానికి దిశాత్మక, విధానపరమైన సమాచారాన్ని ఈ సంస్థ అందిస్తుంది. వ్యూహాత్మక, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేస్తుంది.

## నక్కలగండి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలి



ప్రజాపక్షం/దేవరకొండ: నక్కలగండి, శ్రీశైల సొరంగం ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు జరగబోయే తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం సిపిఐ ఎల్లారెడ్డిబావి గ్రామశాఖ సమావేశం మాదిరెడ్డి వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా నక్కలగండి ప్రాజెక్టు పూర్తి కాలేదని, నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో అధిక నిధులు కేటాయించి సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజనేయులు, శాఖ కార్యదర్శి భూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీరాములు, తిరుపతయ్య, ముత్తయ్య, మొగిలయ్య, ఇద్దయ్య, లింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ పోరాటం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నమనేనిపల్లి, చింతకుంట్ల గ్రామాలలో సిపిఐ శాఖ సమావేశం నిర్వహించారు. పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగ మార్గం, పెండ్లిపాకుల జలాశయం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని కోరారు. చెన్నమనేనిపల్లిలో సిపిఐ జెండాను గ్రామశాఖ కార్యదర్శి కత్తుల బిక్షమయ్య ఎగరవేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి శేఖరాచారి, కల్లు చరణ్‌రెడ్డి, శ్రీనివాస్, ధర్మయ్య, నాగయ్య, లచ్చిరాం, వెంకటయ్య, మధు, కాశయ్య, లక్ష్మయ్య, ఇద్దయ్య, దర్శయ్య, మీనమ్మ, చెన్నయ్య పాల్గొన్నారు.

## వసతులపై ఆర్డీవో అసంతృప్తి



ప్రజాపక్షం/కోదాడ: విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను మెరుగుపర్చుకోవాలని కోదాడ ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లను ఆదేశించారు.మంగళవారం పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాస్టల్‌లోని వసతులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు.వసతి గృహంలో సదు పాయాలను సంబంధిత యజమాని ద్వారా ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు అసౌకర్యంకు గురికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయన డిటి అనిల్‌కుమార్,సిసి విక్రమ్ ఉన్నారు.

## పారదర్శకంగా బదిలీల కౌన్సిలింగ్

ప్రజాపక్షం/యాదాద్రి : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు నెం.80 ప్రకారం ఈనెల 5 నుండి 20వ తేదీ వరకు ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జరుగుతున్నందున మంగళవారం జిల్లా కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాలులో జూనియర్ అసిస్టెంట్ నుండి క్రింది స్థాయి ఉద్యోగుల వరకు 12 శాఖలు జిల్లా విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, సహకార శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ట్రెజరీ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, మార్కెటింగ్, వైద్య ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక, గిరిజన సంక్షేమ, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్షాలోమ్, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ కె.గంగాధర్ నేతృత్వంలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, జిల్లా గజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భగత్, జిల్లా నాన్‌గజిటెడ్ ఉద్యోగులసంఘంకార్యదర్శి ఎం.డి. ఖదీర్‌పాల్గొన్నారు.

## ట్రాక్ ఏర్పాటుకు వినతి

ప్రజాపక్షం/భువనగిరి:ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వాకర్స్, క్రీడాకారులు వినతి పత్రం అందజేశారు. ఓపెన్ జిమ్ విద్యుత్ దీపాలు ప్రహరీ గోడ వాకర్స్ కోసం ట్రాక్ క్రీడాకారులకుట్రాక్‌తో పాటు మరుగుదొడ్లు ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి మిగతావి విడుతలవారీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తంగళ్ళపల్లి రవికుమార్ బర్రె జహంగీర్ పిట్టల బాలరాజ్ సందిల్ల బాలరాజ్ నీలం రమేష్ సామల భాస్కర్ కుక్కదువు సోమయ్య వడిచర్ల కృష్ణ యాదవ్ దేవరకొండ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఇది చేతల ప్రభుత్వం



ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా ఉమ్మడి చందంపేట మండలం నేరేడుగొమ్ము గ్రామంలో రూ.3.50కోట్లు వ్యయంతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని నల్గొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ బాలునాయక్‌తో కలిసి రఘువీర్‌రెడ్డి మోడల్ స్కూల్‌ను సందర్శించి మాట్లాడుతూ గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలు అద్దె భవనాలలో నడిపించి పూర్తి వ్యవస్థను ప్రభుత్వం విస్మరించిందన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు విద్య కోసం ప్రభుత్వం రూ.652 కోట్లు ఖర్చు పెట్టిందని ఈప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని గత పాలనలో విద్యా వ్యవస్థను తుంగలో తొక్కారని ప్రధాన ప్రతిపక్షాలు నోరు జారే ముందు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఎంఎల్‌ఎ బాలునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలం అభివృద్ధి చెందే విధంగా ముందుకెళ్తామని అన్నారు. గత ప్రభుత్వంలో మన ఊరు మన బడి అని చెప్పి నిధులు దోచుకున్నారన్నారు. మాజీ ఎంపిపి బిక్కునాయక్, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, దేవేందర్‌నాయక్, మండల అధ్యక్షులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్‌కార్డులపై ఆశలు



### ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు త్వరలో మంజూరు చేస్తామని చెప్పడంతో ప్రజలలో కొంగొత్త ఆశలు చిగురించాయి.ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేయజూస్తున్న రుణ మాఫీ, రైతు భరోసాతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులు కీలకం కావడంతో లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు.ఆరుగ్యారెంటీల సంక్షేమ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలకు తెల్ల రేషన్ కార్డు తప్పని సరి చేయడంతో కొత్త ప్రభుత్వంలోనైనా తమకు త్వరగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు. రేషన్ కార్డులు లేక ఏళ్ల తరబడి తాము సంక్షేమ పథకాలకు దూరమయ్యామని, కనీసం రేషన్ బియ్యం కూడా పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు కాక వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎధుర్కొంటున్నారు. కొత్తగా కార్డులు పొందేందుకు కొందరు, ఉన్న కార్డులలో మార్పులు చేర్పుల కొరకు మరికొందరు దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడిచాయి. అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో 2020లో లాక్ డౌన్ సమయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం నిత్యావసర సరుకులు, రూ.2వేల నగదు అందించాయి. ఆ సమయంలో రేషన్ కార్డు లేకపోవడంతో వేలాది మందికి ప్రభుత్వాల సహాయం అందకుండా పోయింది. ఈక్రమంలో లాక్ డౌన్ ముగిసిన తరువాత 2021 జూలైలో అప్పటి కేసిఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసినట్టే చేసి ఉన్నట్టుండి ఆ ప్రక్రియను నిలిపివేసింది. కొన్నింటికి మోక్షం కలిగినా పెండింగు దరఖాస్తుల సంఖ్య ఎంత అనేది ఇప్పటి వరకు అధికారులే చెప్పలేక పోతున్నారు.కాగా ప్రస్తుతం ఉన్న కార్డులలో మార్పులు చేర్పుల కొరకు ప్రస్తుత ప్రభుత్వం లబ్దిదారులకు అవకాశం కల్పించింది. ఈ సవరణల దరఖాస్తులను తహశీల్దార్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా పౌరసరఫరాల అధికారులకు పంపాల్సి ఉంటుంది. ఉమ్మడి కుటుంబాల వివరాలు మార్పులు చేయాల్సి వస్తే కార్డులో నుంచి పేరు తీసివేయాల్సి వస్తుంది. చాలా మంది ఇలా కార్డుల నుంచి పేరు తొలగించుకుని నూతన కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు.కానీ ఉన్న కార్డులో పేరు లేక పోవడం, కొత్త కార్డులు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎధుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిలకు ముందు తెరపైకి వచ్చిన గృహలక్ష్మి ,బీసీలకు రూ. లక్ష ఆర్థిక సహాయం, కళ్యాణ లక్ష్మి , డబుల్ బెడ్రూం వంటి పథకాలకు తెల్ల రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో ఎంతో మంది అవకశం లేక నిరాశకు గురయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఉచిత బియ్యం, రైతు రుణమాఫీ లాంటి పథకాలకు రేషన్ కార్డు తప్పని సరి కావడంతో పాత పెండింగ్ కార్డులను వీలైనంత త్వరలో మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా పాలన సభలో గృహజ్యోతి, మహాలక్ష్మి , రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ పథకాలన్నింటిని రేషన్ కార్డులు కలిగి ఉన్న వారికే అమలుచేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రేషన్ కార్డులు లేని వారు కూడా గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు అందజేశారు. కాని ఇప్పటి వరకు రేషన్ కార్డు ప్రక్రియ మొదలు కాలేదని, తమకు సంక్షేమ ఫలాలు అందాలంటే కార్డులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు పెనుభారంగా ఉన్న రుణాన్ని ఒక్కసారిగా రూ. రెండు లక్షల వరకు మాఫీ చేసేందుకు ముందుకు రావడం అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో రుణమాఫీకి కూడా రేషన్ కార్డు ప్రామాణికంగా చెబుతుండడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజలకు రేషన్ కార్డులను అందచేయాలని రైతులు కూడా కోరుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం/తుర్కపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ,నల్లగొండ, ఖమ్మం , వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం బద్దు తండ గ్రామపంచాయతీలో ప్రభుత్వ వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తిరుమలాపూర్ గ్రామంలోని మోడీ కోలోని గుట్ట అరెస్టు ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు .అనంతరం గంధమల్ల గ్రామంలో ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాల్లో గ్రామాల్లో ఫ్లోరిడ్ వాటర్ సమస్య తీర్చడానికి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.గంధమల్ల గ్రామంలో చాలా రోజుల నుండి బస్సు సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ప్రజల కోరిక మేరకు బస్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. జెడ్పి సీఈవో శోభారాణి, మండల ప్రత్యేక అధికారి గుర్రం సురేష్, తహసిల్దార్ దేశ నాయక్, ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీ బాయి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీవో లింగంపల్లి నరసయ్య, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇంతియాజ్ అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి,ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధనావత్‌శంకర్‌నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు బాలు యాదవ్, దేవరుప్పల ఐలయ్య, బొత్త రాములు, కానుగంటి శ్రీనివాస్ యాదవ్ , మోహన్ బాబు, అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, గుగులోతు హనుమంతు, జింకల ఎల్లేష్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో సమస్యలతో సతమతం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ నగరంలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు వాపోయారు. రోడ్డు వేస్తామని సంవత్సరం క్రితం తవ్వి అలాగే వదిలేయడంతో ఆగిపోయిన 11 వ డివిజన్ కట్టరాంపూర్ నుంచి గిద్దె పెరుమాండ్ల టెంపుల్ వెళ్లే రోడ్డులో గల గుంతలు పడ్డ రోడ్లపై సిపిఐ ఆద్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 11వ డివిజన్‌లో స్మార్ట్ సిటీలో భాగంగా రోడ్లు నిర్మిస్తామని తవ్వి వదిలిపెట్టడంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రతి రోజు ఒకరు గుంతలో పడుతూ గాయాల పాలవుతున్నారని ఆరోపించారు. సంవత్స రం తరబడి ఇలాగే జరుగుతున్నా గానీ స్థానిక కార్పోరేటర్, మేయర్ ఏ మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు నగర మేయర్ సునీల్ రావు నగరాన్ని అభివృద్ధి చేసాం..నగరంలో రోడ్లు వేసామని చెప్పే మేయ ర్‌కు కట్టరాంపూర్‌లోని గుంతలు కనబడడం లేదా? అని సూటిగా ప్రశ్నించారు. నగరంలో గుంతలు కూడా పూడ్చలేని స్థితిలో మేయర్ ఉండడం సిగ్గుమాలిన చర్య అని నగరంలో 60 డివిజన్లలో చాలా ప్రాం తాల్లో పడిన రోడ్లు ఉన్నాయని, వీటిని పూడ్పించలేని చేతగాని మేయర్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగరాన్ని సుందరీకరణ చేస్తామని చెప్పి కోట్ల రూపాయలు అభివృద్ధి పనుల పేర ప్రజాప్రతినిధులు దోచుకున్నారే తప్ప అభివృద్ధి పరచడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ పాలనలో కరీంనగర్ నగరంలో పూర్తిగా అవినీతి జరిగిందని, వెంటనే సిబిఐ చే విచారణ చేపట్టాలని ఆయన కోరారు. స్మార్ట్ సిటీ పనులు నిబంధనల మేరకు చేయలేదని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.వెంటనే గుంతలు పడ్డ రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలని, లేని పక్షంలో మేయర్, కార్పోరేటర్, మున్సిపల్ అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు. 11వ డివిజన్ శాఖ కార్యదర్శి కశిబోజుల సంతోష్ చారి, మంద రాజ్ కుమార్, గడప శంకర్, మదర్ హోలీ, షరీఫ్, హనీఫ్, రామకృష్ణ, సందీప్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## కరాటే పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స ఇ టెక్నో స్కూల్ విద్యార్థి తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. క్రీడలలో కరాటే క్రీడకు చలా విశిష్టత ఉన్నదని, ప్రతి విభాగానికి ప్రత్యేకత ఉన్నదని చెప్పారు. చాలా దేశాలలో కరాటేకు ప్రాముక్యత ఇవ్వడమే కాకుండా జాతీయ క్రీడగా భావిస్తారని చెప్పారు. పాఠశాలలోని విధ్యార్థులకు కరాటే పట్ల పట్టు సాధించడానికైన నిపుణులైన శిక్షకులచే శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పాఠశాలకు చెందిన పి.శ్రేయన్నారాయణ్ (5వ) అండర్ 9 విభాగంలో కరాటేలోని కుమేటే విభాగంలో బంగారు పతకం, కటా విభాగంలో రజత పతకం గెలుపొందడమే కాకుండా త్వరలో హర్యానాలో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విధ్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లల పోషణపై ప్రత్యేక అవగాహన



ప్రజాపక్షం / గద్వాల : న్యూట్రిషన్ చాంపియన్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధనపు కలెక్టర్ నర్సింగ్‌రావు పేర్కొన్నారు.మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రసూతి శిశు చిన్న పిల్లల పోషన మరియు పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం యొక్క సమగ్ర నిర్వహణపై జిల్లా స్థాయిలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి జిల్లా అధనపు కలెక్టర్ నర్సింగ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న వివిధ లోపాలను, పిల్లల పోషణపై ప్రత్యేక అవగాహణ కల్పించాలని తెలిపారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలని అంగన్‌వాడి,ఏఎన్‌ఎం, ఆశాలు కలసి కృషి చేస్తేనే లోప పోషణతో అనీమియాతో భాధ పడుతున్న పిల్లలను నార్మల్ స్థాయికి తీసుకురావచ్చన అన్నారు. లోప పోషణతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు పరిశుభ్రతను పాటిస్తూ పల్లలకు ఆహారం ఇవ్వాలని ఆరోగ్య పరీక్షలు చేయించి ఎన్ ఆర్ సికి పంపే విధంగా అవగాహణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూ సుధారాణి జడ్పిసిఈఓ కాంతమ్మ ప్రోగ్రాం ఆఫీసర్ డా.స్రవంతి డా,రాజు,మున్సిపల్ కమీషనర్ శంకర్ సింగ్,సూపర్ వైజర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పిడిఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని డిఎస్‌వో మోహన్‌బాబు, ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో డివిజన స్థాయి రేషన్‌డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను దృష్టి లో పెట్టుకుని నాలుగునెలల స్టాక్‌ను స్టాక్ పాయింట్లలో ఏర్పాటు జరిగిందన్నారు.ప్రతినెల నిబంధనల ప్రకారం బియ్యం తీసుకుని లబ్ధిదారుడికి అందించాల్సిన బాధ్యత డీలర్లదే అన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే ఇకపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రభుత్వం రేషన్‌డీలర్లకు కమిషన్ పెంచడం జరిగిందని, అది ప్రతినెల అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.సిఐ చరమంద రాజు మాట్లాడుతూ పౌరసఫరాలశాఖ పంపిణీ చేసే నిత్యవసరాల విషయంలో నిబంధనలు మారాయని ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకునే అధికారం పెరిగిందన్నారు.డీలర్లు రేషన్ పంపిణీలో, స్టాక్ విషయంలో నిబంధనలు పాటించకపోతే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. రేషన్‌డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి అక్రమానికి డీలర్లను బాధ్యులు చేయడం తగదని సరియైన తూకంతో నిత్యవసరాలు పంపిణీ అయ్యేలా అధికారులు చూడాలని, కమిషన్‌ను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీలర్లకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో పుల్లయ్య, డిప్యూటి తహసీల్ధార్ కమలాకర్, డిటిసిఎస్‌లు, రేషన్‌డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి



ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్): సూర్యాపేట నియోజవర్గంలోని పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లోని మహాత్మ గాంధీ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఓ విద్యార్థిని అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. పాఠశాల ఉద్యోగులు, ఎస్ఐ పెరిక రవీందర్ కథనం ప్రకారం.. నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామానికిచెందినకొంపల్లి సోమయ్య, నవ్య దంపతుల కుమార్తె కొంపల్లి సరస్వతి(10)ఈ ఏడాది జూన్19న గురుకులంలో 5వ తరగతిలో చేరారు. విద్యార్థిని ఇంటికి వెళ్లగా ఈ నెల 11న తల్లిదండ్రులు పాఠశాలలో వదిలి వెళ్లారు. సోమవారం రాత్రి నుండి జ్వరంతో ఆమె బాధపడుతోంది. మంగళవారం ఉదయం జ్వరం తీవ్రమైంది.జిఎన్‌ఎం జ్యోతి ఈ విషయాన్ని క్లాస్ టీచర్ నాగమణికి చెప్పారు. పిఎంపి డాక్టర్ వద్దకు తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించారు. జ్వరం విషమించడంతో ఉదయం 7.30గంటలకు 108లో సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. వారు ఆసుపత్రికి చేరుకోగానే సరస్వతి మృతి చెందినట్లు తెలిపారు.తమ కుమార్తె మృతికి జిఎన్‌ఎం, క్లాస్ టీచరు కారణమంటూ ఆరోపించారు. వారిని సస్పెండ్ చేయాలని ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాలిక మృతదేహాన్ని మార్చురికి తరలించారు. కోపోద్రిక్తులైన బాలిక తల్లిదండ్రులు, బంధువులు గురుకుల ఆర్‌సిఓ షకినా, పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మీ , ఉపాధ్యాయులపై దాడికి యత్నించగా పోలీసులు వారించారు. డిఎస్‌పి రవి, రూరల్ సిఐ సురేందర్ రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.బాలిక తండ్రి కొంపల్లి సోమయ్యఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ పెరిక రవిందర్ రెడ్డి, ఎఎస్ఐ వెంకటరత్నంవిద్యార్థినితల్లిదండ్రులకున్యాయం చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా సరస్వతి మృతిని నిరసిస్తూ తల్లిదండ్రులు చేస్తున్న ఆందోళనకు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దనియాకుల శ్రీకాంత్ వర్మ, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, బిసి విద్యార్థిసంఘంరాష్ట్రకన్వీనర్‌వీరబోయిన లింగయ్య యాద వ్,పిడిఎస్‌యురాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, సంపత్ నాయుడు, సింహాద్రి ఉన్నారు.

## సమష్టి కృషితోనే కళాశాలకు స్వయంప్రతిపత్తి



ప్రజాపక్షం/కోదాడ: సమష్టి కృషితోనే కెఆర్ ఆర్ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా సాధించామని డిగ్రీ కళాశాలప్రిన్సిపల్ ఎం. నాగు వెల్లడించారు. మంగళవారం పట్టణ పరిధిలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోనే ఘనమైన చరిత్ర ఉన్న కెఆర్ ఆర్ డిగ్రీ కళాశాలకు తాను ప్రిన్సిపాల్‌గా పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. గత ఆరేళ్లగా కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉంటూ గత ఏడాది న్యాక్ అక్రిడేషన్ బి ప్లస్‌ప్లస్ గ్రేడ్ సాధించామన్నారు.దీన్నేస్ఫూర్తిగా తీసుకుని యూజిసి అధికారులు అటానమస్ హోదాను ప్రకటించారన్నారు. ఈ హోదాతో కళాశాలకు కొత్త కోర్సులు, అధ్యాపకేతర సిబ్బంది పోస్టులు మంజూరవుతాయన్నారు.కళాశాల భౌతిక వసతులకు నిధులు మంజూరు కావడంతో పాటు విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా సేవలందుతాయన్నారు.పరీక్షల నిర్వహణ సిలబస్ కేటాయింపులో కొంతశాతం కళాశాలకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు యూనివర్సిటికి వెళ్లకుండా ఇక్కడి నుండే మెమోలు, కాన్వకేషన్,ఇతర ధ్రువీకరణపత్రాలు పొందవచ్చు అని ఆయన తెలిపారు. నియోజకవర్గానికే కాక సూర్యాపేట జిల్లాకు కెఆర్ఆర్ డిగ్రీ కళాశాల వరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా కమిషనర్ దేవసేనకు కలిసి కళాశాలకు అటానమస్ హోదా రావడం పట్ల అభినందనలు తెలిపామన్నారు. కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని వినతిపత్రం అందచేశామని పేర్కొన్నారు.కళాశాలకు అటానమస్ రావడం పట్ల విద్యాకమిషనర్ అధ్యా పకులకు,ప్రిన్సిపాల్‌కు,విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపినట్లు తెలిపారు. కోదాడ ప్రాంత విద్యార్థులు కళాశాల సదు పాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి కళాశాల చరిత్రకు వన్నె తేవాలన్నారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్‌తో జీవితాలు తారుమారు




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: దేశవ్యాప్తంగా డ్రగ్ మహమ్మారి ఇటు యువతను అటు వయసుతో సం బంధం లేకుండా విద్యార్థులను బానిసలుగా మార్చి భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్న సందర్భంగా పోలీస్‌లు డ్రగ్ నియంత్రణకు ఉక్కు పాదం మోపుతూ ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం స్థానిక ఎస్సై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌లు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు సమా జం వివిధ యువజన సంఘాల నాయకులు ప్రతి ఒక్కరు విధిగా డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా యువతను దూరంగా ఉంచి కాపాడాలని అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రధాన రోడ్డుపై ఉన్న కొంత మందితో పోలీసులు మాట్లాడి డ్రగ్స్ సమూలంగా నివారించేందుకు ప్రతి ఒక్కరు విధిగా బాధ్యత వహించాలని కోరారు. ఏఎస్ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్స్ షాహిద్, వినోద్, శ్రీను, రవీందర్, వెంకన్న, శేఖర్ సంజీవ్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

# మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రూపొందించిన మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామంలోని కేఆర్ గార్డెన్స్‌లో సెర్ప్ మహిళా శక్తి కార్యక్రమాలు అమలుపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎంపి డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సాధికారతకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రాయతీ రుణాలిచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పించేందుకు అవసరమైతే ప్రత్యేక శిక్షణ యూనిట్లు నెలకొల్పేలా అధికారులు కృషి చేయాలన్నారు. మత్స్య, పశు సంవర్ధక శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రోత్సహించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి యూనిట్లపై లబ్ధిదారులకు ప్రోత్సాహకం అందించాలని సూచించారు. అధికారుల టార్గెట్లపై ఇంప్రువమెంట్ కనిపించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌హెచ్‌జీ లోన్ల ద్వారా సబ్సిడీని లింక్ చేస్తే పేదవారికి మరింత మేలు జరుగుతుందని అందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మహిళా సమైక్య భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వీఓఏ వేతనాల పెంపు విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, ఏమైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకరావాలన్నారు. ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమవుతుందని ఎంపీ డాక్టర కడియం కావ్య అన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతీ మండలంలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఔత్సాహిక మహిళా సంఘాలను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇంటిని చక్కదిద్దే మహిళలకు గ్రామాన్ని చక్కదిద్దే శక్తి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో మీ అందరి భాగస్వామ్యం ఉందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి టార్గెట్లను రీచ్ అవ్వాలన్నారు. వీఓఏల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ కాయపులను ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మొతులప్ప, అడిషనల్ డీఆర్‌డిఒ జనగామ, హన్మకొండ శ్రీనివాస్, సుధీర్, ఏసిపి శర్మ, డిపిఎం, ఎపిఎం, సిసిలు, విఒఎ, బూర్ల లతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన సేవా కేంద్రంలో మేయర్ గుండు సుధారాణి తనిఖీ



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ /ఖిలా వరంగల్:** వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాలను నగర మేయర్ గుండు సుధారాణి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి దరఖాస్తుల నమోదు, సవరణ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న ప్రజలకు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీకి లబ్ధి అందని ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు స్వీకరించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదుచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను తనిఖీ చేసి నమోదుచేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ, జనన, మరణ, ప్రజారోగ్య, పరిపాలన, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక తదితర విభాగాలను సందర్శించి సిబ్బంది హాజరు పరిశీలించి నిర్వర్తించే విధులను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తుదారుల వినతులు త్వరగా పరిష్కరించాలన్నారు. మేయర్ వెంట సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సెక్రటరీ విజయలక్ష్మి, ఎస్ఈ కృష్ణారావు, పీఆర్ఓ అయ్యుబ్‌అలీ, పర్యవేక్షకుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** గంజాయి కేసులో ఒరిస్సా కు చెందిన రంజిత్ కుమార్ ప్రధన్ కు జిల్లా జడ్జి పి చంద్రశేఖర ప్రసాద్ పదేళ్ల ఆరునెలలు ఖఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విదిస్తూ తీర్పు ఇచ్చారు. కేసముద్రంలో ఎస్ఐ తిరుపతి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రంజిత్ కుమార్ గంజాయి తరలిస్తున్న విశయాన్ని గమనించిన ఎస్ఐ తిరుపతి అతని వద్ద నుండి పదహారు కిలోల రెండువందల తొంబై గ్రాముల గంజాయిని స్వాదీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. అట్టి కేసుపై జడ్జి ఇచ్చిన తీర్పును జిల్లాలోని పలువురు నాయకులు, మహిళా సంఘాలు అబినందనలు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు రవాణా చేసినా, అమ్మినా ఖఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి సుధీర్ రాంనాధ్ కేకన్ తెలిపారు.

## బాల కార్మికులు లేని జిల్లాగా జనగామ



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** బాల్య వివాహాలు జరని, బాల కార్మికులు లేని జిల్లాగా జనగామ ఎదగాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జే జయంతి కోరారు. స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రొగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) సంస్థ సామాజిక సేవా కార్యకర్తలు, కౌన్సిలర్ల శిక్షణ శిబిరానికి అమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. స్కోప్ అధ్యక్షులు బండి సాయన్నగౌడ్ అధ్యక్షత వహించగీఆ జయంతి మాట్లాడుతూ స్వచ్చంద సంస్థలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా స్కోప్ పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రస్తుతం ఎంపిక చేసిన గ్రామాల్లో చేయవలసిన కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లా సిడ్బ్యూసి ఛైరమ్న్ కె ఉప్పలయ్య, యాదాద్రి సిడబ్ల్యూసి చైర్ పర్సన్ బి జయశ్రీ, జనగామ డిసిపిఓఎల్ రవికాంత్, యాదాద్రి డిసిపి ఓపి సైదులు, బచపన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లు, లయన్స్ ఇంటర్నేషన్ పూర్వ గవర్నర్ కన్నా పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** పర్మిషన్ లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తే, అదేవిధంగా నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ములుగు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఏటూరునాగారం ప్రయివేట్ ఆసుపత్రులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం హస్పటల్ ప్రయివేట్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహాకులకు ఆసుపత్రిని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్‌లో పేర్కొన్న దాని ప్రకారంగా నడపాలని ఆదేశించారు. పేషెంట్ కేస్ షీట్‌ను ఇన్‌పేషెంట్లకు తప్పనిసరిగా పేషెంట్‌కు సంబంధించిన వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరచాలని, ఆసుపత్రి బెడ్స్ స్థాయిని అనుమతి తీసుకున్న దాని ప్రకారం మాత్రమే ఉపయోగించాలని, పేషెంట్స్‌కు సంబంధించిన సేవలకు వాటి యొక్క ప్రైస్ లిస్ట్ రిసెప్షన్ కౌంటన్ వద్ద ప్రదర్శించాలని, ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆరాధ్య ప్రయివేట్ హాస్పటల్‌ను తనిఖీ చేశారు.

## రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట మండలంలోని పలు రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారులు తహశీల్దార్ రజినికుమారితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సాయిగీత మిల్లుల్లో రికార్డులు పరిశీలించారు. మిల్లు, గోదాంలో ఉన్న నిలువలను లెక్కించారు. ప్రభుత్వం సరఫరా చేసిన దాన్యం నిలువలు మరియు మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి అందించిన సిఎంఆర్‌ను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. తనిఖీల్లో సివిల్ సప్లయ్ డిఎం కొండల్ రావు, డిటి రాజేశ్వరితో పాటు తదితరులు ఉన్నారు.

## తాజ్ ముజ్తర్ మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** ప్రముఖ ఉర్దూ కవి, కాళోజి సోదరులకు అత్యంత సన్నిహితుడు, మిత్ర మండలి సభ్యులు మహ్మద్ తాజ్ ముజ్తర్ సోమవారం రాత్రి మృతి చెందారని, ఆయన మరణం పట్ల తెలంగాణ రచయితల సంఘం వరంగల్ అధ్యక్ష, కార్యదర్శులు పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్, ఆ సంఘం ప్రతినధులు నెల్లుట్ల రమాదేవి, కార్తీక రాజు, హాజీ నూరాని, వల్స పైడి, బాలబోయిన రమాదేవి, గట్టురాధిక తదితరులు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మహ్మద్ తాజ్ ముజ్తర్ కాళోజి రామేశ్వర్ రావు స్మారక అవార్డును కూడా అందుకున్నారని, వారి మరణం తీరని లోటు అని పేర్కొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా మహేందర్



**ప్రజాపక్షం/తొర్రూరు :** సిపిఐ తొర్రూరు మండల కార్యదర్శిగా మండలంలోని వెలికట్టె గ్రామానికి చెందిన బందు మహేందర్ ఎన్నికైయ్యారు. మహబాదు జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో సోమవారం జరిగిన మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో తొర్రూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్లు సిపిఐ మహబాదు జిల్లా కార్యదర్శి బి. విజయ సారధి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు తెలిపారు. మండల కార్యదర్శిగా బందు మహేందర్, సహాయ కార్యదర్శిగా పేరబోయిన కిరణ్ కుమార్‌లను ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా బందు మహేందర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సిపిఐ పార్టీ బలోపేతానికి, ప్రజా, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాల ద్వారా కృషి చేస్తానన్నారు.

## కలెక్టర్ల మీటింగ్‌లో రిజ్వాన్ బాష



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కలెక్టర్లు ఎస్పీల సమావేశం నిర్వయించగా ఆ సమావేశానికి జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ హాజరయ్యారు. ప్రభుత్వం చేపట్టే, చేపట్టబోయే కార్యక్రమాలపై సమీక్షలో ఆయన పాల్గొని ప్రభుత్వం ఇచ్చిన, సూచలను, సలహాలపై మాట్లాడారు.

## పేదలకు పట్టాలివ్వాలని సిపిఐ ధర్నా




**ప్రజాపక్షం/పరకాల :** ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో పరకాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జీ మంద సదాలక్ష్మి మాట్లాడుతూ పరకాల పట్టణం మాదారం శివారు సర్వే నెంబర్ 98లో గల కారల్ మార్క్స్ కాలనీలో ప్రభుత్వ భూమిలో గత రెండు సంవత్సరాల నుండి సుమారు 400 మంది పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారికి విద్యుత్, నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చిందని, మాదారం కాలనీలోని పేదలకు కూడా పట్టాలు ఇవ్వాలని, పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద సదాలక్ష్మి తో పాటు సిపిఐ మండల సహాయ కర్యదర్శి మదాసు ఉమ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి ఆదాయ మార్గాలను అన్వేషించాలి

### సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి మున్సిపాలిటీకి ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధానంగా మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ మార్గాలపై దృష్టి సారించారని, మున్సిపల్ ఆస్తులను గుర్తించి రెండు, మూడు రోజుల్లో నివేదికలను సమర్పించాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయని అడగగా కమిషనర్, మున్సిపల్ అధికారులు సమాధానం ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే జీఎస్సార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగిపడటం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం వంటి ఘటనలు జరుగుతుంటాయని, కావున, క్షేత్రస్థాయి సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి ఎవరికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా వెంటనే స్పందించాలని కోరారు. అదేవిధంగా, భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట డివైడర్ మధ్యలో ఉన్నటువంటి కోనోకార్పస్ చెట్ల వలన ప్రజలకు శ్వాసకోస వ్యాధులు కలుగుతున్నాయని, వాటిని పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే చెట్లను నాటాలని సూచించారు. భూపాలపల్లిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ లను తీసుకోకపోవడం మూలాన, మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందని పలువురు కౌన్సిలర్లు కోరగా, వాటిపై కమిషనర్ దృష్టి సారించి, ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, రోడ్ల వెంట మురికి కాల్వలలో చెత్తా, చెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీలలో దోమల నివారణకు రెగ్యూలర్ గా ఫాగింగ్ చేయాలన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి క్వార్టర్స్, పలు పార్టీల రాజకీయ కార్యాలయాల నుండి పెండింగ్ లో ఉన్న ఆస్తి పన్నులు మొత్తం వసూలు చేయాలని కమిషనర్ ఎమ్మెల్యే ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, భూపాలపల్లి తాహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ డీఈ శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, పలువార్డుల కౌన్సిలర్లు, వివిధశాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ భూములలో నివాసముంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. భూపోరాట కేసులో కోర్టుకు హాజరైన సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని చాలాఏల్లుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి కింద ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం జీవో నెంబర్ 58,59 కింద పట్టాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టాలు అందించాలని, జిల్లా వ్యాప్తంగా వామపక్ష నేతలపై పెట్టిన భూపోరాటాల అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. ఇంటి స్థలాలు లేనివారికి ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో పట్టన సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పోచారం కృష్ణ పాల్గొన్నారు.

## ప్రజల ఐక్యతకు ప్రతీకలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధర్మ పరిక్షణ, ప్రజల ఐక్యతకు ప్రతీకలు మొహరం, తొలి ఏకాదశి పండగలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అన్నారు. జిల్లా ప్రజలకు ఆయన తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్బలా యుద్ధంలో విరోచిత పోరాటం గావించిన హజ్రత్ ఇమామ్ హుస్సెన్ ధైర్యం, నిబద్దత ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల మొహర్రం అన్నారు. ముస్లీంలు హిందువులు కలిసి నిర్వయించే ఈ పీర్ల ఊరేగింపు సమైక్యతను ప్రతిభింబిస్తుందన్నారు. సమాజంలో క్రీస్తుశఖం 622లో మహ్మద్ ప్రవకర్త హిజ్రత్ మక్కాను వదలి మదినాకు వలస ప్రయాణ కాలాన్ని మోహర్రం నెల సూచిస్తుందన్నారు. తెలుగు పండుగలలో తొలి ఏకాదశి ఆది పండుగ అన్నారు. ప్రజలు భక్తి శ్రద్దలో పండగ జరుపుకోవాలన్నారు.

## త్యాగానికి ప్రతీక మొహర్రం



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** త్యాగానికి ప్రతీక మోహరం పండుగా జరుపుకుంటారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు కలెక్టర్ రాహుల్ శర్మ మోహరం పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోహరం పండుగ త్యాగానికి ప్రతీకాఅని, విశ్వాసం నమ్మకం కోసం మహ్మద్ ప్రవక్త మనవడు హజరత్ హిమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్ని గుర్తుచేసుకోవడమే మోహరం పండుగ ప్రత్యేకత అని గుర్తు చేశారు.మానవ జాతీ త్యాగం ఎంతో గొప్పదని మంచితనం త్యాగం గుర్తు చేసుకోవడమే ఈ పండుగా ప్రత్యేకతని కలెక్టర్ పేర్కొన్నారు.

## పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలని అదనపు జిల్లా కలెక్టర్ పింకేష్‌కుమార్ పిలుపునిచ్చారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జనగామ మున్సిపాలిటి పరధిలో మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున కమిషనర్‌తో కలిసి అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమన్నారు. ప్రతి ఒక్కరికి దీని ప్రాధాన్యత తెలియజేస్తూ మొక్కలు నాటడడమే కాకుండా పరిరక్షించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అదిగమిస్తూ మొక్కలు నాటాలని, అందుకోసం ఇంటింటికి మొక్కల పంపిణీ చేయలన్నారు. మున్సిపాల్టీ పచ్చదనం పరిశుభ్రతతో ఆకట్టుకునేలా చేయాలన్నారు.మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు రాంచందర్, శానిటి ఇన్స్‌పెక్టర్ మల్లిగారి మధు పాల్గొన్నారు.

## ప్రైవేట్ సెక్యూరిటీకి కొమ్ముకాస్తున్న సింగరేణి అధికారులు

### ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** తప్పుడు ధృవ పత్రాలను సమర్పించి సింగరేణి ప్రైవేట్ కాంట్రాక్టర్‌గా చలామని అవుతున్న ఓ కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్న ఏరియా సింగరేణి అధికారులకు హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులా ఉందని భూపాలపల్లి ఏరియా ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. మంగళ వారం పట్టణంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏరియా సింగరేణి అధికారుల అండదండలతో భూపాలపల్లి మున్సిపల్ అధికారుల సహకారంతో తప్పుడు అనుభవ పత్రం సంపాదించి ప్రైవేట్ కాంట్రాక్ట్ కోసం సెక్యూరిటీ టెండర్ వేయడంతో ఓ కాంట్రాక్టర్ విజిలెన్స్ విచారణ చేపట్టాలని సింగరేణి సిఎండి, ఉన్నత అధికారు లకు ఫిర్యాదు చేశామన్నారు. లేబర్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సదరు కాంట్రాక్టర్ సమర్పించిన అనుభవ పత్రాలు తప్పుడివి అని తేలడంతో ఆర్జీ2లో సదరు కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ ను రద్దు చేయడం జరిగిందన్నారు. దీంతో సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఎఎల్‌వో, మున్సిపల్ రికార్డులను పరిగనలోకి తీసుకొని కాంట్రాక్టర్ వేసిన రిట్ పిటిషన్‌ను తొలగించినట్లు తెలిపారు. ఏరియా పర్చేస్,సెక్యూరిటి,ఈఅండ్ ఎం డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న కొందరు అధికారులు సదరు కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తు సంస్థ నిబంధనలకు గండిపెడుతున్నారని మండిపడ్డారు.హైకోర్టు ఇచ్చిన తీర్పుతో వారి ఆశలపై నీళ్లు చల్లినటైందని అన్నారు.సింగరేణిలో అర్హత లేని వారికి కాంట్రాక్ట్‌లు అప్పగించవద్దని టెండర్లో వారు సమర్పించిన ధృవ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులకు మాత్రమే కాంట్రాక్ట్‌లను అప్పగించాలని ఏరియా జిఎం హబీబ్ హుసేన్‌ను కోరినట్లు తెలిపారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ 17వ ప్రమాణస్వీకారం




**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** లయన్స్ క్లబ్ ఆఫ్ 17వ ప్రమాణస్వీకార కార్యక్రమం హసన్‌పర్తి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. లయన్ గోపరాజు యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ జన్నరెడ్డి రాజిరెడ్డి నూతన సభ్యులచే ప్రమాణ స్వీకరించి చేయించారు. మొదట ఉప జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య నూతన కమిటీ సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా ఏర్పాటుచేసిన కమిటీ సభ్యుల్లో అధ్యక్షునిగా ఇనుముల కృపాకర్, కార్యదర్శిగా నేదునూరి కుమారస్వామి, కోశాధికారిగా డాక్టర్ శేఖర్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సర కాలమంతా పేదవారికి స్కూల్ విద్యార్థులకు మౌళిక సదుపాయాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 216 దేశాల్లో లయన్స్ సేవా కార్యక్రమాలు విస్తతంగా జరుగుతున్నాయని, అంతర్జాతీయ స్థాయిలో మిషన్ 1.5 అనే నినాదంతో 15 లక్షల సభ్యత్వాలను పూర్తి చేసుకోవాలని అంతర్జాతీయ అధ్యక్షులు తెలిపారని, నూతన క్లబ్‌లు నూతన సభ్యత్వాలు పెంచుకోవాలని, సేవా రంగంలో పేద ప్రజలకు మౌళిక సదుపాయాలు అందించాలని, విద్యార్థులకు లయన్స్ క్వెస్ట్(కౌమార కౌశల) విద్య ద్వారా విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలని, విద్యార్థి దశలో ఉన్న విద్యార్థులను సేవా కార్యక్రమాలను దృష్టి మరల్చడానికి లియో లయన్స్‌గా వారిచే సేవా కార్యక్రమాలకు ఆహ్వానించడాలని, లీడర్ షిప్ విషయం మన జిల్లాలో ఎక్కువగా లయన్స్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మున్ముందు మరిన్న మంచి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వివిధ క్లబ్ ప్రెసిడెంట్లను సన్మానించారు. ఈ కార్యక్రమం లో 2వ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, జోన్ ఛైర్ పర్సన్ డాక్టర్ భాస్కర్‌రావు, జిల్లా లీడర్ షిప్ సమన్వయకర్త డాక్టర్ అజిత్‌కుమార్, మార్కెటింగ్ కోఆర్డినేటర్ కల్యాణపు రాజమౌళి, పీఆర్ఓ కటంగూరి రాంగోపాల్‌రెడ్డి, పీస్ పోస్టర్ జిల్లా ఛైర్ పర్సన్ చెన్నూరు శ్రీనివాస్, యూత్ డెవలప్‌మెంటు గంగారపు రజనీకాంత్, నాగమల్ల సుధీర్, తోట సంపత్, మోర రవి, వరస రాజేంద్రం, రాజేందర్, శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

### సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్




**ప్రజాపక్షం / నర్సంపేట :** కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ప్రజలను సన్నద్ధం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుల పంజాల రమేష్, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఇల్లందుల సాంబయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడో సారీ అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజా సమస్యలను పరిష్కరం వైపు చూడకుండా నిరుదోగ సమస్య, కార్మికుల వేతనాల పెంపు, అధిక ధరలను నియత్రించకుండా జాప్యం చేస్తుందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటి ప్రజలకు అందుబాటులో లేవని దుయ్యబట్టారు . ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రజల అవసరాలు తీర్చే విధంగా బిజెపి ప్రభుత్వం పని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ఈనెల 26,27 తేదీలలో నెక్కొండ మండల కేంద్రంలో నర్సంపేట నియోజక వర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్, నర్సంపేట, ఖానపూర్, నెక్కొండ మండలాల కార్యదర్శులు కందిక చెన్నకేశవులు, గడ్డం యాకయ్య, బానోతు వీరునాయక్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏత యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ వ్యవహార శైలితో ఊసరవెల్లులే సిగ్గుపడే పరిస్థితి

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** మొన్నటి వరకు ఎంపిగా బండి సంజయ్ కుమార్ విఫలమయ్యాడని, అసమర్ధుడని కరీంనగర్ పట్టణ అభివృద్ధికి ఒక్క పైసా నిధులు తీసుకురాలేదని, అభివృద్ధిపై అసలు అవగాహనే లేదని మాట్లాడిన మేయర్ సునీల్‌రావు ఇప్పుడు పట్టణ అభివృద్ధికి బండి సంజయ్ కుమార్ వందల కోట్ల నిధులు తీసుకువచ్చాడని మాట్లాడిన తీరు ఊసరవెల్లులే సిగ్గు పడే పరిస్థితి వచ్చిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి మేయర్ సునీల్‌రావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై గతంలో మాట్లాడిన వీడియోను ఇప్పుడు మాట్లాడిన వీడియోను చూపించారు. సంధర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలలో విలువలు పాటించాలని, పట్టణ ప్రథమ పౌరుడిగా ప్రజలకు ఆదర్శవంతం గా ఉండాలన్నారు. రాజకీయాల పేరుతో ఎన్ని అబద్దాలైనా ఆడవచ్చనేది కరెక్టు కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ఒక్కరం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, అందులో ఎటువంటి అనుమానం సునీల్‌రావుకు అవసరం లేదన్నారు. సమావేశంలో నాయకులు దన్న సింగ్, అబ్దుల్ రహెమాన్, షబానా మహమ్మద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దాసరి నర్సింహారెడ్డి, పెద్దిగారి తిరుపతి, మహమ్మద్ భారీ, కీర్తి కుమార్, కిరణ్ రెడ్డి, అష్రఫ్, ఖలీల్, నరేష్, హనీఫ్ తదితరలున్నారు.

## సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ 1 ఏరియాలోని రీజనల్ ల్యాబ్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు కొవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషయంలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు, ఎఐటియుసి రీజనల్ ల్యాబ్ డిపార్ట్మెంట్ కార్యదర్శి దాతు సత్యనారాయణ, నాయకులు పోయిల రాజేష్ తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ప్రారంభం



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ప్రజాపక్షం దినపత్రికలో సోమవారం నాడు అస్తవ్యస్తంగా డ్రైనేజీ మురికి నీరు చెరువుగా నిండింది అనే ప్రచురితమైన వార్త కథనానికి మెట్‌పల్లి బల్దియా కమిషనర్ మోహన్ స్పందించారు. పట్టణంలోని బీడికాలనీలో మంగళవారం బల్దియా కార్మికులతో డ్రైనేజీ మురికి నీరు నిలవకుండా పిచ్చి మొక్కలను తొలింగించి పరిశుభ్రం చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రజాపక్షం దినపత్రికకు బీడి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

## చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నేరడిగొండ :** బోథ్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ఆసుపత్రులలో ఆయిన ఖర్చుల సహాయ నిమిత్తం సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేయడం జరిగింది. నియోజకవర్గంలోని 123 మం దికి 25 లక్షల 9000 విలువగల చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు,మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సిపిఐ రామగుండం నగర సమితి లెనిన్ నగర్ శాఖా మాజీ కార్యదర్శి కామ్రేడ్ ఆసాలా మదునయ్య అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంగా సిపిఐ నగర సమితి పక్షాన సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం సమక్షంలో ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ గోసిక మోహన్, నగర కార్యదర్శి కే.కనకరాజు, నగర కోశాధికారి కామ్రేడ్ మాటేటి శంకర్, తో పాటు నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు వెంకటాపూర్ గ్రామసభలో టెండర్లకు పిలుపు

అక్రమవెంచర్లు పెట్టారని యువకుల గందరగోళం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గ్రామసభలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు టెండర్లకు పిలిచామని గ్రామప్రత్యేకాధికారి భూంరెడ్డి ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడారు. మంగళవారం వెంకటాపూర్‌లో ప్రత్యేకాధికారి సమక్షంలో గొర్రెల మార్కెట్, కురగాయల మార్కెట్, వాటర్‌ప్లాంట్ వేలం నిర్వహించారు. వాటర్ ప్లాంట్‌కు గ్రామస్థులు కొద్దిగా ఆసక్తి కనబరచలేదన్నారు. కార్యక్రమానికి మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు మామిండ్ల తిరుపతిబాబు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కోల నర్సయ్య, పలు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కాగా అప్పటి సర్పంచ్ హయాంలో భూములు విషయంలో అవకతవకలు జరిగాయని గ్రామ పంచాయితికి ఎకరానికి నాలుగు గుంటల చొప్పున రావల్సి ఉందని మొత్తం వివరాలు కావాలని అధికారులను, ప్రజాప్రతినిధులను పట్టుబట్టారు. సభలో ఇదే విషయంలో గందరగోళం కావడంతో సభను కాస్త ముగించారు. ఏది ఏమైనా రాజన్న జిల్లాలో వెంకటాపూర్ గ్రామం మాత్రం నజర్‌లోనే ఉంటుందని అన్వేషకులు చెబుతున్నారు.



# 2 లక్షల రుణమాఫీ తప్పక చేస్తాం

ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్లుగానే రైతులకు 2 లక్షల రుణమాఫీ తప్పకుండా చేస్తామని, రుణమాఫీకి మార్గదర్శకాలు, జీఓ విడుదల చేసిన రేవంత్‌రెడ్డికి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం రూరల్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చడం జరిగిందని, ఏ గుట్లో చేయి పెట్టిన అప్పుల చిట్టా కనిపిస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 31 వేల కోట్లు రద్దు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి సర్కార్‌కే దక్కుతుందన్నారు. పేద రైతులకు నిజమైన రైతులకు రుణమాఫీ తప్పకుండా చేస్తామని, వందలాది ఎకరాలు ఉన్న భూస్వాములకు, ఎమ్మెల్యేలకు కాదన్నారు. హరీష్‌రావు, కేటీఆర్ మ్లాడుతున్నారని అందరికీ రుణమాఫీ ఇవ్వాలని అర్హులైన రైతులకు ఇస్తామని ఐదు వందల ఎకరాలున్న కేసీఆర్, మల్లారెడ్డికి కాదన్నారు. హరీష్‌రావు రుణమాఫీపై మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విడతల వారిగా రుణమాఫీ చేశారు తప్ప ఏకకాలంలో చేయలేదని ఎద్దేవా చేశారు. అనుకోకుండా గెలిచిన 8 నెలల్లో మండలస్థాయిలోని భూ పరిష్కారాలు దాదాపుగా పరిష్కారం చేశామన్నారు. ధరణి ఇబ్బందులతో మండలానికి 500 ఫిర్యాదులుండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒకటొకటి పరిష్కరిస్తున్నామన్నారు. రైతు భరోసా ఇవ్వటం లేదని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుల్లారా రైతుబంధుతో 26 వేల కోట్లు దుర్వినియోగం ఎలా చేశారని, ఒక పైసా దుర్వినియోగం కాకుండా ముందస్తు ఆలోచనతో రైతు భరోసా ఇస్తామన్నారు. 10 ఏళ్లలో ఒక్క ఉద్యోగం ఇచ్చిన పాపన పోలేదని, ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు కూడా న్యాయం చేయలేదన్నారు. తెలంగాణ తెచ్చున్నది నీళ్లు, నిధులు, నియామకాలపై పోరాటం చేస్తే కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు నీళ్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, గ్రూప్ 1 పరీక్ష నిర్వహించాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేపర్ లీక్ చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ దెబ్బకు ఒకరు జైల్లో పడ్డారని, మరొకరు ఫామ్‌హౌజులో పడ్డారని, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రావలి, కానీ సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ ఎక్కడ కనిపించడం లేదన్నారు. మోడీ ప్రభుత్వానికి ఈసారి 230 సీట్లు వచ్చాయని, వచ్చేసారి 130 సీట్లు కూడా రావన్నారు. ధనవంతుల దగ్గర ట్యాక్స్ వసూలు చేసి పేదలకు ఇవ్వాలి కానీ రైతు భరోసా అందరికి ఇవ్వాలని అడగడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడుగు గంగాధర్, జావిద్ అక్రమ్, ముప్ప గంగారెడ్డి, అమృతాపూర్ గంగాధర్, మోత్కుర్ నవీన్‌గౌడ్, బాకారం రవి, ఉమ్మాజీ నరేష్, ఎల్లయ్య, లింగం, ప్రవీన్ నాయకులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రామారపు వెంకటేష్



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో అగ్ని ప్రమాదానికి గురై నష్టం పొయినా చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రామారపు వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని, 20 మంది చిరు వ్యాపారుల దుకాణాలు, అరటిపండ్ల బండ్లు, ఇతర సామాగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమయ్యాయని, రోజు వారి ఉపాధితో వారు జీవిస్తారని వారికి ప్రభుత్వం వెంటనే తక్షణ ఆర్థిక సహాయం అందివ్వాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాము, సాగర్, సందీప్ పాల్గొన్నారు.

## నిరుద్యోగుల పట్ల రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అధికారం కోసం నిరుద్యోగులను వాడుకున్న రేవంత్ సర్కార్ నిరుద్యోగులను నిర్లక్ష్యంగా వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి వసతులను, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రంథాలయాలను ఒక దేవాలయాలుగా చేసిందని, పోటీ పరీక్షల కోసం సిద్దమయ్యే అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించిందన్నారు, కానీ ఈనాడు రేవంత్‌సర్కార్ ఆ దిశగా అడుగులు వేయడం లేదని, గ్రంథాలయాల్లో నిరుద్యోగ యువకులు నిలబడి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, డీఎస్సీ, మెగా డీఎస్సీ పేరుతో దగా చేసి అధికారంలోకి వచ్చారని ఆయన అన్నారు, గ్రంథాలయాల దుస్థితిని కనీసం జిల్లా మంత్రి కూడా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని, అధికారం, పదవుల కోసమే నిరుద్యోగులను వాడుకున్నారని ఆయన విమర్శించారు. రైతులను, మహిళలను, చదువుకునే విద్యార్థులను మోసం చేసిన చరిత్ర రేవంత్ సర్కార్‌కే దక్కిందన్నారు. పిల్లల ఉద్యోగాల పేరుతో గెలిచిన ముఖ్యమంత్రి, మంత్రులు వారి కలలకు సాకారం ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. సిఎం పక్కనే ఉంటూ రాష్ట్రాన్ని పాలిస్తున్న మంథని ఎమ్మెల్యే నిరుద్యోగుల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రాజ్ కుమార్, నాయకులు లవన్ కుమార్, ప్రేమ్ కుమార్, అజహార్, ముత్యం లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలో సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేక వైద్య నిపుణులు ఎండి ఫిజీషియన్లు, 23 ఆసుపత్రుల వైద్యులతో సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆసుపత్రులకు వచ్చే జ్వర బాధితుల వివరాలు రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేసి ప్రతి రోజు వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. డెంగ్యూపై తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, టిడయాగ్నొస్టిక్ హబ్‌లలో ఎలిసా పరీక్ష నిర్వహించిన తరువాతనే డెంగ్యూగా నిర్ధారణ చేయాలని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో క్లినికల్ ఎస్టాబిలష్‌మెంటు యాక్ట్ 2010 ప్రకారం ఆసుపత్రిలో ఉండాల్సిన పరికరాలు, సౌకర్యాలు కల్పించడంలో పాటు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ నిరోధక చట్టం ప్రకారం పుట్టబోయేది అడ బిడ్డ, మగ బిడ్డ వివరాలు తెలుపడం జరుగదని ప్రజలకు అర్థమయ్యేవిధంగా గోడప్రతులు, ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని తెలిపారు. లింగనిర్ధారణ చేయించుకున్నా, చేసినా, ప్రోత్సహించినా చట్టరిత్యా నేరమని, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు వైద్య సేవల కొరకు వైద్యులను సంప్రదించిన సమయంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని, వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందించినట్లయితే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అప్రమత్తంగా ఉండవచ్చని జిల్లా వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, డిడిఎం ప్రవళిక పాల్గొన్నారు.

## ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూమెంట్‌పై ఎయిర్ ఫోర్స్ అధికారులు అనిల్ గోస్వామి, ఎస్టీ జాట్ సోమవారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రి, పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కొరకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ జులై 5 నుంచి 28 జులై వరకు చేసుకోవచ్చని తెలిపారు.దీనికి సంబంధించి అక్టోబర్ 18న రాత పరీక్ష ఉంటుందని తెలిపారు.ఆన్లైన్లో ధరకాస్తు యువతి, యువకులు 3 జులై 2024 నుంచి 1 జనవరి 2008 మధ్యలో జన్మించిన వారు ఉండాలని సూచించారు. పదోతరగతి, ఇంటర్ అర్హత, రాత పరీక్షలో ఉత్తీర్ణుడై ఉండాలనీ,ఉత్తీర్ణత సాదించిన వారికి ఫిజికల్,మెడికల్ స్ట్ అంటుండ తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి కార్యాలయంలో ఇండియన్ ఎబుర్ పార్స్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,విద్యార్థులు ఉన్నారు.

## ధర్మపురిని సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దుతా

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక వసతులు కల్పించి ధర్మపురిని ఒక సరస్వతి నిలయంగా తీర్చిదిద్దుతానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురిలోని మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో నెలకొన్ని భోధన వసతులు, మౌళిక వసతులు, ఇతర సమస్యలపై స్కూల్ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పక్కా భవనాలు లేని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఉన్నప్పటికి మైనార్టీ గురుకుల పాఠశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని అందుకు ధర్మపురిలో ఉన్నటువంటి మైనార్టీ గురుకుల పాఠశాలకు పక్కా భవనం నిర్మించడానికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ఏండ్ల సంవత్సరాల నుండి పదోన్నతులకు నోచుకోలేని ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్. దినేష్, వేముల రాజు, సింహారాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, చీపిరిశెట్టి రాజేష్, జె.సుముఖ్, ఎం.డి. రఫియొద్దిన్, మొగిలి, అశెట్టి శ్రీనివాస్, అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## భద్రతతో కూడిన ఉత్పతి సాధించాలి



**ప్రజాపక్షం /రామగిరి :** రామగుండం3 ఏరియాలోని గనులకు సంబంధించి భద్రత, బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాపై ఆర్జీ3 జీఎం ఎన్. సుధాకర రావు మంగళవారం జిఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఓసిపి 1, ఓసిపి 2 ఉపరితల గనుల ఉత్పతి, ఉత్పాదకత, రవాణా, ఓ.బీ(మట్టి వెలికితీత) లక్ష్యాల అంశాలపై చర్చించారు. ఆర్జీ 3 ఏరియా వివిధ విభాగాల పనితీరును విశ్లేషించారు.ఈ సందర్భంగా వివిధ గనుల అధికారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు, అలాగే నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమ వంతు కృషి చేస్తూ, లక్ష్యాలను భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను చేపట్టాలని అన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి అందరము కలసి కట్టుగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించు కోవడానికి తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. అలాగే ఉపరితల గనులలో వర్షాకాలం నీటి పంపులు సక్రమంగా నడిచే విధంగా తగు చర్యలు చేపట్టాలని, వర్షాకాలం ఉత్పత్తికి అంతరాయం కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఎజిఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్ట్ అధికారులు ఎన్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సిహెచ్.వెంకట రమణ, డీజీఎంఐఈడీ కే.చంద్ర శేఖర్, సిహెచ్ పిడి జీఎం కాశీ విశ్వేశ్వర రావు, ఏరియా సర్వే అధికారి డి.జనార్ధన రెడ్డి, ఫారెస్ట్ డిజీఎం బి.కర్ణ, పర్యావరణ అధికారి పి.రాజా రెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎం.నాగరాజు, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కే.వి.రామారావు లతోపాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భజలాలను పెంపొందించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/కామారెడ్డి ప్రతినిధి:** జిల్లాలో భూగర్భజలాల పెంపునకు ఆయా శాఖల ద్వారా చేపట్టిన ఇంకుడుగుంతల సర్క్యులేషన్ ట్యాంకులు, చెక్ డ్యాములు, కాంటూర్ కందకాల నిర్మాణం పనులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నోడల్ అధికారులు పరిశీలించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం పరవేశపెట్టిన జలశక్తి అభియాన్ వర్షపు నీటిని ఒడిసిపట్టు 2024 జలశక్తి కార్యక్రమం కింద చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డిఎఫ్ఒ నిఖిత కేంద్ర అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్తానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్‌డిఒ బి.చందర్, జిల్లా భూగర్భజలాల అధికారి సతీష్‌యాదవ్, అధికారులు పాల్గొనగా జిల్లాలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు సెంట్రల్ నోడల్ అధికారులను నియమించారు. డిప్యూటీ సెక్రెటరీ బెంజిమెన్, కర్ణాకర్, పవర్ నోడల్ అదికారిగా నియమించారు. వీరితో పాటు కేంద్ర భూగర్భ నీటి శాఖ సీనియర్ శాస్త్రవేత్త అధర్వ, కృష్ణపవర్‌తో కలిసి జిల్లాలో ఈనెల 15 నుండి 18 వరకు జలశక్తి అభియాన్ కార్యక్రమంలో ఆయా శాఖల ద్వారా చేపట్టిన పనులను పరిశీలిస్తున్నారు.

# కట్టడి లేని కల్తీ నూనెలు

ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం
రిఫైండ్ ఆయిల్
నూనె బ్రాండ్ పేరుతో విక్రయాలు
అధికారుల తనిఖీలు శూన్యం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిత్య జీవితంలో వంటనూనె ఒక అలవాటుగా మారిపోయింది. నూనె లేనిదే నాలుక రుచించడం లేదు. నూనె లేనిదే ఏ పదార్థం కూడా తయారు కావటం లేదు. రుచి కోసం వేపుడికి పచ్చర్లకు చివరకు చిన్నపిల్లలు ఇప్పుడే కిరాణ షాపుల్లో దొరికే పిండి పదార్థాలను సైతం వదలని పరిస్థితి నెలకొంది. ఇక రెస్టారెంట్లలో, హోటళ్లలో దొరికి ఆహార పదార్థాలలో వాడే నూనెల సంగతి దేవడెరుగు. వాడిన నూనెను మళ్లీమళ్లీ వాడుతూ వినియోగదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. హానీకరమైన నూనెలను వాడుతున్నారని, అవి ప్రాణాలకు ఎంతో హానీకరమంటూ వైద్యులు ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తున్నప్పటికీ మార్పు మాత్రం రావటం లేదు.

### ఏకాదశి కోసం రెచ్చిపోతున్న కల్తీ మాఫియా

పండగలు వచ్చాయంటే చాలు. మార్కెట్‌లో వివిధ రకాల పేర్లతో వంట నూనెలు దర్శనమిస్తాయి. ఆఫర్ల పేర్లతో వినియోగదారులను ఆకర్శిస్తూ రిఫైండ్ పేరుతో వాడిన నూనెలను కెమికల్స్ కలిపి వినియోగంలోకి తెస్తుండటం గమనార్హం. ముఖ్యంగా తొలి ఏకాదశి అంటేనే పిండి వంటలు గుర్తుకొస్తాయి. ముఖ్యంగా పల్లెటూర్లలో ఉండే వారికి ఏదోకటి చెబుతూ అంటకడుతుంటారు. దీన్ని ఆసరుగా తీసుకున్న కల్తీమాఫియా చెలరేగిపోతున్నాయి. ఇలాంటి సందర్భాన్ని కల్తీ మాఫియా ఒక ముఠలా తయారై, బ్రాండ్ల పేర్లతో ఉన్న నూనెలను కూడా సైతం కల్తీ చేస్తూ అందుబాటులోకి తెస్తున్నట్లు సమాచారం. ఆయిల్ మాఫియా రోగ్య క్షిణతపై ప్రభావం చూపుతుందని పదేపదే డాక్టర్లు చెబుతున్నా ప్రజల్లో మార్పు రావటం లేదు. అయినా ఈ కల్తీపై అధికారులు కన్నెత్తి కూడా చూడని చూడటం లేదు.





ముఖ్యంగా కోవిడ్ బారిన పడి ఉపశమనం పొందిన వారిలో చాలామందికి రుచి సరిగా తెలియడం లేదు. దాంతో నూనెలను అధికంగా వాడే వంటకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనేది డాక్టర్ల పరిశోధనలో తెలిసినప్పటికీ వేయించిన పదార్థాల కోసం హోటళ్లను ఆశ్రయించే వారి సంఖ్య భారీగా పెరుగుతూనే ఉండటం విశేషం. ఇదే అదనుగా కొన్నిచోట్ల వంటనూనెల్లో కల్తీ జరుగుతోంది. ఈ పరిణామం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో గత యేడాది సేకరించిన నూనెల నమూనాల ఫలితాలను పరిశీలించగా విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. విదేశాల నుంచి వచ్చే నూనెను మన రాష్ట్రంలోని రీప్యాకింగ్ సంస్థలు ప్యాకెట్లు, డబ్బాల రూపంలో మార్చి మార్కెంటింగ్ చేస్తున్నాయి. ఇలాంటి పరిశ్రమలు ఎక్కువగా నర్సారావుపేట, కడప, కర్నూలు, కాకినాడ, అనంతపురంతో పాటు ఉమ్మడి నిజామాబాద్‌లో మూడు చోట్ల పరిశ్రమలుండటం విశేషం. వినియోగదారులతో పాటు చిరు వ్యాపారులకు విక్రయిస్తున్న కొన్ని నూనెల్లో కల్తీ అధికంగా జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత సంవత్సరం జూల 1 నుంచి 14 వరకు రాష్ట్రంలోని రీప్యాకింగ్, లోకల్ బ్రాండ్ల పరిశ్రమల నుంచి 155 నమూనాలను సేకరించగా వీటిలో 10 శాతం నూనెలో నాణ్యత లేదని రిపోర్టులు వచ్చినట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్వరి తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సుమారు గత సంవత్సరంతో పోలిస్తే 680 నమూనాలను పరీక్షిస్తే 66 సంవత్సరం సుమారు గత సంవత్సరంతో పోలిస్తే 680 నమూనాలను పరీక్షిస్తే 66 కేసుల్లో నాణ్యత లేదని తేలింది. సాధారణంగా రాష్ట్రంలో వేరుశెనగ, కొబ్బరి నూనె, పొద్దుతిరుగుడు నూనెలను అధికంగా వాడుతున్నారు. వీటి ధరలు ఎక్కువగా ఉంటాయి. ఈ మూడు రకాల నూనెల్లోనే కల్తీ ఎక్కువగా జరుగుతుంది. ధర తక్కువగా ఉండే పామోలిన్ నూనెను కలుపుతున్నారని ఫుడ్ సేఫ్టీ అధికారులకు తెలిసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవటం లేదనటంలో అతిశయోక్తి లేదు. వేరుశెనగ నూనెలో పామోలిన్ సూపర్‌వోలిన్ (పామోలిన్‌ను) రిఫైన్డ్ చేస్తే వచ్చేది రిఫైన్డ్ కాటన్ సీడ్ ఆయిల్ (పత్తి విత్తనాల నుంచి తయారుచేసేది) కలిపేస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనెలోనూ పామోలిన్ రిఫైన్డ్ కాటన్ సీడ్ ఆయిల్ మిశ్రమం చేస్తున్నారు. కొబ్బరి నూనెలోనూ పామోలిన్ కలుపుతూ మోసం చేస్తున్నారు.

# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడి

## నలుగురు ఆర్మీ జవాన్లు దుర్మరణం

**జమ్ము :** జమ్ముకశ్మీర్ దోడా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య సోమవారం రాత్రి భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో కెప్టెన్‌సహా నలుగురు ఆర్మీ జవాన్లు అమరులైనట్లు అధికారులు తెలిపారు. ఆ తరువాత బలగాలు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. బలగాలకు తారసపడిన ఉగ్రవాదులను మట్టుబెట్టారు. కాగా, అమరులైన వారిని కెప్టెన్ బ్రిజేష్ తప్ప, నాయక్ డి.రాజేష్, సిపాయ్‌లు బిజేంద్ర, అజయ్‌గా గుర్తించిట్లు అధికారులు వెల్లడించారు. తాజా ఘటన గత మూడువారాల్లో దోడా జిల్లాలో బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన మూడవ అతిపెద్ద ఎన్‌కౌంటర్. గత వారం క్రితం మచేడి అటవీ బెల్ట్‌లోని కథువా జిల్లాలో ఆర్మీ పెట్రోల్‌లో ఉగ్రవాదులు మెరుగుదాడి చేశారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు అమరులు కాగా, అనేకమంది గాయపడిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, దోడా పట్టణానికి 55 కిలో మీటర్ల దూరంలో ఉన్న దేసా అటవీ బెల్ట్‌లో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి రాష్ట్రీయ రైఫిల్స్, జమ్ముకశ్మీర్ ప్రత్యేక ఆపరేషన్స్ గ్రూపుకు చెందిన పోలీసులు సంయుక్తంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో బలగాలకు ఉగ్రవాదులు తారసపడగా, ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయన్నారు. కొంతసేపటి వరకు ఎదురు కాల్పులు కొనసాగిన తరువాత ఉగ్రవాదులు పారిపోయేందుకు ప్రయత్నించడంతో బలగాలు వారిని వెంబడించారని చెప్పారు. దీంతో మరోసారి ఎదురు కాల్పులు జరిగాయన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో కెప్టెన్‌సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. అరులైన జవాన్లకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అన్నిరకాల ఆర్మీ బలగాలు ఘననివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ఇండియన్ ఆర్మీఅండగా ఉంటుందని, ఇండియన్ ఆర్మీ ప్రజా సంబంధాల అదనపు డైరెక్టర్ జనరల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాల్పుల నేపథ్యంలో సోమవారం ఆర్మీ, పోలీసుల బలగాలను ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మోహరింపుచేసి మంగళవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టామని అధికారులు పేర్కొన్నారు. హెలికాప్టర్ల ద్వారా అటవిలో జల్లడ పట్టామన్నారు. గతవారం కథువా జిల్లాలో సైనిక వాహనంపై జరిపిన ఉగ్రదాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు సైనిక సిబ్బందికి గాయాలయ్యాయి. పది మంది జవాన్ల బృందం మాచేడీ– కింద్లీ –మల్హార్ రోడ్డు మార్గంలో ట్రక్కులో వెళ్తూ గస్తీ నిర్వహిస్తున్న సమయంలో, ముష్కరులు ఒక్క ఉదుటున వాహనం పైకి గ్రనేడ్ విసిరారు. దీంతో ఐదుగురు సైనికులు మృతిచెందారు. పూంచ్, రాజౌరీ జిల్లాల్లో ప్రారంభమైన ఉగ్రదాడులు ఇప్పుడు క్రమంగా జమ్ము కశ్మీర్ అంతా విస్తరించాయి. కొన్నేళ్లుగా ఇక్కడ ఎలాంటి ఉగ్రకార్యకలాపాలు లేవు. జమ్ము ప్రాంతంలో 32 నెలల్లో జరిగిన ఉగ్రదాడుల్లో దాదాపు 40మందికిపైగా సైనికుల మరణించారు. సుమారు 60మంది ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో యాక్టివ్‌గా ఉన్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. గత నెలలో భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉగ్రవాదులు పైచేయి సాధించొద్దని సూచించారు.



### భద్రతా వైఫల్యంపై ప్రభుత్వానిదే బాధ్యత : కాంగ్రెస్



జమ్ముకశ్మీర్‌లో దోడాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు జవాన్లు అమరులు కావడంపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. పదే పదే భద్రతా వైఫల్యాలపై ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సభలో ప్రతిపక్షత నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తాజాగా ఎన్‌కౌంటర్‌లో కెప్టెన్ సహా నలుగురు జవాన్లు మృత్యువాత పడడం తీవ్ర విచారకరమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశానికి తమ జీవితాలను త్యాగం చేసిన అమరు కుటుంబాలకు ప్రగాఢ సానభూతిని తెలిపారు. గత 36 రోజులుగా జమ్ముకశ్మీర్‌ను ఉగ్రవాదులు పట్టి పీడిస్తున్నారని, మన భద్రతా వ్యూహంలో మరింత జాగ్రత్త అవసరమని ఖర్గే ఉద్ఘాటించారు. మోడీ ప్రభుత్వం ప్రతిదీ వ్యాపారంగానే వ్యవహరిస్తుందని విమర్శించారు. ఏ మాత్రం మారలేదన్నారు. జమ్ము ప్రాంతం దాడుల భారాన్ని భరిస్తుందని తెలుసుకోవాలని సూచించారు. మన సాయుధ బలగాలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. జమ్ములోని గత 78 రోజుల్లో 11 ఉగ్రదాడులు జరిగాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు.

దేశవ్యాప్తంగా ఉన్న సైనికులంతా విధి నిర్వహణలో భాగంగా జమ్ముకశ్మీర్‌కు వస్తున్నారన్నారు. కానీ వారు మాత్రం శవపేటికల్లో తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులు ఎవరిని ప్రశ్నించారు. కశ్మీర్‌వ్యాలీలో ఉగ్రవాదానికి ముగింపు ఎప్పుడని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డిజిపి నియామకమైన నాటి నుంచి ఈ తరహా ఘటనలు 32 చోటు చేసుకున్నాయని వివరించారు. ఈ ఉగ్రవాదుల దాడుల్లో అత్యధిక మంది మరణించారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఆమె విమర్శలు గుప్పించారు. చోరబాట్లను ఆపేబాధ్యత ఎవరిదంటూ ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వాన్ని మొహబూబా ముఫ్తీ సూటిగా ప్రశ్నించారు.

### అది మా పనే.. కశ్మీర్ టైగర్స్ ప్రకటన

జమ్ము కశ్మీర్ దోడా జిల్లాలోని భరద్వాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉన్నతాధికారితో సహా నలుగురు సైనికులు మరణించారు. ఈఘటనకు తామే బాధ్యులమని జైషే ఈ మహమ్మద్ అనుబంధ సంస్థ కశ్మీర్ టైగర్స్ మంగళవారం ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్‌పై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు సంధిస్తున్నాయి. అయితే ఇటీవల కాలంలో ఆ రాష్ట్రంలో ఉగ్రవాద దాడులు పెచ్చరిల్లాయి.

## పేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా




**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** అర్హులైన నిరుపేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని మంగళవారం ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్. బిసి హక్కుల రాష్ట్ర సమితి కార్యదర్శి నేదునూరి రాజమౌళి, మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి రాసమల్ల దీన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించిందని, ప్రభుత్వం వెంటనే అర్హులైనవారికి ఎన్నికల హామీ మేరకు సంక్షేమపథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ధర్మసాగర్, దేవునూర్, రాంపూర్, పెద్దపెద్యాల గ్రామాల్లో పేదలు గుడిసెలు వెసుకోని జీవనం గడుపుతున్నారని, వారికి వెంటనే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇల్లు కట్టివ్వాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, బట్టు మల్లయ్య, ధర్మసాగర్ మండల కార్యధర్శి కోట్టే వెంకటేశ్, పెండ్యాల భూపోరాట నాయకులు రాజారపు రత్నం, దాసు, గోకల రాజయ్య, మర్రిపల్లి అంకుష్, చిలుక బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రెండో ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయండి : ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి :** ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న రెండవ ఎఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్ డిమాండ్ చేశారు. ఈనెల 18వ న కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని 2వ ఎఎన్‌ఎంలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మంగళవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎఐటియూసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ ఎన్‌ఎంల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మె చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, 2వ ఎఎన్‌ఎం యూనియన్ ఎఐటియుసి నాయకులు వసంత, భూదేవి, సునీత, సంగీత, సత్యమ్మ, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సమావేశం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిధిగా మర్రి వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్లను ప్రైవేటీకరణ చేయడానికి పావులు కదుపుతున్నదని, అందులో భాగంగానే సింగరేణి బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ వేలాన్ని చేపట్టిందని, దీనికి కాంగ్రెస్ మద్దతు పలుకుతుందన్నారు. బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణ వేలాన్ని నిలిపివేయాలన్నారు. కార్మిక సంస్కరణల పేరుతో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడులుగా చేయడాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని, 55 సంవత్సరాలు దాటిన కార్మికులందరికీ పెన్షన్ వచ్చే విధంగా చూడాలని కోరారు. అన్ని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ కార్డులు, ఇఎస్ఐ హాస్పిటల్స్ సౌకర్యం, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అలాగే ఇతర రాష్ట్రాల కార్మికులు రావడం వల్ల జిల్లాలో ఉన్నటువంటి అసంఘటితరంగ కార్మికులకు ఉపాధి దెబ్బతినే ప్రమాదముందన్నారు. కార్మిక శాఖ, ప్రభుత్వం వారందరికీ కనీస వేతనాలు ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సమ్మయ్య, గౌరవాధ్యక్షుడు కాశెట్టి లక్ష్మ య్య, ఉపాధ్యక్షులు దామోదర్, కార్యదర్శులు బెజ్జంకి కాళిదాసు, పిట్టల శ్రీనివాస్, జంగ శంకర్, బొజ్జ సాయిలు, కడారి బీరయ్య, బాగోతం వీరయ్య, కొమురయ్య, ఒర్సు కొమురయ్య, అంజయ్య, రాజయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/కమలాపూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపూర్ సిపిఐ మండల సమావేశం ధర్ముల రామ్మూర్తి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేదలకు పక్కా ఇల్లు నిర్మిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా పేద ప్రజలు, బడుగు, బలహీన వర్గాలు ఇండ్ల స్థలాలు లేక ఇళ్ళ కిరాయి కట్టలేక దుర్భర జీవితం గడుపుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, భూ పోరాటాల ద్వారా వేసుకున్న పేద ప్రజలు గుడిసెలో ఇళ్ళ స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, జిల్లా వ్యాప్తంగా ఈనెల 19న మండల తహసీల్దార్ కార్యాలయం, ఈనెల 26న వేలాది మందితో కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి జక్కు రాజు గౌడ్, మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొట్టేపాక రవి, శంకర్, బొజ్జం లక్ష్మి , జేరిపోతుల శిరీష తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పాటిస్తున్నందున తమ ప్రతినిధులు ఈ భేటీకి హాజరుకావడం లేదని టిఎంసి వర్గాలు చెప్పాయి. సమావేశానికి తమ పార్టీ తరుపున ప్రతినిధులు హాజరు కాలేకపోతున్నట్లు మంత్రి రిజిజుకు రాజ్యసభలో టిఎంసి పార్లమెంటరీ పార్టీ నేత దేరక్ ఓ బ్రిల్లా లేఖ రాశారు. మరోవైపు, పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 22న మొదలై ఆగస్టు 12 వరకు కొనసాగనున్నాయి. జులై 23న పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఇటీవల కొత్తగా ఏర్పాటైన 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 24 నుంచి దాదాపు వారం రోజుల పాటు కొనసాగిన విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో ఉభయసభల్లోనూ అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా వాదనలు కొనసాగాయి. కొద్దిరోజులే సభ కొనసాగడంతో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారానికి సగం టైం సరిపోయింది. దీంతో బడ్జెట్ ప్రవేశపెట్టడం కుదరలేదు. అందువల్ల ఈ నెల 23న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దీంతో వరుసగా ఏడుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనతను ఆమె దక్కించుకోనున్నారు. ఇప్పటివరకు వరుసగా ఆరుసార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత మొరార్జీ దేశాయ్ పేరిట ఉండగా.. ఆ రికార్డును నిర్మలా సీతారామన్ అధిగమించనున్నారు.

## ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ : నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ మిర్యాలగూడ నియోజకవర్గ సమావేశం పట్టణంలోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ 2018 డిసెంబర్ 12 నుంచి కటాఫ్ తేదీ నిర్ణయించకుండా ఇప్పటివరకు ఉన్న రుణాలతోపాటు బంగారం తాకట్టు పెట్టి వ్యవసాయానికి తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. జిల్లాలోని ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం లిఫ్టులను పూర్తిచేయాలని, సాగర్ ఆయకట్టు రైతాంగం వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి




ఎండి.సయ్యద్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శులు లింగానాయక్, యాదగిరి, నాయకులు పిల్లా కనకయ్య, దుర్గమ్మ, శాంతా, షమి, వెంకన్న, కోటయ్య, ఎర్రబోతు పద్మ, బంటు రాజేశ్వరి, రామలింగం, లింగంపల్లి సైదమ్మ, ఎర్ర ప్రమీల, వెంకన్న, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## కార్పొరేట్ ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

కూటమి బలమైన శక్తిగా అవతరించిందని, భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేందుకు సిపిఐ కూడా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల తరువాత కూడా బిజెపి ప్రభుత్వం దూకుడు, అప్రజాస్వామిక పనితీరును కొనసాగిస్తుందనే ఆందోళన వ్యక్తం చేశా రు. జూలై 1 నుండి మూడు నూతన నేర చట్టాలను అమలు చేయడం, బిజెపి నాయకులకు పాత మంత్రి త్వ శాఖలనే కొనసాగించడాన్ని చూస్తే అది స్పష్టమవుతుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్నంతా దుర్వినియోగం చేసి ప్రతిపక్ష నాయకులను వేధించడం , అసమ్మతిని అణిచివేయటం కొనసాగుతూనే ఉందని, అది మరింత పెరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 543 స్థానాలకు గాను వామపక్షాలు తొమ్మిది స్థానాలలో మాత్రమే (సిపిఐ–2, సిపిఐ(ఎం)–4, సిపిఐ(ఎంఎల్)–2,ఆర్ఎస్‌పి–1) గెలిచాయని, దీని పట్ల జాతీయ సమితి సభ్యులంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, పార్టీ , ఉద్యమ బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2024 డిసెంబర్ 26 నుండి సిపిఐ శత సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టాలని, పార్టీని పునరుత్తేజం కల్పించే కార్యకలాపాలు, ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు.

**మితవాద శక్తుల విస్తరణపై ఆందోళన...** ప్రపంచవ్యాప్తంగా మితవాద సంప్రదాయ శక్తులు పెట్రేగిపోతూ ఉదార బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థకు సవాలు విసురుతున్నదని, కేవలం ఐరోపాలోనే కాకుండా ఇక్కడ కూడా అవే తరహా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని డి.రాజా పేర్కొన్నారు. విదేశీయులు, వలసదారులు, ప్రత్యేకించి ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటున్న విద్వేష రాజకీయ సరళి అంతర్జాతీయ ధోరణిగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నుండి మనదేశం వేరుగా లేద ని, ఇక్కడ కూడా ఆ సరళికి బలం పెరిగిపోతుందన్నా రు. ఉదార ప్రజాతంత్ర పార్టీలు, వామపక్షాలు, మైనారిటీలకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఇచ్చిన పిలుపునకు వ్యతిరేకిస్తూ శక్తివంతమైన సైద్ధాంతిక పోరాటం ద్వారా ఎదుర్కోవాలని అన్నారు. ప్రజల జీవనోపాధికి సంబంధించిన కనీస అంశాలపై సుస్థిర ఉద్యమాలను స్వతంత్రంగా, వామపక్ష పార్టీలతో ఉమ్మడిగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇలాంటి పోరాటాలు మధ్యేవాద, ప్రాంతీయ పార్టీలపై సైద్ధాంతిక, రాజకీయ ప్రభావాన్ని చూపుతాయన్నారు. నాటో వ్యతిరేక, పాలస్తీనా ప్రజల సంఘీభావ ప్రచారాన్ని కొనసాగిస్తామని చెప్పారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల దుష్పరిపాలనకు వ్యతిరేకంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. బిజెపిని ఓడించేందుకు ఏకమైన ఉదార బూర్జువా, ప్రాంతీయ పార్టీల విశాల వేదిక ఇండియా కూటమితో సిపిఐ కొనసాగుతూనే, ముఖ్య కర్తవ్యాలలో ఒకటైన కమ్యూనిస్టు , విశాల వామపక్ష ఐక్యతను బలోపేతం చేసేందుకు పనిచేస్తామని ఆయన తెలిపారు. కార్మికవర్గం, రైతాంగం, మహిళ, యువత, విద్యార్థి, ప్రజల సమస్యలపై స్వతంత్ర, ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని, అలాగే ప్రజాస్వామ్య, మానవ హక్కుల అంశాలపైన కూడా ఉద్యమించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**శాసనసభ ఎన్నికలకు సన్నద్ధం :** త్వరలో జరిగే మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా, జమ్మూ కశ్మీర్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు, స్థానికసంస్థల ఎన్నికలకు రాజకీయ, నిర్మాణ ఏర్పాటు చేసుకోవాలని ఆయారాష్ట్రాల ను జాతీయ సమితి ఆదేశించినట్లు డి.రాజా తెలిపారు. మూడు నేరచట్టాలను ఉపసంహరించుకోవాలని, చత్తీస్‌గఢ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఖండిస్తూ, త్రిపురలో వామపక్షాలపై దాడులను ఖండిస్తూ, నీట్ కుంభకోణంపై ఉన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు చేయాలని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, బిఎస్ఎన్ఎల్‌ను కాపాడాలని, తదితర 11తీర్మానాలను సిపిఐ జాతీయ సమితి ఆమోదించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## సమాజంలో ఎన్ఎస్ఎస్ భాగస్వామ్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: సమాజంలో ఎన్ఎస్ఎస్ సేవలను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ సిఐ విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను డిపార్ట్‌మ్మెంట్ తరపున అవసరం ఉన్న చోట వాలంటీర్లను వాడుకునేందుకు కృషి చేయాలని కోరారు. సిఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అవసరం ఉన్న చోటు వినియోగించుకునేందుకు కృషి చేస్తామని, తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై అవగాహన ఉండాలి : సిఐ



ప్రజాపక్షం/కొత్తూరు: కొత్త చట్టాలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అదే విధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండేందుకు కృషి చేయాలని కొత్తూరు సిఐ నరసింహారావు సూచించారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటి పరిధిలోని వివిధ పాఠశాలలతో పాటు మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తూరు ఎస్ఐలు శ్రీనివాస్, బలరాం నాయక్‌తోపాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : పాఠశాల విద్యార్థుల కోసం గత ప్రభుత్వం ప్రారంభించిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమిళనాడు లాంటి రాష్ట్రాలు ఈ పథకాన్ని మరింత విస్తరిస్తున్న నేపథ్యంలోఇక్కడి ప్రభుత్వం మాత్రం అమలులో ఉన్న పథకాన్ని రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ పథకం రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించి, తిరిగి అమలు చేయాలని కెటిఆర్ కోరారు.

## వైభవంగా జిహెచ్ఎంసి కట్ట మైసమ్మ కల్యాణం, బోనాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారికి మంగళవారం జరిగిన కల్యాణ మహోత్సవం బోనాల వేడుకలో మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, జిహెచ్ఎంసి మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని మేయర్ ఆకాంక్షించారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు ప్రారంభించిన ఇవిడిఎం కమిషనర్



ప్రజాపక్షం/హైదరాబాద్: అక్రమకట్టడాలపైన ఇవిడిఎం కమిషనర్ రంగనాథ్ మంగళవారం చర్యలు తీసుకున్నారు. కుత్బుల్లా పూర్ లోని మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీకి సంబంధించిన పార్క్ స్థలంలో ఒక ప్రభుత్వ అనుమతులు లేకుండా, తప్పుడు అనుమతులతో భవన నిర్మాణాన్ని చేపట్టారు. దీనిపైన మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఇ. వి. డి. యం కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.ఇందుకు స్పందించిన కమిషనర్ రంగనాథ్ పూర్వాపరాలతో పాటు దస్తావేజులను, డాక్యుమెంట్లను పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారణ, సొసైటీ సభ్యుల వాదోపవాదాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అక్రమ నిర్మాణం చేబడుతున్న వ్యక్తులకు గతంలో నోటీసులను అందజేశారు. మంగళవారం ఇ. వి. డి.ఎం సిబ్బంది ఆ భవనం నిర్మాణాలను కూల్చివేసింది.

## రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పాత్ర

డాక్టర్ గీతిక వకాటి

ప్రజాపక్షం/హైదరాబాద్: రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' పాత్ర అమోఘమని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) కన్సల్టెంట్, బ్రెస్ట్, జనరల్ సర్జన్ డాక్టర్ గీతిక వకాటి తెలిపారు. కచ్చితత్వంలోనూ సామర్థ్యంలోనూ ఎంతో పురోగతి కలదన్నారు. ప్రపంచంలో మహిళల మరణాలకు రొమ్ము క్యాన్సర్ ప్రధాన కారణం అన్నారు. రొమ్ము క్యాన్సర్ గుర్తింపులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్ ఇమేజింగ్ విశ్లేషణలో సహాయపడుతుందని తెలిపారు. సంప్రదాయ మామోగ్రఫీ ముందుగా గుర్తించడానికి కీలకమైన సాధనమన్నారు. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గారిథమ్లు ద్వారా అది పెంచబడుతుందన్నారు. డేటాసెట్లపై శిక్షణ పొందిన ఈ అల్గారిథమ్లు మామోగ్రామ్లలోని సూక్ష్మ అసాధారణతలను కచ్చితత్వంతో గుర్తించగలవన్నారు. రేడియాలజిస్టులు మిస్ అయిన క్యాన్సర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గుర్తించగలదన్నారు. తద్వారా ప్రతికూలతలను తగ్గించవచ్చన్నారు. ఇది రోగులకు భరోసా ఇస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు.

## జిహెచ్ఎంసి ఉద్యోగులకు ఇంటిస్థలాలు

కమిషనర్ ఆమ్రపాలికి జిహెచ్ఎంఇయు అధ్యక్షుడు ఉదరి గోపాల్ వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న శాశ్విత ఉద్యోగులకు ఇంటి స్థలాలు, నగదు రహిత ఆరోగ్య కార్డులను అందజేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (జిహెచ్ఎంఇయు) అధ్యక్షుడు ఉదరి గోపాల్ కోరారు. ఈ మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాటను జిహెచ్ఎంసి కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎస్ఎంఅర్‌లను క్రమబద్ధీకరించాలని, శాశ్విత ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్లకు పెట్రోల్ లిమిట్‌ను పెంచాలని, డిఎలు, ఇంక్రిమెంట్లు, బాకాయిలను చెల్లించాలని తెలిపారు. అలాగే జిహెచ్ఎంసిలో సుదీర్ఘకాలంగా ఒకే పోస్టులో పనిచేస్తున్నవారిని బదిలీ చేయాలని గోపాల్ అన్నారు.

## 'ఇన్సూరెన్స్' నిందితుడి అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇన్సూరెన్స్ పేరుతో అమాయకులను మోసగిస్తున్న సైబర్ మోసగాడిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన తరుణ్ సచ్‌దేవా సైబర్ మోసగాడు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, భారతీ యాక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో ఇన్సూరెన్స్ చేసేందుకు అమాయకులను నమ్మించి మోసగించేవాడు. ఇలా మోసపోయిన వారిలో కొంతమంది బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రాజస్థాన్‌కు చెందిన తరుణ్‌సచ్‌దేవాను అరెస్టు చేశారు. నకిలీ ఇన్సూరెన్స్ ఏజెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్‌తో జీవితాలు దుర్భరం



అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్

దూల్ పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లో యువతకు డ్రగ్స్, కొత్త చట్టాలపై అవగహన

ప్రజాపక్షం/హైదరాబాద్ : డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల జీవితాలు దుర్భరమవుతాయని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అప్పుడే జీవితంలో ప్రయోజకులుగా అనిపించుకోవడానికి అవకాశం ఉంటుందని ఎక్సైజ్ శాఖ హైదరాబాద్ అసిస్టెంట్ కమినర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం దూల్ పేట లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లో యువతకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కొత్త చట్టాల వల్ల యువత డ్రగ్స్ వైపు మళ్లితే కలిగే నష్టాలు, వాటి పరిణామాలు, శిక్షలు ఎలా ఉంటాయని యువతకు వివరించారు. దూల్‌పేట్‌లో ఎక్కువగా గంజాయి వినియోగం ఎక్కువగా ఉంటుందని. తీవ్ర ఇబ్బందులకు గురిచేసే గంజాయికి వాడకం వల్ల కలిగే నష్టాలు, వాటి వల్ల జైళ్ల పాలు కావడం, కుటుంబాలు ఆర్థికంగా చితికపోయే పరిస్థితులు ఉంటాయని అసిస్టెంట్ కమిషనర్ యువతకు వివరించారు. జీవనోపాధిలో సంపాధించిన సొమ్మును గంజాయి లాంటి డ్రగ్స్‌ను వినియోగిస్తే కుటుంబాలు చిన్నాబిన్నం కావడంతో పాటు యువత తమ జీవితాల్లో ఏమి సాధించలేరని సిఐ మధుబాబు అన్నారు. కేంద్రం తీసుకవచ్చిన కొత్త చట్టాలతో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారిని పరీక్షించడానికి కొత్త యంత్ర పరికాలు వచ్చాయని కొత్తగా వచ్చిన నార్కోటిక్ పరికరాన్ని కూడా యువతకు చూపించారు. డ్రగ్స్ తీసుకుంటే ఎలా గుర్తించవచ్చో వివరించారు. గంజాయి వినియోగం, అమ్మకం, రవాణా కొత్తగా వచ్చిన ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించ బడుతుందని సిఐ వివరించారు. భవిష్యత్తులో ఎవ్వరైనా డగ్స్ తీసుకుంటే ఎదురయ్యే పరిణాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్‌టిఎఫ్ శేఖర్, సిఐ, ఎస్‌ఐలు విష్ణుగౌడ్, మధు, సైదులు సిబ్బంది పాల్గన్నారు.

## నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత

రాజస్థాన్ నుంచి దిగుమతి

185 ఫాంహౌస్, ఫంక్షన్‌హాల్స్‌లకు నోటీసులు

మూడు ఫాంహౌస్‌లు బ్లాక్‌లీస్టులోకి

ప్రజాపక్షం/హైదరాబాద్ :పార్టీలో లిక్కర్ వినియోగం అనుమతి తీసుకొని తెలంగాణ మద్యం కాకుండా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన మద్యాన్ని వినియోగించడంపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్.కృష్ణప్రియ బృందం భారీగా రాజస్థాన్‌కు చెందిన మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అనిన్యా సంగి పామ్ హౌజ్లో వినియోగిస్తున్న మద్యంపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఫామ్ హౌస్‌లో జరిగే పార్టీలో వినియోగిస్తున్న మద్యాన్ని పరిశీలిస్తే.. పార్టీలో తెలంగాణ మద్యానికి బదులు రాజస్థాన్ రాష్ట్రం నుంచి తీసుకవచ్చిన మద్యాన్ని వినియోగిస్తున్నట్లు తెలింది. ఈ పార్టీలో 24 మద్యం సీసాల ను స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ మద్యాన్ని రాజస్థాన్‌లోని చండీగర్ నుంచి తీసుకువచ్చినట్లు తెలిపారు. వారిచ్చినసమాచారంతో రాజస్థాన్ నుంచి వస్తున్న బస్సుల్లో తనిఖీలు చేయగా మరో 55బాటిళ్ల మద్యం పట్టుబడినట్లు కృష్ణప్రియ తెలిపారు. శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలో మద్యం అనుమతి తీసుకోకుండా మద్యాన్ని వినియోగించిన మూడు పామ్ హౌస్‌లపై కేసునమోదు చేయడమే కాకుం డా బ్లాక్‌లిస్టులో పెట్టారు. చేవేళ్ల ప్రాంతంలో 185 పైగా పామ్ హౌస్‌లు, పంక్షన్ హల్స్ ఉన్నాయి. వీరందరికి కూడా ఎన్‌డిపిఎల్ మద్యాన్ని వినియోగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేశారు. ఎన్‌డిపిఎల్ మద్యం పలు పంక్షన్లలో వినియోగిస్తున్నట్లు దాడులతో తమ నోటీసుకు వచ్చిందని ఎక్సైజ్ ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను వినియోగిస్తే.. సంబంధిత పంక్షన్హాల్ యాజమానిపై కేసు నమోదుతోపాటు ఆ పంక్షన్ హల్ బ్లాక్ లిస్టులో పెట్టడదం జరుగుతుందన్నారు. ఫంక్షన్ నిర్వహించిన వారి పై, మద్యాన్ని సరఫరా చేసిన వారిపై కూడ కేసు నమోదు చేస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడైన జరిగితే ఎక్సైజ్ శాఖ టోల్ ఫ్రీ నెంబరు 18004252523 కాల్ చేసి చెప్పాలని కోరారు. వివరాలు చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



## సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా నాగరాజు



హైదరాబాద్ : పిఅండ్‌టీకాలనీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా బాణగిరి నాగరాజును దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించింది. మంగళవారం నాగరాజుతో పాటుగా సభ్యులుగా గుండా జయమ్మ, శంకర్‌రెడ్డి, సుజాత లక్ష్మీ, శంకర్, శశికళ, శాంతిలతో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయంలో సీనియర్ పూజారి సీహెచ్ దివాకర్ ఎక్స్అఫిషియో మెంబర్‌గా ఉంటారని దేవదాయ శాఖ ఉత్తర్వుల్లో వెల్లడించింది. దేవస్థానం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా నాగరాజు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా ఎంపికకావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఇఒ దీప్తిరెడ్డి, కాలనీ సంక్షేమ నాయకులు ఎం.ప్రభాకర్, లంకా లక్ష్మీ నారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం

సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ (డబ్ల్యూ అండ్ సిఎస్ డబ్ల్యూ) డిసిపి సృజన కర్ణం అన్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్య వినియోగంపై సైబరాబాద్ పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి సృజన కర్ణం మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల కోసం 87126 71111 నెంబర్ రేకి కాల్ చేయలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని చెప్పారు. అనంతరం అమృత ఫౌండేషన్ ఎన్‌జిఒ డైరెక్టర్, పరిశోధక సైకాలజిస్ట్ దేవికారాణి ప్రసంగిస్తూ డ్రగ్స్‌మాఫియాను తుద ముట్టించి, యువతలో పరివర్తన తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని, ముఖ్యంగా యువతులు మత్తుపదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల వినియోగం, వారి భవిష్యత్తులను అంధకారంగా మారుస్తుంది, కావున, వారు ఇలాంటి పదార్థాలకు దూరంగా ఉండాన్నారు. కార్యక్రమంలో అమృత ఫౌండేషన్ ఎన్‌జిఒ డైరెక్టర్,పరిశోధక సైకాలజిస్ట్ దేవికా రాణి,(డబ్ల్యూ అండ్ సిఎస్ డబ్ల్యూ) ఎసిపి ప్రసన్న కుమార్, ఇన్ స్పెక్టర్ సునీత, ఎహెచ్ యుటియు సి ఇన్ స్పెక్టర్ జేమ్స్ బాబు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్ : శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా ఉండేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను నూతనంగా బాద్యతలు చేపట్టిన పట్టణ సిఐ విజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణంలో శాంతి భద్రలతోపాటు రాత్రి సమయాల్లో విధిగా పెట్రోలింగ్ నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. పట్టణంతోపాటు శివారు కాలనీల్లో రాత్రి సమయాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై దృష్టికి కేంద్రీకరించడంతోపాటు పెట్రోలింగ్, గస్తీ నిర్వహించే విధంగా చూడాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.



కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డికి శుభాకాంక్షలు

రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మా ప్రాంతంలో ఉన్న రోడ్ల పరిస్థితిపై కృషి చేయాలని చైర్మెన్‌ను ఎమెల్యే కోరారు.

# బోనాల పండుగకు ఏర్పాట్లు



ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్, మధుబన్ కాలనీలోని పోచమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో బోనాల పండుగను పురస్కరించుకొని జరుగుతున్న అభివృద్ధి పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ జిహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని దేవాలయానికి కాలినడకన వచ్చే భక్తులకు, ప్రజలకు, ఇబ్బంది కల్గకుండా నూతన సీసీ రోడ్డు పనులు, ప్యాచ్ వర్క్స్‌ను ప్యాచ్ వర్క్‌ను చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ ఉత్సవాల దృష్ట్యా చేపట్టిన అభివృద్ధి పనులల్లో లోపాలు లేకుండా సకాలంలో నిర్ణీత సమాయానికి అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. శానిటేషన్ పనులను, స్ట్రీట్ లైట్స్ మరమత్తు పనులను పూర్తిచేయాలని సంబంధిత శాఖాధికారులను కోరారు. ఈసందర్భంగా బస్తీవాసులు తోకల శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి వర్క్ఇన్‌స్పెక్టర్ జియా, వినయ్, లోక్‌నాథ్, బుచ్చిరెడ్డి, ఎల్‌విరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి, ఉత్తం, రమణ, మధుసూధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గోపాల్‌నాయక్, కుర్మ య్య, చెన్నమ్మ, పాండుయాదవ్, చిన్న, శంకర్‌రెడ్డి, శేఖర్, మధు నాయక్ పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/హైదరాబాద్: ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి హైదరాబాద్‌తో పాటు దాని శివార్లలో విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టను ఎక్సైజ్ పోలీసులు రట్టుచేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్‌సూపరింటెండెంట్ బి.ముకుందరెడ్డి ఆదేశాలమేరకు ఉప్పల్ ఎక్సైజ్ ఎస్ఐలు బి.ఓంకార్, శ్రీనివాసులు మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న భరత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ముజీబ్, ధర్మపురికాలనీకి చెందిన ఎ.శంకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారి నుంచి 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## గుర్తుతెలియని మహిళ శవం లభ్యం

ప్రజాపక్షం/కేశంపేట: కేశంపేట మండలం వేములనర్వ శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలోని చెట్లపొదల్లో మంగళవారం గుర్తు తెలియని మహిళ శవం కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవాలయం చుట్టుపక్కల వ్యవసాయ పొలాల రైతులు తమ పనుల నిమిత్తం వెళ్లగా చెట్ల పొదల్లో మహిళ శవం కనిపించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందజేయగా వారు క్లూస్ టీంలో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చనిపోయిన మహిళ పేరు, వివరాలు తెలియకపోగా ఆమె తలపై గాయాలు ఉన్నట్లు, పరిసర ప్రాంతాల్లో మద్యం సీసాలు ఉన్నాయని మహిళది హత్యా, ఆత్మహత్యనా అనే విషయమై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆమె వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండొచ్చని గ్రామస్తులు తెలిపారు. చనిపోయిన మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటి ఆసుపత్రికి తరలించి విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కమిషనర్ శరత్ చంద్ర



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కమిషనర్ బి.శరత్‌చంద్ర మంగళవారం 18వ డివిజన్‌లో యాంటీ లార్వా స్ప్రే చేయించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. వర్షపు నీరు నిలిచిన వెంటనే చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన18,19వ డివిజన్‌ల యందు ఇంటింటికి చెత్త సేకరణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్,జవాన్లు యాదగిరి,నరేందర్,రాము,కామాటీలు వేణుగోపాల్,పవన్ కళ్యాణ్,ఎస్ఏటీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థలపరిశీలన



ప్రజాపక్షం/రాజేంద్రనగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలో పరిధిలోని 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీల్లో విద్యుత్ సమస్యల పరిష్కరానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకుగాను రాజేంద్రనగర్ సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ గోపయ్య, రాజేంద్ర నగర్ డివిజనల్ ఇంజనీర్ పి.రత్నాకర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్పొరేటర్ శ్రీలత సురేష్‌గౌడ్ చొరవతో కాలనీల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాస్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు బాబురావు, కృష్ణ పాల్గొన్నారు.

## ఇంటింటికి మొక్కలు పెంచండి

మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్



ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటింటికి మొక్కలను పెంచాలని మేయర్ మద్దెల ప్రేమ్‌లతా గౌడ్ కోరారు. మంగళవారం కమిషనర్ బి.శరత్ చంద్ర, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి 22వ డివిజన్‌లలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు,మున్సిఫల్ అధికారులు,సిబ్బంది,పలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం



ప్రజాపక్షం/షాద్‌నగర్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి చెందిన తిరుపతిరెడ్డి జన్మ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుపతిరెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్‌లు తిరుపతిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. షాద్‌నగర్ పట్టణ శివారులో ఉన్న వృద్ధాశ్రమంలో చెంది తిరుపతిరెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పా టు చేశారు. కార్యక్రమంలో అలీం సఖిబ్, జాఫర్‌ఖాన్, బచ్చలి నరేష్, తంగిడిపల్లి శంకర్, మేకల వెంకటేష్, చందూలాల్, కత్తి చంద్రశేఖర్ అప్పా, డాక్టర్ రవికుమార్, న్యాయవాది శ్యాంసుందర్ పాల్గొన్నారు.



## కమిషనర్ సింధూర హోటల్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/జడ్చర్ల :** కమిషనర్ సొంటే రాజయ్య ఆధ్వర్యంలో జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని సింధూర హోటల్ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించడం జరిగింది. అపరిశుభ్రంగా ఉండడంతో పాటు ఆహారంలో నాణ్యత లేకపోవడం వలన హోటల్ యజమానికి 3000 రూపాయలు జరిమానా విధించడం జరిగింది. వర్షాకాలం ఉన్నందున (డెంగూ, మలేరియా, కలరా) వివిధ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. హోటల్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి. లేని యెడల 50000 రూపాయల వరకు పెనాల్టీ విధించబడును అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగేశ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్, శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మున్సిపల్‌కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అమలుచేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లిజైపాల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎఐటియూసి కార్యాలయంలో జిల్లాప్రధాన కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా వనంపల్లిజైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి 44కార్మికచట్టాలను నాలుగుకోడ్‌లుగా తీసుకురావడం కార్మికహక్కులను కాలరాయడమే అన్నారు. మున్సిపల్‌కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టుప్రకారం సమానపనికి సమానవేతనం అమలుచేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు విధినిర్వహణలో మరణిస్తే ఆకుటుంబానికి 25లక్షలరూపాయల ఎక్స్‌గ్రేషియో అమలుచేయాలన్నారు. జాతీయపండుగ సెలవులు అమలుచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లాసహాయ కార్యదర్శి చిన్నపాగశ్రీనివాసులు, మున్సిపల్‌కార్మికులు మల్లేష్, ఆంజనేయులు, భాస్కర్, రాముడు, బాలస్వామి,నర్సింహ్మా పాల్గొన్నారు.



## ఇంటినిర్మాణ సామాగ్రి అందజేత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అంకమోనికుంట గ్రామానికిచెందిన ఒంటరిమహిళ అమృతకు ఇంటినిర్మాణానికి కావాల్సిన రేకులను నిర్మాణ సామాగ్రి జక్కులజంగయ్యయాదవ్ యువసేన నాయకులు మంగళవారం అందజేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కసిరెడ్డినారాయణరెడ్డికి మద్దతుగా ప్రచారం సందర్భంగా మాకు ఇల్లులేదని ఇంటినిర్మాణానికి కావాల్సిన రేకులు నిర్మాణ సామాగ్రి అందజేయాలని అమృత కోరింది. జంగయ్యయాదవ్ స్పందించి కసిరెడ్డినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినవెంటనే ఇల్లుకుకావాల్సిన మెటిరియల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆహామీ మేరకు రేకులు, నిర్మాణసామాగ్రి జంగయ్యయాదవ్ యువసేన సభ్యులు నరేష్ యాదవ్, మల్లేష్‌లు మెటిరియల్‌ను అమృత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, కట్టరాములు, లింగయ్య, పెద్దరాములు, ముకురాల శ్రీశైలం పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని సుభాష్‌నగర్‌కాలనీకిచెందిన చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్ అనేవ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ వారి ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనవెంట మాజీసర్పంచ్ జిల్లెల్ల రాములు, కౌన్సిలర్ చిన్న, మాజీ కౌన్సిలర్ రామరాజు, నాయకులు కరణ్, పడకంటివెంకటేష్ , చంద్రకాంత్, శ్రీశైలం, సురేష్, పరుషరాములు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామానికి సంబంధించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే కూచుకుళ్లరాజేష్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. గతకొంతకాలంగా తీవ్ర విద్యుత్‌కోతలు ఎదుర్కొంటున్న మంగనూర్ గ్రామప్రజల సమస్యలను తీర్చడానికి విద్యుత్‌శాఖ డిఇఇ, ఏఈ సిబ్బందిని పిలిచి సమస్యతలెత్తడానికి గల కారణాలు వాటి పరిష్కారానికి తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరల ఇలాంటి సమస్యలు ఎదురైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే తీసుకున్న చర్యలపట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

# భారీ వర్షాలకు నష్టపోకుండా చర్యలు



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ప్రజలు భారీ వర్షాలకు నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ, సిపిఐ అనుబంధ ఏఐటియూసి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి సిపిఐ ఆఫీస్‌లో సిపిఐ అనుబంధ ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కె. శ్రీరాం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదు రోజుల పాటు భారీ అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పలు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, కెఎల్ఐ, భీమా, జూరాల కాలువలు దెబ్బతినకుండా కాపాడాలన్నారు. మిషన్ భగీరథలో పనులు నాణ్యవంతంగా జరగలేదన్నారు. పాన్‌గల్ మండలం కేతేపల్లిలో 100 ఎకరాల ఆయకట్టు గల గుండ్ల చెరువు తూములు సరిగా లేవన్నారు. చెరువు, కుంటల కట్టలు, పంట , పాటు కాలువలు వెంటనే మరమ్మత్తు చేయాలన్నారు. ప్రాజెక్టుల కాలువల్లో జమ్ముమట్టి పేరుకుపోయిందని, కాల్వల గట్లు దెబ్బతిన్నాయని, నీరు వదిలేతే తెగిపోయే పరిస్థితి ఉందన్నారు. వర్షపు నీరు ప్రతి చుక్కను విడిచిపెట్టి తాగునీటికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మంది పేదలు ఇల్లు కట్టుకొని స్తోమత లేక శిథిలమైన ఇళ్లలోనే నివాసం ఉంటున్నారని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తామని ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు ఇచ్చి నీడ కల్పించాలన్నారు. వర్షాలకు పారిశుద్ధ్యం పలు రకాల రకాల జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వాటర్ క్లోరినేషన్ , తాగునీటి పైపుల లీకేజీల మరమ్మత్తు చేయాలన్నారు. సిపిఐ అనుబంధ ఏఐటియూసి జిల్లా కార్యదర్శి మోష, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాలను విచారణ కమిషన్ ముందు వివరించా: వేదిరే శ్రీరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను విచారణ కమిషన్ ముందు వివరించానని కేంద్ర జలశక్తి సలహాదారు వేదిరే శ్రీరామ్ తెలిపారు. మేడిగడ్డ, తుమ్మిడి హెట్టి రెండు ప్రాంతాల వద్ద నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను కూడా కమిషన్‌కు అందించినట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన జస్టిస్ పినాకిని చంద్ర ఘోషే విచారణ కమిషన్ ముందు సోమవారం వేదిరే శ్రీరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన అంశాలను సమగ్రంగా వివరించారు. తుమ్మిడి హెట్టి నుంచి మేడిగడ్డ వద్దకు ప్రాజెక్టు మార్చడానికి కారణాలను, తుమ్మిడి హెట్టి వద్ద 160 టిఎంసిల నీటి లభ్యత ఉన్నదని సి డబ్ల్యూ సి ఆమోదించిందని వివరించినట్టు ఆయన మీడియాకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక అంశాలు, డిజైన్స్, తదితర అంశాలతో పాటు ఎన్‌డిఎస్‌ఎ ఇప్పటికే అందజేసిన రెండు నివేదికలు, సంఘటన జరిగిన తర్వాత తాత్కాలిక నివేదికపైన కూడా చర్చించినట్టు ఆయన తెలిపారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదికలపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు అంశాలపై చర్చ జరిగిందన్నారు.

# కాంగ్రెస్‌తోనే గౌడలకు గౌరవం

### నేడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌గౌడ్ ప్రమాణం



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వంలో గౌడన్నలకు సమున్నత గౌరవం దక్కుతుందని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బండారు శ్రీనివాస్‌గౌడ్ ఈ నెల 17న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా ఎంతో రాజకీయ అనుభవం కలిగిన శ్రీనివాస్‌గౌడ్ గతంలో వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్‌గా మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించి వనపర్తి పట్టణ మున్సిపాల్టీలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు మంచి పేరు సంపాదించుకున్నారని అన్నారు. అంతేకాక మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కూడా పని చేసిన శ్రీనివాస్‌గౌడ్ ఆ తర్వాత వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పని చేశారన్నారు. రెండోసారి వనపర్తి వ్యవసాయ మార్కెట్ మార్కెట్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఈ నెల 17న వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డా. మల్లురవి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి , ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డితో పాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



## తాగునీటి సమస్యకు సత్వరపరిష్కారం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామానికి రావాల్సిన మిషన్‌భగీరథపైప్‌లైన్ వాటర్‌లెవెల్ తక్కువగా ఉండటంవల్ల గతకొంతకాలంగా తీవ్రనీటి కొరత సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామ ప్రజలు ఈసమస్యను మంగళవారం ఎమ్మెల్యే కూచుకుళ్లరాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన సంబంధిత అధికారులనుసైట్‌దగ్గరకు పిలిపించి ప్రజలమధ్యలోనే సమస్య పరిష్కారానికి తగిన ఆదేశాలుజారీచేశారు. దీంతోప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



## భూవివాదంలో భార్యభర్తలపైదాడి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మండలపరిధిలోని చందుబట్ల గ్రామంలో కొండకిందిసుదర్శన్‌రెడ్డి తండ్రి పుల్లారెడ్డిని భూవివాదంలో అదేగ్రామానికిచెందిన ముష్టివారు కర్రలతోదాడిచేశారు. ఈదాడిలో సుదర్శన్‌రెడ్డి వారిభార్య కళావతమ్మ క కుమారులు మల్లారెడ్డి, మాధవరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ఈదాడిలో సుదర్శన్‌రెడ్డితలకు చేతికి కాళ్లకు 31కుట్లుపడ్డాయి. దాడికిగురైన ఆకుటుంబాన్ని రెడ్డిసేవాసమితి జిల్లా అధ్యక్షులు దొడ్లనారాయణరెడ్డి, తాలుకా అధ్యక్షులు లింగారెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి , రామకృష్ణారెడ్డిలు జనరల్ ఆస్పత్రిలో పరామర్శించారు. దాడికిగల కారణాలుతెలుసుకొని దాడిచేసినవారిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో రెడ్డిసేవాసమితి సభ్యులు ఉన్నారు.



## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**ప్రజాపక్షం / కొత్తకోట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌ను ఐదు లక్షలు ఇవ్వాలని వారి కుటుంబంలోని వారసులకు అదే ఉద్యోగం కల్పించాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కొత్తకోట మున్సిపల్ కార్మికుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కొత్తకోట పటంలో అత్యధికంగా వార్డులు వీధులు ఉన్నాయని వాటిలో పని చేయడానికి డ్రైనేజీల శుభ్రం రోడ్లుచ్చడం, సిబ్బందిని పెంచాలని కోరారు. ప్రస్తుతం 15 మంది సీపర్స్ 12 మంది, కామాటీలు 7 మంది , డ్రైవర్లు మొత్తం 34 మంది పని చేస్తున్నారని వీరి సంఖ్యను పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికుడు మరణిస్తే 25 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, దహన సంస్కారాలకు రూ. 30వేలు ఇవ్వాలని, ఆదివారం పండుగ సెలవులు 8 గంటల పని దినాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాల్టీ జీఓ ఆర్టీ నంబర్ 1037లో ప్రతిపాదించిన ప్రకారం మున్సిపాల్టీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకి చెప్పాలని నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరారు. జిఓ, ఆర్డీ నంబర్ 60 జిఓ ఆర్టి నంబర్ 63లో నిర్ణయించిన విధంగా కేటగిరిల వారిగా వేతనాలను చేయాలని, ఫిక్స్డ్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మికులు కె. వెంకటయ్య, రాజు, కురుమన్న ప్రసాద్ , మద్దిలేటి, కొండన్న, ఎర్రన్న, లక్ష్మి , శిరిష, సుశీల, సుగుణమ్మ, మన్నెమ్మ, దివ్య, సరళ తదితరులు పాల్గొన్నారు.




## అనుమతులులేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని అనుమతులులేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌డబ్ల్యూ నాయకులు సంతోష్‌కుమార్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలపరిధిలోని కొట్రచౌరస్తావద్ద ఉన్న ఐకాన్‌పబ్లిక్ పాఠశాలముందు ధర్నా సందర్భంగా మాట్లాడుతూ శాస్త్ర ఇంటర్నేషనల్ స్కూల్‌పేరుమీద అనుమతి ఉంటే దిఐకాన్‌పబ్లిక్ పాఠశాల అని బోర్డు పెట్టుకున్న యాజమాన్యంపాఠశాల నడిపిస్తున్నారని వెంటనే విద్యాశాఖ అధికారులు ఐకాన్‌పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. అదేవిధంగా స్కూల్‌బస్సులమీద శాస్త్రస్కూల్ అనేపేరుపెట్టుకొని నడిపిస్తున్నారని ఆస్కూల్‌కు దిఐకాన్ పబ్లిక్‌స్కూల్‌పేరుమీద ఇంకా అనుమతి రాలేదని కాని యాజమాన్యంవారు దిఐకాన్ పబ్లిక్‌స్కూల్ అని ప్రచారం చేసుకొని స్కూల్‌బోర్డు పెట్టుకొనివేల రూపాయలు పేరుమీదఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థిసంఘం మండల అధ్యక్షుడు రాహుల్, పిడిఎస్‌యు నాయకులు మల్లేష్, నితిన్ పాల్గొన్నారు.



## తైక్వాండో రాష్ట్ర స్థాయికి ఎంపికైన అన్నా చెల్లులు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ కమిటీ హాల్‌లో జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన అన్నా చెల్లెలు బాలుర విభాగంలో బుద్ధారం యశస్వి ఎంపికయ్యారు. ఈ నెల 19,20,21 తేదీలలో మంచిర్యాల జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభను కనబర్చి వనపర్తి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సొంట శివలీల బ్లాక్ బెల్ట్ బిఎంఆర్‌కె తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ బుద్ధారం మురహరి, మాస్టర్ బుద్ధారం రవికుమార్ , విద్యార్థులను అభినందించారు.



## పెబ్బేరులో ప్లాట్ల బాధితుల ఆందోళన

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపాల్టీ పరిధిలోని 458 సర్వే నంబర్‌లో గత 15 సంవత్సరాల క్రితం కొందరు వ్యాపారులు ప్లాట్‌లు వేశారు. పెబ్బేరు స్థానికులు సుమారుగా కనకదుర్గ వెంచర్ , శ్రీనివాస్ వెంచర్‌లలో 450 మంది ప్లాట్ల యజమానులు ఉన్నారు. కాని హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ముస్లిం కబ్జాదారులు ఈ 458 నంబర్‌తో పాటు ఇదే రెవెన్యూ పరిధిలో 545, 555 సర్వే నంబర్‌లను కలుపుకొని మొత్తం 13 ఎకరాల 39 గుంటలు మాఫీ ఇనాం అని వనపర్తి ఆర్డీఓకు అప్పీల్ చేశారు. ఈ విషయంలో వనపర్తి ఆర్డీఓ చుట్టూ పక్కల రైతులతో , ప్లాట్ యజమానులతో సమగ్ర విచారణ చేయకుండా తూతూ మంత్రంగా హియరింగ్ జరిపి హైదరాబాద్ వాసులకు ఈ భూమి చెందే విధంగా ఆక్యూపెన్సీ రైట్ సర్టిఫికెట్ ఇంప్లిమెంటేషన్ కొరకు స్థానిక తహసీల్దార్‌కు పంపించారు. విషయం తెలుసుకున్న ప్లాట్‌ల యజమానులు, రైతులు విచారణ జరపకుండా వేరే వారికి మా భూములు అప్పజెప్పడంపై తీవ్ర నిరసన తెలుపుతూ ఇంప్లిమెంటేషన్ ఆపాలని కోరుతూ మాకు అన్యాయం జరగకుండా మా ప్లాట్‌లు , భూములు మాకే దక్కాలని సుమారు 50 మంది తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ గౌడ్ , పరుశరాముడు, మైబు, శివారెడ్డి, ఎల్లస్వామి, వెంకటేష్ , నాగేశ్వర్ రెడ్డి, నిజాముద్దీన్ , సర్వేష్ , వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫామ్ మొక్కలు నాటేందుకు తగు చర్యలు

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ ఫాం తోటల విస్తరణ పథకం కింద వనపర్తి జిల్లాలో ఆల్వా మొక్కలను కడుకుంట గ్రామంలో గల ఆయిల్ ఫాం నర్సరీలో సంవత్సరానికి సరిపడా ఆయిల్ ఫాం మొక్కలను పెంచి రైతుల పొలాల్లో నాటుటకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఇప్పటి వరకు జిల్లాలో గత సంవత్సరం వరకు 4868 ఎకరాలలో ఆయిల్ ఫాం మొక్కలు నాటడం జరిగింది. 2024 / 25 ఆర్థిక సంవత్సరానికి సాగు లక్ష్యం 2800 ఎకరాలుగా మెగా ప్లాంటేషన్‌లో భాగంగా వనపర్తి జిల్లాలో వనపర్తి , పాన్‌గల్ , ఆత్మకూరు మండలాలలో ఐదుగురు రైతులకు చెందిన 17 ఎకరాలలో ఆయిల్ ఫాం తోటలు నాటడం జరిగింది. సాగు చేయు రైతులకు ప్రోత్సాహకంగా నాలుగు సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం ఆయిల్ ఫాం తోటల యాజమాన్యం నిమిత్తం , అంతర పంటల నిమిత్తం ఎకరాకు రూ. 4200 ఇవ్వడం జరుగుతుంది. ఆయిల్ ఫాం తోటలు సాగు చేయదాల్సిన రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఆయిల్ ఫాం క్లస్టర్ అధికారి లేదా ఉద్యాన అధికారిని సంప్రదించాలన్నారు.

## మొహర్రం పండుగ సందర్భంగా భక్తులకు అన్నదానం

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మతసామరస్యానికి ప్రతికగా హిందూ ముస్లింలు మొహరం వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. మండల పరిధిలోని సంగినేనిపల్లిలో మంగళవారం ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు డా. ఇంద్రకంటి వెంకటేష్ మొహరం వేడుకలను పురస్కరించుకొని భక్తులకు అన్నదానం చేశారు. గ్రామాలలో హిందూ, ముస్లింలు మొహరం వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. భక్తులు పీర్లకు దట్టిలు పూలమాలలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల గుండం వద్ద రాత్రి వేళలో పురుషులు అల్లాయ్ బలాయ్ , మహిళలు బొడ్డెమ్మలు ఆడారు.

# రుణమాఫీ జీఓను సవరించాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి. బాల్‌రెడ్డి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 567 ప్రకారం రైతుల రుణమాఫీకి రూపొందించిన నిబంధనలలో అంశాలను సవరించి రెండు లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధిచేకూరేలా సవరించాలని వనపర్తి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడి బాల్ రెడ్డి డిమాండ్ చేశారు. విలేకరులతో మాట్లాడుతూ జీఓ ప్రకారం రేషన్ కార్డ్ ఆధారితంగా ఉన్న వారందరిని ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికి రుణమాఫి వర్తింపజేయడం వలన, కుటుంబంతో విడిపడిన వారికి రుణమాఫి వర్తించకపోవడంతో చాలా మంది లబ్దిదారులు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఆధార్ కార్డు, పాస్‌బుక్ డేటా, రేష్ కార్డు డేటా ఒకటిగా ఉన్న వారికే వర్తింపజేశారు. ఆధార్ కార్డు లేని వారు ధరణి సమస్యల వల్ల 15 లక్షల మంది పాస్ పుస్తకాలు రాలేదని, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నారాని, వ్యవసాయం కొరకు రుణం తీసుకున్న సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ , జైంట్ లేయ బిటిల్ గ్రూప్ , రైతు మిత్ర గ్రూప్ , కౌలు రైతు దార్లకు ఇచ్చిన లోన్ రుణమాఫి వర్తించదని ప్రకటించడం సరైనది కాదన్నారు. వాస్తవానికి ఈ నాలుగు గ్రూపులోని వారు అత్యంత పేదలే కాక దళిత, గిరిజన , వెనుకబడిన వర్గాలు వారు ఉన్నారు. ఈ గ్రూపులో కూడా వర్తింపజేయాలని రీ షెడ్యూల్ చేసిన రుణాలు కూడా రుణమాఫి వర్తించదని నిబంధన పెట్టడం సరైనది కాదని అదేవిధంగా రెండు లక్షలు మించి రుణం పొందిన వారు రెండు లక్షల పైన ఉన్న అప్పు చెల్లిస్తేనే మాఫి వర్తిస్తుందని నిబంధన పెట్టడం కూడా సరైనది కాదన్నారు. పాసుబుక్కు ఉన్న ప్రతి రైతుకు , నాలుగు గ్రూపులకు , కౌలు రైతులకు , రీ షెడ్యూల్ చేసిన వారికి, ప్రతి ఒక్కరికి ఏకకాలంలో రెండు లక్షల రుణాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు.



## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ప్రజాపక్షం / వీపనగండ్ల : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీపనగండ్ల గ్రామంలో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని తల్లిదండ్రులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆట పాటలతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించటం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణ బాయ్, కమల, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ, ఆయాలు ఉన్నారు.

## రైతు రుణమాఫీ హర్షణీయం



**ప్రజాపక్షం/తాండూరు :** సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రె స్ పార్టీకే సాధ్యమని, రైతు రుణమాఫి హర్షణీయమని టిపిసిసి మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డిలు అన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రూ. 2లక్షల రుణమాఫి చేస్తున్నట్లు సిఎం రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారి చేయడం హర్షణీయమని అన్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన పెద్దేముల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం నాయకులు రైతులతో కలసి రైతు రుణమాఫీపై సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రియాజ్, జిల్లా ఉపాధ్యక్షులు నల్లపొల్ల ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మీరాజ్, యువజన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్,తదిత నాయకులు ఉన్నారు.

## డ్రింకింగ్ వాటర్ యూనిట్ ప్రారంభం



**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేస్2లోని జయశంకర్ పార్కు వద్ద ఇన్నోవేటివ్ ఆక్వా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని బాలరాజు బబ్బూరి ఏర్పాటు చేసి డ్రింకింగ్ వాటర్ యూనిట్‌ను టిఎస్‌ఐఐసి జోనల్ మేనేజర్ అనురాధ,ఐలా కమిషనర్ ప్రభాకర్,ఐలా చైర్మన్ జక్కా రోషిరెడ్డిలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వాటర్ యూనిట్‌ను ఏర్పాటు చేసిన వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐలా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి,పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ నియోజకవర్గాన్ని రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేస్తా

### కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**ప్రజాపక్షం/బంట్వారం :** వికారాబాద్ నియోజకవర్గంలో నిరుద్యోగం అనేదే లేకుండా చేయడమే తన లక్ష్యమని తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంగళవారం అన్నారు. బంట్వారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేంకటేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంలో ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు నిరు పేద కుటుంబాలకు ఎంతో చేయూతనిస్తుందని పేర్కొన్నారు. అందులో భాగంగా కళ్యాణ లక్ష్మి 36 చెక్కులు, షాదీ ముబారక్ 10 చెక్కులు మొత్తం 46 మంది లబ్ధిదారులకు రూ.46 లక్షల 5336లు అందించడం జరిగింది. మన నియోజకవర్గంలోని రోడ్లు, వంతెనలు ఎక్కడెక్కడ ఏవేవి అవసరం ఉన్నాయో వాటన్నింటినీ నూతనంగా నిర్మించే బాధ్యత తనదేనన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని వాటన్నింటిని వీలైనంత తొందరగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం అనేదే లేకుండా చేయడమే కాంగ్రేస్ ప్రభుత్వం లక్ష్యమని నియోజకవర్గానికి ఒక కంపెనీని ఏర్పాటు చేస్తుందని అందులో భాగంగానే మన నియోజకవర్గానికి కూడా ఒక కంపెనీని తీసుకువస్తానని పేర్కోన్నారు. కంపెనీ నిర్మాణం కోసం కూడా స్థలం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. రైతుబంధు ఎన్ని ఎకరాలలోపు రైతులకు ఇవ్వాలనే దాని కోసం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చేనెల ఆగష్టు 15వ తేదీన రైతు బంధును రైతు భరోసాగా పేరుమార్చి అర్హులైన రైతులందరికీ ఒకేదఫాలో 15 వేల రూపాయల పెట్టుబడి సాయం అందజేయడం జరుగుతుందన్నారు. రైతు రుణమాఫీ మార్గదర్శకాలు వచ్చాయని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్ని అమలు అవుతున్నాయని, మిగిలిన ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు మార్గదర్శకాలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ ప్రవీన్ కూమార్, మండల వ్యవసాయ అధికారి సంధ్య, సుప్రర్నిడెంట్ సుశీల్ కూమార్ షిండే, పిఎసిఎస్ ఉపధ్యక్షులు సుధకార్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ కార్యదర్శి రంగారెడ్డి, మాజీ ఎంపిపి ప్రభాకర్, మాజీ జెడ్పీటిసి సంతోష రాజు, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వేంకటేశం, వర్కింగ్ కమిటి అధ్యక్షులు సుదర్శన్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు నర్సిములు, నాయకులు సిద్ధి రాములు, యాదగిరి, ఎన్ నర్సిములు, అలంపల్లి శ్రీనివాస్, శంకర్ యాదవ్, హరీశ్వర్ రెడ్డి, అయా గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

## వంతెన పనులు తొందరగా పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి



**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డిల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బి) మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి మున్సిపల్ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వినతి పత్రం అందచేయడం జరిగిందని త్వరలో ఆర్ అండ్ బి నుంచి నిధుల విడుదలకు, బ్రిడ్జి పనులు వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేయండం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వనమహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తూంకుంట మున్సిప ల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా పోతాయిపల్లిలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వార నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి పురపాలక సంఘంలోని రోడ్లు, అవె న్యూ ప్లాంటేషన్, పా ర్కులు, బ్లాక్ ప్లాంటేషన్, ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఇంటింటికి ఆరేసి మొక్కల చొప్పున పంపిణి చేస్తున్నామని అన్నారు. 16 వార్డుల్లో మొక్కలు నాటే కార్యక్రమాల ను కౌన్సిల్ సభ్యుల ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్‌లు హరిబాబు, నర్సింగ్‌రావుగౌడ్, కోఆప్షన్ సభ్యులు మిర్జాషఫీ ఉల్లాబేగ్, మేనెజర్ శ్రవన్‌కుమార్, ఆర్‌ఐ భాస్కర్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.చర్లపల్లి పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ పక్కన సిసి రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో 14వ తేదీ ఆదివారం పడి ఉండగా 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడని సిఐ రవీందర్ తెలిపారు.ఆచూకీ తెలిసిన వారు చర్లపల్లి ఇన్స్‌పెక్టర్ సెల్ ఫోన్ నంబర్ 8712662722,పోలీస్ స్టేషన్ 8712662788 నంబర్ సమాచారం అందించాలని సిఐ తెలిపారు.

## ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సైదులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, శామీర్‌పేట మండల ప్రత్యేకాధికారి సైదులు అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో మాట్లాడారు. ఒక్కొక్క శాఖ అధికారితో మాట్లాడి ఆ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మమతబాయి, తహశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఇఓ వసంతకుమారి, ఎఇ పిఆర్ శ్రీనువాస్, ఏపిఎం సురేష్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఎఈ ట్రాన్స్‌కో సురేందర్, పంచాయతి కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 200607 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశ్వాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్ననాటి మిత్రులు కలుసుకుని తమ యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాము చేసిన అల్లరి చిల్లర పనులను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. ఎవరెవరు ఏమి చేస్తున్నారు ఎక్కడెక్కడ ఉన్నారు అనే విషయాలను తెలుసుకుని సరదగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మమాట- అంగన్వాడీ బాట

చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్కేసర్ :** పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్ గుడాలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చిన్న పిల్లలను అంగన్వాడి కేంద్రాలకే పంపించడం వల్ల నైపుణ్యం గల టీచర్లు పౌష్టికాహార అందుతుందన్నారు. అదే విధంగా మహిళలు గర్భిణీలు, బాలింతలు బాలబాలికలు తీసుకోవడం వలన ఆరోగ్య భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గొంగళ్ళ మహేష్ కురుమ, మాజీ ఉపసర్పంచ్ అకిటి బాల్రెడ్డి అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు చిన్నారుల తల్లి దండ్రులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

టియూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పాత్రికేయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవటంతో పాటు ట్రేడ్ యూనియన్ విధి విధానాల పట్ల అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ సూచించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శా ఖ, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో శేషాద్రినగర్ క మ్యూనిటీ హాలులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూనియ న్ అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు అధ్యక్షతన జరిగిన ఆత్మీ య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాత్రికే యులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాకా తెలంగాణా మీడియా అకాడమి చైర్మన్‌గా నియమితులైన కె. శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో పాత్రికేయుల సమస్య లు పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో గతంలో ఏ నాడూ లేని విధంగా రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాత్రికేయుల సమస్యల పరిష్కార దిశగా తరచు సమావేశా లు జరుగుతున్నాయని, త్వరలో ఓ కొలిక్కి వస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. గత ప్రభుత్వ నిర్లక్షం కారణంగా జర్నలిస్టులు ఆరోగ్య పథకాన్ని కోల్పోయారని, ఫలితంగా సమయానికి వైద్యం పొందలేక కొంత మంది ప్రాణాలు సైతం కోల్పోవాల్సిన పరిస్థితులతో కొట్టు మిట్టాడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభు త్వ జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ హెల్త్‌కార్డులను అందచేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి పాత్రికేయుడికి అక్రిడిటేషన్‌లు అంద చేసే అవసరం ఉందని, అదే విధంగా అడ్డ దారిలో అక్రిడిటేషన్లు పొందే వారిని అడ్డుకోవాల్సిన అవసరం సైతం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఓ జర్నలిస్టుల సంఘం ప్రభుత్వ తొత్తుగా వ్యవహరించి పాత్రికేయులను మోసం చేసిందని విరాహత్ అలీ విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీని ఈ కార్యక్రమంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత టియుడబ్ల్యూజె నూతన రాష్ట్ర కమిటీలో గ్రేటర్ హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కోశాధికారి వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, గౌస్ మొయినుద్దీన్, అనీల్, చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్ బాబా, ప్రధాన కార్యదర్శి అశోక్, హెచ్‌యుజె అధ్యక్షుడు శివశంకర్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.మల్కయ్య, మామిడాల రవీందర్ రెడ్డి, సలీం పాషా, పరమేష్, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డిలను ఈ కార్యక్రమంల సత్కరించారు. కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి కరీం, రంజిత్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## అంటు వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లాంటి ప్రాణాంతక అంటు వ్యాధులు సోకకుండా వర్షాకాలంలో తమ పరిసర ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకొంటూ అప్రమత్తంగా ఉండాలని మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ సూచించారు. ఓల్డ్ సఫిల్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో సానిటేషన్ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, డిఈ వనజలతో కల్సి కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తమ ఇళ్లల్లో వాడి పడేసే పనికి రాని పాత టైర్లు, కొబ్బరి బోండాలు తదితర వస్తువులతో పాటు పూల కుండీలలో నిలువ ఉండే నీటిలో లార్వా పెరిగి దోమగా మారి అంటు వ్యాధులకు కారకమవుతుందని, ఈ కారణంగా నీరు నిల్వ ఉండే వాటిని తమ పరిసరాల్లో లేకుండా చూడాలన్నారు.



## ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**ప్రజాపక్షం/నాగారం :** ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఇందిరా మహిళా పథకం గూర్చి ఆర్పిలతో సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు రాబోయే 5 సంవత్సరాలలో 5 వేల కోట్లతో బ్యాంకు లింకేజి ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఆర్పిలు స్వయం సహాయక సంఘాల మహిళలతో గ్రూపులుగా ఏర్పడి కాంటిన్స్, స్టిచ్చింగ్, పిండి వంటల తయారీ వంటి యూనిట్స్ గూర్చి మహిళలకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్,మేనేజర్ చంద్రశేఖర్,మెప్మా ఏపిఎం నరసింహా, ఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు బౌద్ధ నగర్ కాలనీలో 5 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న పార్కు ప్రహరీ,చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఆయన ప్రారంభించారు.మున్సిపాలిటీని అందరి సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్, కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్,నాయకులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కబ్జా దారుల నుండి కాపాడటంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగ సర్వేయర్లు, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం జెసి చాంబర్‌లో ఆ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటి ఇనస్పెక్టర్, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో సర్వే ల్యాండ్ కింద పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతి మండలంలోనూ ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు.

## అత్యాచారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఆల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళపై ఇటీవల జరిగిన అత్యాచారం సంఘటనలో సాయికిరణ్(28, సలీం (40) అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపులు తీవ్రం చేసారు. ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి నిందితులను మీడియా ముందుకు ప్రవేశ పెట్టి ఈ ఉదంతం విషయంపై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ కలహాలను ఎదుర్కొంటున్న బాధిత మహిళ ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఆటోలో వచ్చి ఫిర్యాదు చేసి అదే ఆటోలో తిరుగు ప్రయాణమైంది. మార్గ మధ్యంలో లోతుకుంట ప్రాంతంలోని ఓ బార్‌లో పీకల దాకా మద్యం సేవించిన ఆటో డ్రైవర్ స్నేహితుడు ఆటో ఆపి ఎక్కాడు. ముందస్తు పథకం ప్రకారం ఆటోను ఆల్వాల్, సుచిత్ర తదితర ప్రాంతాల్లో తిప్పుతూ చివరికి లోతుకుంటలోని గణేష్ దేవాలయం సమీపంలోని స్మశానం వద్దకు తీసుకొని వెళ్లి ఆటోలో కూర్చొన్న మహిళను బెదిరించి వారిద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. వీరికి మరో ఇద్దరు నిందితులు సైతం సహకరించారు. బాధిత మహిళ చివరికి ఎలాగో చాకచక్యంగా వారి నుండి తప్పించుకొని పోలీస్ హెల్ప్‌లైన్ 100 నంబరుకు డయల్ చేసి తనపై జరిగిన ఉదంతాన్ని తెలిపింది. దీంతో మహిళ ఉన్న ప్రాంతానికి బొల్లారం పోలీసులు చేరుకొని సమీపంలో ఉన్న బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వెళ్లటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బొల్లారం పోలీసులు వెంటనే జీరో ఎఫ్‌ఆర్‌ఐ నమోదు చేసి సంఘటనా స్థలానికి చెందిన ఆల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేసారని డిసిపి తెలిపారు. పేట్‌బషీరాబాద్ ఎసిపి పర్యవేక్షణలో ఆల్వాల్ సిఐ రాహుల్‌దేవ్, మేడ్చల్ ఎస్‌ఓటి, సిసిఎస్ క్లూస్ టీంలు సంయుక్తంగా కొనసాగించిన దర్యాప్తు ఫలితంగా ఇద్దరు నిందితులను అరెస్టు చేసామని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వీరిని త్వరలోనే పట్టుకొంటామని ఆయన తెలిపారు.

## రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం అడ్డగింత

పనులు ఆపేది లేదన్న మున్సిపల్ కమీషనర్

**ప్రజాపక్షం/తాండూరు :** పాత తాండూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జీ నిర్మాణం పనులకు మరో మారు అడ్డ తలిగారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పాత తాండూరు వాసులు పలు మార్లు మంత్రులకు, ఉన్నాతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు ఎంఎల్ఎ మనోహర్ రెడ్డి చోరవతో పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఫ్లైఓవర్ నిర్మాణంతో తమ ఇండ్లు, భూములు కోల్పోతున్నామని కొందరు అట్టి పనులను అడ్డుకుంటున్నారు. అట్టి పనులను మంగళవారం కొందరు అడ్డుకోవడం వివాదస్పదంగా మారింది. మరో పక్క మున్సిపల్ అధికారులు స్థానికుల అభిప్రాయ సేకరణకు సిద్ధమైంది. ఇట్టి విషమై మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మున్సిపల్ అధికారులు అక్కడి వెళ్ళి అభిప్రాయం సేకరణకు చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ శోభరాణి బాధితులకు పరిహారం అందించాలని, ఫ్లైఓవర్ వెడల్పు, పొడవును తగ్గించాలని, లేకుంటే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు మాత్రం మేజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు పనులను కొనసాగిస్తామని, పనులు ఆపేది లేదని తేల్చి చెప్పారు.ఈ చర్చలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రావుఫ్, బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ శోభరాణి, మాజీ కౌన్సిలర్ జుబేర్ లాల, కౌన్సిలర్‌లు ప్రభాకర్‌గౌడ్, బొంబినా, వరాల శ్రీనివాస్‌రెడ్డి నాయకులు నయుంఖాన్,పాత తాండూరు పెద్దలు ఉన్నారు.

## మాత,శిశు ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరులోని ప్రభుత్వ మాత శిశు ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. శిశువు మృతితో బాధిత కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యమే కారమంటూ ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా బంటారం మండల పరిధి రేగడి మైలారం గ్రామానికి చెందిన శివకుమార్ భార్య కవిత ఆదివారం పురటి నొప్పులతో తాండూరులో మాత, శిశు ఆసుపత్రికి వచ్చారు. ఉదయం ఆసుపత్రిలో చేరితే రాత్రికి ప్రసవం జరగడంతో మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు పుట్టి కొద్ది సేపటికే పసికందు మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు మాత్రం తమ భార్య ప్రసవ సమయంలో వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే తన కుమారుడు మృతి చెందాడని శికుమార్ ఆరోపించారు. మంగళవారం డిసిహెచ్ డాక్ట ర్ ప్రదీప్, మాత శిశు ఆసుపత్రిని సందర్శించారు. జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మూర్తి, ఎంసిహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ అనిల్‌తో కలసి మాత శిశు ఆసుపత్రిలో విచారణ చేపట్టారు. ప్రసవ సమయంలో విధుల్లో ఉన్న గైనాకాలిస్ట్ డాక్టర్ మంజులతో మాట్లాడారు ప్రసవం తరువాత పాప బాగనే ఉందని, శ్వాసకోశ సమస్యలతోనే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మృతిపై సరైన వివరణ ఇవ్వాలని డాక్టర్ మంజులకు మేమో జారి చేసినట్లు తెలిపారు.

## గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడ :** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడ, రాజీవ్ గృహకల్ప ప్రధాన రహదారి గుంతలమయంగా తయారై వాహనదారులు ఇబ్బందులకు గురువుతున్నారని స్థానిక కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కౌన్సిలర్,వాహన దారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

### మల్కాజిగిరి నియోజకవర్గంలో బోనాలు ఉత్సవాలకు

## రూ.61 లక్షల 75 వేలు పంపిణీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఆలయాల్లో బోనాలు ఉత్సవాలు నిర్వహించేందుకు గాను ప్రభుత్వ దేవాదాయ శాఖ ద్వారా రూ.61,75,400 మంజూరయ్యాయని స్థానిక ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, ప్రభుత్వ ఛీప్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీరు ఐలయ్యలు తెలిపారు. వీటికి సంబంధించిన చెక్కులను ఆలయాల నిర్వాహకులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణా సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను వైభవంగా నిర్వహించాలని, రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, శాంతి శ్రీనివాసరెడ్డి, సబిత అనీల్ కిషోర్ గున్నాల సునీత శేఖర్‌యాదవ్, రాజ్యలక్ష్మి , బిఆర్‌ఎస్‌కు చెందిన పరశురాం రెడ్డి, జెఎసి వెంకన్న, హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు పర్యవేక్షించిన డిఇ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత కాలంలో సిసి రోడ్డు పనులు పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి డివిజనల్ ఇంజనీర్ మహేష్ సంబంధిత కంట్రాక్టర్, పర్యవేక్షణా సిబ్బందికి సూచించారు. మౌలాలిలోని హనుమాన్‌నగర్‌ఆర్టీసీ కాలనీలో దీర్ఘకాలంగా నిలిచి పోయి ఎట్టకేలకు తిరిగి ప్రారంభమైన సిసి రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఆయనతో పాటు స్థానిక బిజెపి నాయకుడు మోహన్‌యాదవ్,రాకేష్, కిరణ్, సంతోష్ గుప్తా, శేఖర్ తదితరులు డిఇ వెంట ఉన్నారు.

## మర్పల్లి మండల అధ్యక్షుడుగా సురేష్



**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా గ్రామని కి చెందిన మాజీ సర్పంచ తుమ్మల సురేష్ నియమితు లు అయ్యారు. మంగళవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్ర సాద్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యాకర్తలు పాల్గోన్నారు.

## క్రీడ

# టీ20 కెప్టెన్ సూర్యకుమార్?

టీ20 వరల్డ్ కప్2026ని దృష్టిలో పెట్టుకుని టీమిండియా కొత్త కెప్టెన్‌ను సిద్ధం చేస్తున్నారు. నయా కోచ్ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ నేతృత్వం లోని సెలక్టర్లు తీవ్రంగా చర్చించి హార్దిక్ పాండ్యను భవిష్యత్ కెప్టెన్ ప్రణాళిక నుంచి పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్ కప్పు భారత్ విశ్వవిజేత నిలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్ మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టీ20లకు గుడ్‌బై చెప్పాడు. దీంతో టీ20 ఫార్మాట్‌లో భారత సారథి స్థానం ఖాళీ అయ్యింది. అయితే రోహిత్ గైర్హాజరీలో మొన్నటివరకు హార్దిక్ పాండ్య టీ20ల సిరీస్‌లకు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించాడు. దీంతో రోహిత్ అనంతరం హార్దిక్‌కే ఫ్యూచర్ కెప్టెన్ అని అందరూ ఫిక్స్ అయ్యారు. కానీ కెప్టెన్సీ రేసులో కొత్త పేరు ప్రతిపాదనలోకి వచ్చింది. సూర్యకుమార్ యాదవ్‌ను సారథిగా తీర్చిదిద్దాలని గంభీర్, కోచ్‌లు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రోహిత్, హార్దిక్ గైర్హాజరీలో సూర్యకుమార్ యాదవ్ ఓ టీ20 సిరీస్‌కు సారథిగా బాధ్యతలు నిర్వర్తించాడు. కానీ సీనియర్లు దూరమవ్వడంతో సూర్యకు ఆ ఛాన్స్ దక్కింది. అయితే ఇప్పుడు ప్రణాళికలు పూర్తిగా మారిపోయాయి. టీ20 వరల్డ్ కప్2026 వరకు సూర్యనే టీ20లకు కెప్టెన్‌గా కొనసాగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు జాతీయ మీడియా రాసుకొచ్చింది. దీంతో జులై 27 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక టీ20 సిరీస్‌కు సూర్య కెప్టెన్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.



**సూర్యనే ఎందుకు?**
రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కెప్టెన్సీ రేసులో చాలా పేర్లు వినిపించాయి. హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, రుతురాజ్ గైక్వాడ్ శుభ్‌మన్ గిల్ రేసులో నిలిచారు. వీళ్లతో పాటు ఐపీఎల్ 2024 విజేత శ్రేయస్ అయ్యర్ పేరు కూడా చర్చల్లోకి వచ్చింది. అయితే హార్దిక్ వరుస గాయాలతో జట్టులో రెగ్యులర్‌గా ఉండట్లేదు. ఇక రాహుల్, శ్రేయస్, రుతురాజ్‌లకు జట్టులో స్థానమే ప్రశ్నార్థకం. కెప్టెన్సీలో గిల్ ఆశించినంతగా ఆకట్టుకోలేకపోయాడు. బుమ్రా మాత్రం కెప్టెన్సీ విషయంలో సూర్యకు గట్టి పోటీ ఇచ్చాడు. వన్డే వరల్డ్ కప్ ముందు ఐర్లాండ్‌తో సిరీస్‌లో భారత జట్టును బుమ్రా నడిపించాడు కూడా. కానీ పనిభారంతో పాటు కెప్టెన్సీ ఒత్తిడి బుమ్రాపై తీసుకురావద్దని బీసీసీఐ సూర్యను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాక సూర్య గత కొన్నేళ్లుగా టీ20 బ్యాటర్లలో టాప్ 2లోపే కొనసాగుతున్నాడు. టీ20ల్లో టీమిండియా బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలుస్తున్నాడు. దీంతో సూర్యను ఎంపిక చేయాలని చూస్తోంది.

## గంగూలీ ఆశలు ఆవిరి..!



**న్యూఢిల్లీ :** ఢిల్లీ క్యాపిటల్స్‌కు కోచ్‌గా బాధ్యతలు అందుకోవాలనుకుంటున్న సౌరవ్ గంగూలీ ఆశలు నెరవేరేలా కనిపించట్లేదు. కోచ్‌గా గంగూలీని నియమించాలని ఢిల్లీ ఫ్రాంచైజీ భావించట్లేదని తెలుస్తోంది. దూకుడైన నిర్ణయాలతో జట్టును పరుగులు పెట్టించే కోచ్ కోసం ఫ్రాంచైజీ వెతుకుతోందని సమాచారం. అంతేగాక దాదాను పక్కనపెట్టడానికి మరో కారణం ఉందని ఫ్రాంచైజీ వర్గాలు పేర్కొన్నాయి. దిగ్గజ ప్లేయర్ రికీ పాంటింగ్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ వేటు వేసిన విషయం తెలిసిందే. ప్రధాన కోచ్ బాధ్యతల నుంచి తప్పించింది. ఏడేళ్లుగా కోచ్ పదవిలో కొనసాగుతున్న పాంటింగ్ జట్టుకు టైటిల్ అందించలేకపోయాడు. గత మూడు సీజన్లలో ఢిల్లీని ప్లేఆఫ్స్‌కు కూడా చేర్చలేకపోయాడు. దీంతో పాంటింగ్‌తో ఉన్న కాంట్రాక్ట్‌కు ఫ్రాంచైజీ ముగింపు పలికింది. 2018లో పాంటింగ్ ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరుకున్నాడు. ఆదిలో తన మార్క్‌ను చూపించాడు. 2019 నుంచి వరుసగా మూడు సీజన్లలో జట్టును ప్లేఆఫ్స్కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. 2020లో ఢిల్లీని ఫైనల్స్కు కూడా చేర్చాడు. కానీ టైటిల్ పోరులో తడబడి ఢిల్లీ ట్రోఫీని కోల్పోయింది. ఆ తర్వాత జట్టు వరుసగా పేలవ ప్రదర్శన చేస్తోంది. అయితే పాంటింగ్ తప్పిస్తున్నట్లు ఫ్రాంచైజీ ప్రకటించకముందే ఆ జట్టు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ సౌరవ్ గంగూలీ మీడియాకు తెలిపాడు. అంతేగాక కోచ్ బాధ్యతలను తాను అందుకోవడానికి ఆసక్తిగా ఉన్నానని గంగూలీ పేర్కొన్నాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీతో చెబుతానని, కోచ్‌గా ఎంపికైన తర్వాత జట్టు ప్రదర్శన ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నాడు. కాగా, గంగూలీని కోచ్‌గా ఎంపిక చేయడానికి ఫ్రాంచైజీ ఆసక్తితో లేదు. ''ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ క్రికెటర్‌గా గంగూలీ ఇప్పటికే ప్రధాన బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఫ్రాంచైజీతో ఎన్నో పనులు కొనసాగిస్తున్నాడు. అయితే జట్టును దూకుడుగా సిద్ధం చేసే గౌతమ్ గంభీర్ వంటి కోచ్ కోసం ఫ్రాంచైజీ అన్వేషిస్తోంది. అతను మెంటార్‌గా సక్సెస్ అయ్యాడు. అంతర్జాతీయ, దేశవాళీ ప్లేయర్లను ట్రాక్ చేస్తూ ఉంటాడు. వచ్చే సీజన్ ముంగిట మెగావేలం ఉండటంతో ఎవరినైనా తాత్కాలికంగా నియమించాలని ఫ్రాంచైజీ భావించట్లేదు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలనుకుంటుంది'' అని ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి.

## కోహ్లి అన్న.. థ్యాంక్స్: నీరజ్ చోప్రా



పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న భారత క్రీడాకారులకు మద్దతు ఇవ్వాలని అభిమానులకు పిలుపునిచ్చిన స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లికి ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా ధన్యవాదాలు తెలిపాడు. మరో పది రోజుల్లో పారిస్ ఒలింపిక్స్2024 ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. జులై 26 నుంచి మొదలయ్యే ఈ విశ్వక్రీడలు ఆగస్టు 11 వరకు కొనసాగుతాయి. అయితే ఈ అతి పెద్ద క్రీడా ఈవెంట్‌లో బరిలోకి దిగుతున్న భారత క్రీడాకారుల గురించి విరాట్ కోహ్లి స్పెషల్ వీడియా చేశాడు. పతకాలు సాధించాలని శుభాకాంక్షలు చెబుతూ వీడియో విడుదల చేశాడు. ''ఒకప్పుడు భారత్‌ను ఏనుగులు, పాములు ఆడించేవారిగా ప్రపంచం భావించింది. కానీ ఇప్పుడు అంతా మారింది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, గ్లోబల్ టెక్ హబ్‌గా భారత్ అవతరించింది. క్రికెట్, బాలీవుడ్ స్టార్టప్ యునికారన్స్‌తో ఆర్థిక రంగంలో దూసుకెళ్తోంది''. 'ఇక భారత్ ఏదైనా సాధించాల్సి ఉందంటే.. అది ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలే. ఈసారి గతంలో కంటే ఎక్కువ పతకాలు భారత అథ్లెట్లు సాధించాలి. మన సోదర సోదరీమణులు పారిస్‌కు బయల్దేరారు. మెడల్స్ కోసం ఆకలితో పయనమయ్యారు. సగర్వంగా ప్రపంచవేదికపై మువన్నెల జెండాను ఎగరవేయాలని సంకల్పంతో పతకాలు అందుకోవడానికి సిద్ధమైన వాళ్ల ముఖాలను గుర్తుంచుకుందాం. జైహింద్, గుడ్ లక్ ఇండియా'' అని విరాట్ కోహ్లి వీడియోలో పేర్కొన్నాడు. దీనికి జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా రిప్లై ఇచ్చాడు. ఒలింపిక్ అథ్లెట్లకు మద్దతు ఇవ్వాలని తన అభిమానులకు పిలుపునివ్వడంపై బదులిచ్చాడు. విరాట్ కోహ్లికి ధన్యవాదాలు తెలిపాడు. కోహ్లికి థ్యాంక్స్ చెబుతూ ప్రపంచ వేదికగా త్రివర్ణ పతకాన్ని ఎరుగవేస్తామని సింబాలిక్‌గా పోస్ట్ చేశాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణాన్ని గెలిచి చరిత్ర సృష్టించిన చోప్రా ఈసారి కూడా పసిడిపై గురిపెట్టాడు. అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారత ప్లేయర్‌గా నీరజ్ చోప్రా నిలిచిన విషయం తెలిసిందే. పారిస్ ఒలింపిక్స్ లోనూ సత్తాచాటాలని పట్టుదలతో బరిలోకి దిగుతున్నాడు.



## రీల్

# హైదరాబాద్‌లో స్టార్ హీరోల మధ్య 'వార్'

బాలీవుడ్ లో తెరకెక్కిన 'వార్' మూవీ యశ్ రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా 2019లో రిలీజ్ అయ్యి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ గా 'వార్2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు మేకర్స్. దర్శకుడు అయాన్ ముఖర్జీ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తుండగా స్టార్ హీరోలు హృతిక్ రోషన్, జూ.ఎన్టీఆర్ ఈ మూవీలో నటిస్తున్నారు.
దీంతో ఈ సినిమాపై అంచనాలు నెకట్స్ లెవెల్ లో క్రియేట్ అయ్యాయి. ఇక ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నెకట్స్ షెడ్యూల్ హైదరాబాద్ లో జరగనుంది. దీని కోసం భారీ బడ్జెట్ తో ఓ సెట్ కూడా వేస్తున్నారట. ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ షెడ్యూల్ లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ల మధ్య ఓ యాక్షన్ సీక్వెన్స్ ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.
ఈ ఫైట్ సీక్వెన్స్ ఇంటర్వెల్ లో రానున్నట్లు తెలుస్తోంది. ఇది సినిమాకే హైలైట్ గా ఉండనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ సినిమాను అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తుండగా, ఈ సినిమాను 2025 ఆగస్టు 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## పుష్ప2 షూటింగ్ పై లేటెస్ట్ ఇన్ఫో




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, స్టార్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ పుష్ప 2 ది రూల్. ఈ చిత్రం పుష్ప ది రైజ్ చిత్రానికి సీక్వెల్ గా తెరకెక్కుతోంది. రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ను ముందుగా ఆగస్ట్ 15 న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 6 వ తేదీకి వాయిదా పడడంతో, సినిమా షూటింగ్ ను కాంప్రమైజ్ కాకుండా, తెరకెక్కిస్తున్నారు.ఈ చిత్రం క్లైమాక్స్ మరియు ఇతర కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉంది. అయితే ఈ పూర్తి చిత్రీకరణ సెప్టెంబర్ నెలలో కంప్లీట్ కానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ అనంతరం, మేకర్స్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పై ఫోకస్ చేయనున్నారు. మొదటి పార్ట్ తెచ్చుకున్న భారీ క్రేజ్ దృష్ట్యా, రెండో పార్ట్ ను అంతకు మించి మరింత గ్రాండ్ గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం లో ఫహాద్ ఫాసిల్, అనసూయ భరద్వాజ్, ధనంజయ, సునీల్, రావు రమేష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

## 'బచ్చల మల్లి' నుండి మా ఊరి జాతరలో సాంగ్ విడుదల




అల్లరి నరేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ ను క్రియేట్ చేసింది. ఈ సినిమాలో అల్లరి నరేశ్ మరోసారి సీరియస్ పాత్రలో నటిస్తుండటంతో ఈ సినిమాను చూసేందుకు అభిమానులు ఆసక్తిని చూపుతున్నారు. ఇక ఈ సినిమాను సుబ్బు మంగదేవి డైరెక్ట్ చేస్తున్నాడు.
ఈ సినిమా నుండి తాజాగా ఫస్ట్ సింగిల్ సాంగ్ మా ఊరి జాతరలో రిలీజ్ చేశారు మేకర్స్. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ పాట ప్యూర్ ఫోక్ మెలోడిగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటను గౌరహరి, సింధూరి విశాల్ లు పాడారు. అర్ధవంతమైన లిరిక్స్, ఆకట్టుకునే ట్యూన్ తో ఈ పాట ఇంప్రెస్ చేస్తోంది. ఇక ఈ సినిమాలో అందాల భామ అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తోండగా హరితేజ, రావు రమేష్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండ ప్రొడ్యూస్ చేస్తున్నారు. సెప్టెంబర్ లో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

## సరస్వతి గా ఎంట్రీ ఇస్తున్న నివేదా థామస్

అందాల భామ నివేదా థామస్ చాలా రోజుల తరువాత నటించిన తాజా చిత్రం 35 ఇది చిన్న కథ కాదు ఆగస్టు 15న రిలీజ్ కు రెడీగా ఉంది. ఈ సినిమా మధ్యతరగతి కుటుంబంలోని ఎమోషన్స్ నేపథ్యంలో దర్శకుడు నంద కిషోర్ తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాలో నివేదా థామస్ ఓ గృహిణి పాత్రలో నటిస్తుంది.
కాగా ఆమె పాత్రకు సంబంధించిన 35 సెకన్ల ఇంట్రో టీజర్ ను జూలై 17న సాయంత్రం 4.35 నిమిషాలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆమె పేరు సరస్వతి అని.. ఆమె పేరుకు ముందు పొడవాటి సర్ నేమ్ ఉంటుందని ఓ కొత్త పోస్టర్ ద్వారా వారు రివీల్ చేశారు.
ఇక ఈ సినిమాలో విశ్వదేవ్, ప్రియదర్శిలు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా రానా దగ్గుబాటి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు.




## సుప్రీంకోర్టుకు మరో ఇద్దరు కొత్త జడ్జిల నియామకం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టుకు మరో ఇద్దరు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్‌లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. వీరిద్దరి నియామకానికి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. వీరి నియామకంపై రాష్ట్రపతి తాజాగా వెలువరించిన ఉత్తర్వులతో సుప్రీంకోర్టులో మొత్తం జడ్జిల సంఖ్య 34కు పెరిగింది. జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్ మణిపూర్ నుంచి సుర్వోన్నత న్యాయస్థానం జడ్జిగా నియమితులైన తొలి వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ప్రస్తుతం ఆయన జమ్ముకశ్మీర్, లడాఖ్‌లలో చీఫ్ జస్టిస్‌గా ఉన్నారు. ప్రస్తుతం మద్రాస్ హైకోర్టు తాత్కాలిక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా కొనసాగుతున్న జస్టిస్ మహదేవన్ చెన్నైకి చెందినవారు. మద్రాస్ లా కాలేజీ పూర్వ విద్యార్థి. న్యాయవాదిగా ఆయన 9వేలకు పైగా కేసులకు హాజరయ్యారు. తమిళనాడు ప్రభుత్వం తరపున, కేంద్ర ప్రభుత్వం తరపున మద్రాస్ హైకోర్టులో పలు కేసులు వాదించిన ఆయన.. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా, జస్టిస్‌గా పదోన్నతి పొందారు.

## మా ఉద్యమం ఆగదు..

ఢిల్లీకి మళ్లీ ర్యాలీ చేపడతాం : రైతునేతలు

**చండీగఢ్ :** హర్యానా, పంజాబ్‌లను వేరుచేస్తూ శంభు సరిహద్దులో ఏర్పాటు చేసిన దిగ్బంధాలను హర్యానా ప్రభుత్వం తొలగించడంతో మరోసారి రైతులు ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జంతర్‌మంతర్‌లో కానీ, రామ్‌లీలా మైదానంలో కానీ శాంతియుత నిరసనలకు దిగుతామని రైతు సంఘం నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ మంగళవారం తెలిపారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీ ఇవ్వడంతో సహా పలు డిమాండ్లపై రైతులు గత కొన్నాళ్లుగా నిరసలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గత ఫిబ్రవరిలో చేపట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని భద్రతా బలగాలు అడ్డుకోవడంతో అప్పటి నుంచి హర్యానా సరిహద్దుల్లోనే రైతులు బస చేస్తున్నారు. ఘర్షణల క్రమంలో శంభు సరిహద్దు వద్ద అధికారులు రోడ్లు మూసివేసి రాకపోకలను నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని పంజాబ్– హర్యానా హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని పేర్కొంది. అయితే, శాంతిభద్రతల పరిస్థితిని ఉటంకిస్తూ కోర్టు ఆదేశాలపై హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మళ్లీ ఆపితే ప్రభుత్వానిదే బాధ్యత.. కాగా, ఈసారి తమను అడ్డుకున్నా, రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసిన హర్యానా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని జగ్జీత్ సింగ్ దలేవాల్ తెలిపారు. రైతు నిరసనలపై గత మార్చిలో అరెస్టు చేసిన నవదీప్‌సింగ్‌కు సంఘీబావంగా బుధవారంనాడు శాంతియుత నిరసన తెలుపుతామని చెప్పారు. ఫిబ్రవరిలో రైతులు, భద్రతా బలగాలకు మధ్య తలెత్తిన ఘర్షణల్లో బటిండాకు చెందిన 21 ఏళ్ల యువరైతు సుభ్‌కరణ్ సింగ్ పంజాబ్– హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరి వద్ద ప్రాణాలు కోల్పోయాడు.



# హల్వా వేడుకలో గరిటె తిప్పిన నిర్మలమ్మ



**న్యూఢిల్లీ :** జులై 23న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్–2024 రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని కేంద్ర ఆర్థికశాఖ ప్రధాన కార్యాలయం నార్త్ బ్లాక్‌లో సంప్రదాయ హల్వా వేడుక నిర్వహించారు. అధికారులందరికీ ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా హల్వా వడ్డించారు. ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థికశాఖ కార్యదర్శులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రతి సారీ బడ్జెట్‌కు ముందు సంప్రదాయం ప్రకారం కేంద్ర ఆర్థిక శాఖ కార్యాలయంలో హల్వా వేడుక నిర్వహిస్తారు. ఇది ఆర్థికశాఖ ప్రధాన కార్యాలయం బేస్‌మెంట్‌లో జరుగుతుంది. దీనిలో పాల్గొనే సిబ్బంది దాదాపు 10 రోజుల పాటు అక్కడే ఉంటారు. బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే వరకు సిబ్బందికి ఇక్కడే వసతి సౌకర్యాలు కల్పిస్తారు. బంధువులకు కూడా ఫోన్ చేసుకొనే అవకాశం ఈ సిబ్బందికి ఉండదు. అత్యవసరమైతే భద్రతా సిబ్బంది సమక్షంలో మాట్లాడాలి. బడ్జెట్ వివరాలు బయటకు రాకూడదన్న ఉద్దేశంతో ఇలా చేస్తారు.

## 'నీట్' లీకేజీలో మరో ఇద్దరు అరెస్టు

**న్యూఢిల్లీ :** నీట్ యుజి 2024 పరీక్ష పేపర్ లీక్, అవకతవకలకు సంబంధించిన దర్యాప్తులో సిబిఐ వేగం పెంచింది. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తాజాగా మరో ఇద్దరు కీలక వ్యక్తులను కస్టడీలోకి తీసుకుంది. ఇందులో ఓ వ్యక్తి.. పరీక్ష జరగడానికి ముందు జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఉన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి చెందిన ట్రంక్ పెట్టె నుంచి నీట్ పేపర్‌ను తస్కరించినట్లు గుర్తించారు. నీట్ పేపర్ లీక్ చేసినట్లు అనుమానిస్తున్న పంకజ్ కుమార్ అలియాస్ ఆదిత్యను సిబిఐ మంగళవారం అరెస్టు చేసింది. ఐఐటి జంషెడ్‌పుర్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఇతడు.. హజారీబాగ్‌లోని ఎన్‌టిఎకు చెందిన ట్రంక్ పెట్టె నుంచి ప్రశ్నపత్రాన్ని తస్కరించినట్లు సిబిఐ అనుమానిస్తోంది. ప్రశ్నపత్రం లీక్ చేయడంలో ఆదిత్యకు సహాయపడిన రాజు సింగ్ అనే మరో వ్యక్తిని హజారీబాగ్‌లో అదుపులోకి తీసుకుంది. ఈ ప్రశ్నపత్రాలనే రాజు తన గ్యాంగ్ సభ్యులకు దీన్ని చేరవేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో సిబిఐ మొత్తంగా 14 మందిని అరెస్టు చేసినట్లయ్యింది. ఇప్పటికే హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా.. అక్కడ కాలిపోయిన ప్రశ్నపత్రాలను బీహార్ పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఆధ్వర్యంలో మే 5న నీట్ యుజి 2024 పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 4,570 కేంద్రాల్లో దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. అయితే.. 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం. అంతేకాకుండా ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన పలువురు విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం అనుమానాలకు దారితీసింది.

## మరోసారి తెరుచుకోనున్న రత్న భాండాగారం లోపలిగది



**పూరీ :** ఒడిశా పూరీలోని జగన్నాథ ఆలయంలో ఉన్న రత్న భాండాగారం లోపలి గదిని శ్రీ జగన్నాథ ఆలయ అధికార యంత్రాంగం (ఎస్‌జెటిఎ) మరోసారి తెరవనుంది. ఆభరణాలు, విలువైన వస్తువుల లెక్కింపు, మరమ్మతల కోసం 46 ఏళ్ల తరువాత నాలుగు రోజుల క్రితం రత్న భాండాగారాన్ని తెరిచిన విషయం తెలిసిందే. అయితే 12వ శతాబ్దపు ఆలయన ఆవరణలో తాత్తాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లోకి ఆభరణాలను తరలించేందుకు రత్న భాండాగారంలోని లోపలి గదిని గురువారం నాడు మరోసారి తెరవనున్నారు. ఎస్‌జెటిఎ ముఖ్య పాలనా అధికారి అరబింద పాఢీ, జస్టిస్ బిస్వంత్ రాథ్, పూరీ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వైన్, ఇతర అధికారులు హాజరైన సమావేశంలో లోపలి గదిని మరోసారి తెరవాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 18వ తేదీన ఉదయం 9.51 నుంచి మధ్యాహ్నం 12.15 మధ్య తాము మరోసారి తాళాలు తెరిచి భిటారా రత్న భాండాగారంలోకి ప్రవేశిస్తామని సమావేశం అనంతరం జస్టిస్ రాథ్ మీడియాకు తెలిపారు. లోపలి గదిలో ఉన్న విలువైన వస్తువులను తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లోకి మారుస్తామన్నారు. అదే విధంగా గది నిర్మాణం సామర్థ్యాన్ని ఎఎస్‌ఐ సభ్యులు అంచనా వేస్తారన్నారు. తాత్కాలిక స్ట్రామ్ వద్ద సిసిటివి కెమారాలతో పోటు, అగ్నిమాపక రక్షణ చర్యలు, ఇతర అవసరమన అన్ని రకాల చర్యలు చేపడుతామని చెప్పారు. అయితే రత్న భాండాగారం తెరిచే సమయంలో విధించిన ఆంక్షలకు కట్టుబడి ఉండాలని భక్తులకు ఎస్‌జెటిఎ విజ్ఞప్తి చేసింది. ఆభరణాలను తరలించిన తరువాత లోపలి గదిని భౌతికంగా ఎఎస్‌ఐ తనిఖీ చేస్తుందని పాఢీ తెలిపారు

## బీహార్‌లో విఐపి పార్టీ చీఫ్ ముకేశ్ సహానీ తండ్రి దారుణహత్య



**పాట్నా:** బీహార్‌లో ఇండియా కూటమి భాగస్వామ్య వికాశీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) చీఫ్ ముకేష్ సహానీ తండ్రి జితన్ సహానీ దారుణ హత్యకు గురయ్యారు. దర్భంగా జిల్లా సుపాల్ బజార్‌లోని సొంత ఇంట్లో జితన్ సహానీని దండుగుల దారుణంగా నరికి చంపేశారు. మంగళవారం ఉదయం మంచంపై ఆయన మృతదేహాన్ని గుర్తించారు. జితన్ సహానీ హత్యకు గురయ్యారనే విషయాన్ని జిల్లా సీనియర్ పోలీసు అధికారి జగన్నాథ్ రెడ్డి ధృవీకరించారు. విచారణ కోసం పోలీసు బృందాన్ని రంగంలోకి దింపినట్టు ఆయన చెప్పారు. కాగా ఈ హత్య స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కాగా తండ్రి హత్యకు గురైన నివాసానికి ముఖేశ్ సహానీ నివాసం కూడా సమీపంలోనే ఉంది. కాగా ఈ హత్యపై దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సీనియర్ అధికారి జగన్నాథ్ రెడ్డి వెల్లడించారు. జితన్ సహానీకి శత్రువులు ఎవరూ లేరని, దొంగతనం ప్రయత్నంలో హత్య చేసి ఉండొచ్చనే అనుమానం ఉందని చెప్పారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. విఐపి పార్టీ చీఫ్ గతంలో బీహార్ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ చీఫ్‌గా ఉన్నారు. ఈ పార్టీకి ఒబిసి కమ్యూనిటీలో బలమైన మద్దతు ఉంది. ఈ పార్టీ ప్రస్తుతం ఇండియా కూటమిలో ఉంది. ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలతో రాష్ట్రంలో పొత్తు పెట్టుకుంది. జితన్ సహానీని హత్య చేయడంపై ప్రధాన ప్రతిపక్షం ఆర్‌జెడి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ హత్య రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి యాదవ్ అన్నారు. ''బీహార్‌లో ఏం జరుగుతోంది. హత్య వార్త లేకుండా ఒక్కరోజు కూడా గడవడం లేదు. చేతకాని ప్రభుత్వం అధికారంలో ఉంది. వ్యవస్థ కుప్పకూలింది'' అని విమర్శించారు.

## సరిహద్దులో 'ఉగ్ర' కలవరం..

నాలుగు నెలల్లో 22మంది మృతి!

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు కలవరపెడుతున్నాయి. ముఖ్యంగా కథువా, దోడా వంటి సరిహద్దు జిల్లాలు వరుస దాడులతో ఉలిక్కిపడుతున్నాయి. గడిచిన 32 నెలల్లో జరిగిన దాడుల్లో దాదాపు 50 మంది భద్రతా సిబ్బంది సహా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. నాలుగు నెలల్లోనే ఐదు భారీ ఉగ్రదాడులు జరగగా, ఆర్మీ కెప్టెన్‌తో సహా 12 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. మరో 10మంది సామాన్యులు చనిపోగా.. 55 మంది గాయపడ్డారు. సరిహద్దు జిల్లాల్లో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారనే సమాచారంతో భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్‌లతో వారిని మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఉగ్ర దాడులను పరిశీలిస్తే..

* ఏప్రిల్ 22న రాజౌరీ జిల్లాలో ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఉగ్రవాదులు కాల్చి చంపారు.
* ఏప్రిల్ 28న ఉధంపూర్ జిల్లాలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో గ్రామ రక్షక సిబ్బందిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు.
* మే 4న పూంఛ్ జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ఒక వాయుసేన సిబ్బంది చనిపోగా, మరో ఐదుగురు గాయపడ్డారు.
* జూన్ 9న రియాసి జిల్లాలో ఓ పర్యటక వాహనంపై ఉగ్రదాడులు జరిపిన దాడిలో తొమ్మిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 42 మందికి గాయాలయ్యాయి.
* జూన్ 11, 12 తేదీల్లో కథువా జిల్లా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులతో పాటు ఓ సిఆర్‌పిఎఫ్ జవాన్ చనిపోయారు. అదే రోజు దోడా జిల్లాలో ఉగ్రదాడిలో ఐదుగురు రాష్ట్రీయ రైఫిల్స్ సిబ్బంది, ఓ స్పెషల్ పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు.
* జూన్ 26న దోడా జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. * జులై 7 తేదీన రాజౌరీ జిల్లాలోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఇందులో ఓ సైనిక జవాను తీవ్రంగా గాయపడ్డారు.
* జులై 8న కథువా జిల్లాలో జరిగిన దాడిలో ఐదుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.
* జులై 16న దోడా జిల్లాలో జరిగిన ఉగ్రదాడిలో నలుగురు భద్రతా సిబ్బంది అమరులయ్యారు. వీరిలో ఒకరు ఉన్నతాధికారి ఉన్నారు.